
www.jagritiweekly.com
సంపుటి : 75 సంచిక : 18 పుటలు : 52

# జాగృతి

కలి 5124 - శ్రీ శుభకృత్ వైశాఖ అమావాస్య
20-26 ఫిబ్రవరి 2023
వెల : ₹15/-







# వెల్లువెత్తుతున్న వాస్తవాలు

ఇందుకు సంబంధించిన ప్రయత్నం జాతీయ స్థాయిలో, అంతర్జాతీయ స్థాయిలో
జరుగుతున్నా, ఆ మహా మేధో ఉద్యమానికి ఇప్పుడు పూర్తి ఊపు వచ్చింది

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

75 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక

ఆసక్తి కలిగించే విశ్లేషణలు.. జాగృతపరిచే కథనాలు..
చైతన్యం నింపే వాస్తవాలు.. స్ఫూర్తిని నింపే రచనలతో
ఇపుడు జాగృతి వారపత్రిక మరింత కొత్తగా మీ ముందుకు వస్తున్నది.




రండి..
జాతీయభావాల వేదిక
జాగృతి చందాదారులుగా
చేరుదాం.. చేర్పిద్దాం!

**ఏప్రిల్ 1, 2023 నుండి జాగృతి వార్షిక, 5 సంవత్సరాల చందా పెరగనున్నది..**

ఒక సంవత్సర చందా
**రూ.850/-**

విడి ప్రతి
**రూ.20/-**

ఐదు సంవత్సరాల చందా
**రూ.4000/-**

జాగృతి చందాను ఆన్‌లైన్‌లో మీ మొబైల్ నుంచి చెల్లించడానికి
ఇక్కడ ఉన్న క్యు.ఆర్. కోడ్‌లను
గూగుల్ సెర్చ్‌బార్‌లో ఉండే గూగుల్ లెన్స్‌తో స్కాన్ చేయండి.
లేదా క్రిందనున్న లింక్‌లను ఉపయోగించండి.

ఒక సంవత్సర చందా రూ.650/-
http://payit.cc/S18970

**Jagriti Bank A/c details :**
Jagriti Prakashan Trust,
A/c No.920010061405325,
Axis Bank, Kothapet Branch, Hyderabad.
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

ఐదు సంవత్సరాల చందా రూ.3000/-
http://payit.cc/S18973

3-4-228/4/1, Kachiguda, Hyderabad-500027.
Ph : 040-27561453, 9959997013. email : jagritiweeklysub@gmail.com





# తారాతీరంలో భారత కీర్తి

14వ ఎయిరో ఇండియా ప్రదర్శన డిసెంబర్ 13న బెంగళూరులో జరిగింది. ఇందులో దాదాపు వంద దేశాలు పాల్గొన్నాయి. ఇది సామర్థ్యం పెంచుకున్న భారత్ పట్ల ప్రపంచానికి ఏర్పడిన విశ్వాసం ఫలితమేనని ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని మోదీ అన్నారు. ఇవాళ ఈ బెంగళూరు ఆకాశం భారత వైమానిక సామర్థ్యాన్ని విశ్వ వినువీధులలో చాటుతున్నదని కూడా మోదీ అన్నారు. గడచిన ఎనిమిదేళ్లలో రక్షణ రంగం విప్లవాత్మక మార్పులకు వేదికగా మారింది. ప్రస్తుతం 1.5 బిలియన్ డాలర్లుగా ఉన్న రక్షణ రంగ ఎగుమతులను 2024-25 ఆర్థిక సంవత్సరానికి 5 బిలియన్ డాలర్లకు పెంచాలన్నదే దేశం లక్ష్యమని అన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన విమాన విన్యాసాలు ప్రపంచం దృష్టిని ఆకర్షించాయి.

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. And published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.**

జి. తుకారాం సర్క్యులేషన్ మేనేజర్ 040-27561453/9959997013

# జాగృతి చందా – సూచనలు

**5 సం॥ల చందా రూ.3000, సంవత్సర చందా రూ.650, విడి ప్రతి రూ.15**

- అడ్రసులో పేరు, ఇంటి నెం., గ్రామం, మండలం, జిల్లా, పిన్‌కోడ్, మొబైల్ నెం. సమగ్రంగా ఉండాలి. లేకుంటే కంప్యూటర్ ఆమోదించదు.
- తాత్కాలిక రసీదు చేరిన 15 రోజుల తర్వాత చందా నెం., ప్రారంభ తేది వివరాలు మీకు ఎస్.ఎం.ఎస్. చేస్తాం. ఆ వెంటనే సంచిక కూడా అందుతుంది. మీరు చందా నెం. నోట్ చేసుకోవాలి.
- పత్రిక అందకపోతే వెంటనే సంప్రదించగలరు. చిరునామా మారితే కార్యాలయానికి విధిగా తెలపండి.

**చందా కట్టించే వారికి సూచనలు :**

- చందాలు వసూలు చేసి పంపేవారు తమ పూర్తిపేరు, సెల్ నెం. రాయాలి.
- రశీదుపై చందాదారుని పూర్తి చిరునామా, పిన్‌కోడ్, సెల్ నెం., ఈమెయిల్ ఉండాలి. వివరాలు jagritiweeklysub@gmail.comకు మెయిల్ చేయాలి.
- ఆన్‌లైన్/చెక్ ద్వారా కూడా చెల్లించవచ్చు. డబ్బు పంపాక 040-27561453/ 9959997013 నంబర్లకు తెలియజేయాలి.
- మరిన్ని వివరాలకు చందాపుస్తకంలో మొదటి రసీదు వెనుక చూడగలరు.

**చందా పంపవలసిన చిరునామా :**

- 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-500 027.

**జాగృతి బ్యాంకు ఖాతా వివరాలు :**

- **A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch. IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**
- చెక్కు, డిడిపై **Jagriti Prakashan Trust** అని ఆంగ్లంలో రాయాలి.

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)**

| | | |
|---|---|---|
| కె. దుర్గారెడ్డి | అసోసియేట్ ఎడిటర్ | |
| కె. హరీష్ | సబ్ ఎడిటర్ | 9959991304 |

డిజైనర్ : సిహెచ్. కుమార్

తెలుగు నేలకు గెరిల్లా పోరాటాన్ని పరిచయం చేసిన అల్లూరి సీతారామరాజు గాథ, బ్రిటిష్ జాతిని సాగనంపాలన్న ఆశయంతోనే ఒడిశా గడ్డ మీద ఉద్యమించిన బక్షి జగబంధు బిద్యాధర మహాపాత్రా వంటి వారి చరిత్ర భారతదేశం మొత్తానికి తెలియవలసి ఉన్నదా? లేదా? కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఫిబ్రవరి 13న లోక్‌సభలో సంధించిన ప్రశ్న ఇది. ఇంతవరకు అలాంటి మహనీయుల చరిత్రలను దేశం మొత్తానికి అందించే ప్రయత్నం జరగలేదన్నది నిజమే. కొందరినే, కొన్ని కుటుంబాలనే దేశభక్తి అనే పల్లకీలో మోస్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలు గడిచిపోయిన తరువాత చరిత్ర రచనకు సంబంధించి ఇలాంటి అవాంఛనీయ ముగింపునకు రావడం విషాదకరమే. కానీ తమ ప్రభుత్వం 'చరిత్ర రచనలో కనిపిస్తున్న ఇలాంటి శూన్యభాగాలను పూరించే పని' స్వీకరించిందని మంత్రి సభ్యులకు తెలియచేశారు. శుభం.

ఇది చరిత్రాత్మక ప్రకటన. దేశం మొత్తం తెలుసుకోవలసిన వార్త (ఫిబ్రవరి 14, ది హిందు) కూడా. మంత్రి జవాబు చాలామందికి సంతోషం కలిగించేదే. చరిత్ర రచన అన్న అంశం పార్లమెంట్ వరకు వెళ్లడం కీలక పరిణామమే. భారతీయులకు చరిత్ర పట్ల శ్రద్ధ, స్పృహ స్వల్పమేనన్న చేదునిజాన్ని ఇప్పటికైనా గుర్తించడం మొదలయిందని ఈ పరిణామంతో అనుకోవచ్చు. అసలు ప్రశ్న-కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలో పనిచేసే భారత చరిత్ర పరిశోధన మండలి (ఐసీహెచ్ఆర్) చరిత్రను తిరగరాస్తుందా? అందుకు మంత్రి ఆచితూచి సమాధానం ఇచ్చారు. అయినా ఆ జవాబు ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ఆశయానికి అద్దం పట్టేదే. కేంద్రం ఆశయం చరిత్రను విస్తరించడమేనని మంత్రి వివరించారు. ఎందుకు విస్తరించవలసి వచ్చిందో చక్కగా విశ్లేషించారు. ఆ సందర్భంలో తెచ్చినదే అల్లూరి, బక్షిల ప్రస్తావన. చరిత్ర విస్తరణ అంటే-చరిత్ర పుటలకు చేరకుండా మరుగునపడిన వ్యక్తులకూ, ఘట్టాలకూ చోటు కల్పించడమే. తాజాగా ప్రధాని నరేంద్ర మోదీ దృష్టికి వచ్చిన ఒక అంశం గురించి కూడా మంత్రి సభ్యులకు

**శాలివాహన 1944 శ్రీ శుభకృత్ వైశాఖ అమావాస్య**

## లోపలి పేజీలలో...




ముఖపత్ర కథనం
**వెల్లువెత్తుతున్న వాస్తవాలు** 6లో



మహిళ
**విదేశంలో మరో భారతతేజం 'నటాషా'** 16లో



9
ధారావాహిక నవల
**వరాహమిహిర**
- పాలంకి సత్య 20లో

# జాగృతి

## సంపాదకీయం

తెలియచేశారు. అది కూడా మరుగున పడిన మహోన్నత ఘట్టమే. ఈ మధ్య మోదీ మాన్‌గఢ్ ధామ్ దగ్గర పర్యటించారు. గోవింద్ గురు అనే గిరిజన నేత నాయకత్వంలో బ్రిటిష్ ప్రభుత్వం మీద పోరాడిన నేల అది. 1913లో జరిగిన ఆ పోరాటంలో 1500 మంది గిరిజనులను బ్రిటిష్ అధికారులు చంపారు. స్వామి శ్రద్ధానంద వంటివారి లెక్కల ప్రకారం జలియన్‌వాలా బాగ్ దురంతంలో మృతులు దాదాపు 1100. బాగ్ రక్తపాతం కదిలించిన తీరులో మాన్‌గఢ్ ధామ్ ఊచకోత స్వతంత్ర భారత చరిత్రకారులనో, ప్రభుత్వ పెద్దలనో ఎందుకు

# పార్లమెంట్‌లో చరిత్ర పాఠం

కదిలించలేదు? ఇది త్యాగం పట్ల చూపించిన వివక్ష అని ఎవరైనా అంటే వారికి ఉలుకెందుకు? బీజేపీ ప్రభుత్వం సరిదిద్దుకోమంటున్నది ఇలాంటి లోటుపాట్లనే.


మంత్రి లోక్‌సభ సాక్షిగా చెప్పిన మరికొన్ని అంశాలను కూడా దేశం గుర్తించాలి. ఈ ప్రభుత్వం చరిత్ర మొత్తాన్ని ఒకే నేలకు సంబంధించిన గతంగా, బాధగా, పోరాటంగా నమోదు చేసుకోవడమనే విశ్వసిస్తున్నది. అంతేతప్ప ఉత్తర భారత ప్రాంత అణచివేత, వారి బాధ; దక్షిణ దేశ విషాదం, వారి దుఃఖం అంటూ వేర్వేరుగా చూడడం లేదని అన్నారాయన. ఈ చరిత్ర అంతా ఒకే నేల మీద నివసించిన, ఒకే ప్రాంత ప్రజల గతంగానే చరిత్రపుటలలో కనిపించాలన్నది ప్రభుత్వ భావన. చరిత్ర అంటే దేశం మొత్తానిది అన్న భావనను ఛిద్రం చేస్తున్నవే చరిత్ర రచనలో వచ్చిన శూన్యాలు. కాబట్టి వాటిని పూరించడం అనివార్యం. అప్పుడే ఒక సమగ్ర చరిత్రనూ, అన్ని వర్గాల త్యాగాలకు అద్దం పట్టే చరిత్రనూ, అన్ని ప్రాంతాల ప్రాతినిధ్యాన్ని ప్రదర్శించే చరిత్రనూ రచించుకోవలసిందే.

సంస్కృతి, భాష కూడా చరిత్రను నిర్దేశిస్తాయి. ఈ దేశంలో అత్యంత పురాతన భాష తమిళమేనని ప్రభుత్వం నమ్ముతున్నదని మంత్రి వెల్లడించారు. ఉత్తర భారతంలోని పురాతన పుణ్యక్షేత్రం కాశీలో తమిళ సంగమం ఏర్పాటు చేయడం ఉద్దేశం కూడా ఇదేనని అన్నారు. అన్ని సంస్కృతులను మా ప్రభుత్వం సమంగా గౌరవిస్తుంది. అన్ని భాషలను ఒకే విధంగా సమ్మానిస్తుందని కూడా ఆయన ప్రకటించారు. ఇక దీని మీద చర్చ ఎందుకు అని మంత్రి ప్రశ్నించడం సరైనదే.

ఆజాదీ కా అమృత్ మహోత్సవాలు దేశం గతం మీద సమగ్ర దృక్పథాన్ని కలిగించడానికి దోహదం చేస్తున్నాయి. సమగ్ర చరిత్ర అనగానే కాషాయీకరణకు కుట్ర అంటూ, సంస్కృతి రక్షణ అంటే హిందూత్వ అంటూ బుసలు కొట్టేవారికి మంత్రి ఇచ్చిన జవాబు కనువిప్పు కలిగించే విధంగానే ఉంది. వారి దృష్టిలో ఏది చరిత్ర? హిందూ దేవాలయాల శిథిలాలలో, మతం మారినా మారని భారతీయుల ఇంటి పేర్లలలో కనిపించే ఒక కాలపు మతోన్మాదాన్నీ, దాని రక్తదాహాన్ని మరుగుపరచడమే. పైగా అలా మరుగు పరిచిన చరిత్రతో దేశంలో సుహృద్భావం వెల్లువెత్తుతుందని చెప్పడం మరొక దగా. భారతదేశ గతమంతా ఢిల్లీ కేంద్రంగానే తిరిగిందనుకోవడం అసమగ్రదృష్టి. ఈ వాదం చరిత్ర రచనలో దక్షిణ భారత ప్రాంతానికి అన్యాయం జరిగిందనే అభిప్రాయానికి కూడా తావిచ్చింది. ఉత్తరాదిన, దక్షిణాదిన కూడా యావద్భారతావనిని ఏలిన వంశాలు వెలిశాయి. కానీ ఈ వాస్తవం విస్మృతికి గురౌతున్నది. మనం గతం, మన పూర్వికులు భారతదేశాన్ని ఏ కోణం నుంచి కూడా ఉత్తరం, దక్షిణం, ఈశాన్యం అంటూ వేర్వేరు ముక్కలుగా చూడలేదన్న దృష్టి మాత్రమే, మనం వేర్వేరు కాదు అన్న భావన నేటితరంలోను అంకురింప చేస్తుంది. కల్హణుని సాక్షిగా అలాంటి శూన్యాల పూరించే పనితోనైనా భారతచరిత్ర సమగ్రమవుతుందని ఆశిద్దాం. ★

20 ఫిబ్రవరి 2023, సోమవారం

అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్




40లో

కథ

**ప్రారంభోత్సవం!**

– ఎస్. ఘటికాచలరావు






| | | |
|---|---|---|
| ధనిక రాష్ట్రం నుంచి అప్పుల కుప్పగా.. (తెలంగాణ) | – | 13 |
| రాజధానిగా విశాఖ కలేనా? (ఆంధ్రప్రదేశ్) | – | 14 |
| ఆయన రాహులేనా! ఆయన దెయ్యమా? (చర్చ) | – | 23 |
| యాదాద్రీశా! జయతు.. జయతు (ప్రత్యేక వ్యాసం) | – | 26 |
| స్వభాష (సాహిత్యం) | – | 32 |
| మా బంధం జాతీయ విధానాలకు.. (ముఖాముఖీ) | – | 35 |
| మహిళా ఐపీఎల్ అ'ధర'హో! (క్రీడ) | – | 43 |
| 'అమిగోస్' మిత్రులు కాదు.. శత్రువు! (సినిమా) | – | 50 |

చారిత్రక వాస్తవాలనే కాదు, వర్తమాన సమాజంలోని సత్యాలనూ మసిపూసి మారేడుకాయ చేస్తున్న సమయంలో సత్యాన్వేషణ అవసరాన్ని దేశానికి ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ సరిగ్గా గుర్తు చేసింది. అలా మహోపకారం చేసింది. ఉదారవాదులూ, కమ్యూనిస్టులూ, కాంగ్రెస్ తైనాతీలు పెడుతున్న చిత్రహింస నుంచి వాస్తవాలు బయటపడే శుభ ఘడియలను అమృత్ మహోత్సవ్ ముందుకు తీసుకువచ్చింది. గడచిన పాతిక ముప్పయ్ సంవత్సరాలుగా ఇందుకు సంబంధించిన ప్రయత్నం జాతీయస్థాయిలో, అంతర్జాతీయస్థాయిలో జరుగుతున్నా, ఆ మహా మేధో ఉద్యమానికి ఇప్పుడు పూర్తి ఊపు వచ్చింది. వక్రీకరణల నుంచి వాస్తవాలు విముక్తమవుతున్నాయి. వక్రభాష్యాల నుంచి సాంత్వన పొందుతున్నాయి. హిందుత్వ కేంద్రబిందువుగా సాగుతున్న ఈ రాక్షస యుద్ధ శైలికి ప్రతిఘటన బలపడింది. నగరాలలో ఉంటూనే విశ్వవిద్యాలయాలలో ఉద్యోగులుగా, న్యాయవాదులుగా, హక్కుల కార్యకర్తలుగా, సామాజిక కార్యకర్తలుగా, సాంస్కృతిక కార్యకర్తలుగా సంచరిస్తున్న మేధో ఛద్మవేషధారులు చేసే భారత వ్యతిరేక వాదనల మీద ప్రతిదాడి ఊపందుకుంది. చరిత్ర రచనను వక్రీకరిస్తే జాతిని ద్వితీయ శ్రేణి పౌరులుగానే ఉంచవచ్చునన్న తెల్లజాతి వ్యూహమే వీరూ కొనసాగిస్తున్నారు. కానీ వీరంతా ప్రచారం

# వెల్లువెత్తుతు

రాజకీయ, సైద్ధాంతిక కుట్రతో దాచి పెట్టిన వేలాది నిజాలను వెలికితీసే పని ఇవాళ జరుగుతున్నది. అందుకు తగిన సామాజిక వాతావరణం ఉంది. ఆత్మ గౌరవం ఆసరాగా దేశం నడవడానికే ఇదంతా. అందుకు గతంలోని నిజాలు, వర్తమాన సమాజంలోని వాస్తవాలూ రెండూ అవసరమే. ఆర్‌సి మజుందార్, సీతారాం గోయెల్, విల్ డ్యురాంట్, డేవిడ్ ఫ్రాలే, విక్రమ్ సంపత్, ఆచార్య ఎస్‌వి శేషగిరిరావు వంటి ఎందరో గతంలోని వాస్తవాల నిగ్గు తేలిస్తే, 'అర్బన్ నక్సల్స్' వంటి పుస్తకంతో వివేక్ అగ్నిహోత్రి వంటివారు వర్తమాన కాలాన్ని కమ్మేయాలని చూస్తున్న కుహనా మేధావుల కుతంత్రం గురించి, వామపక్ష తీవ్రవాదంలోని అరాచకత్వాన్ని చెప్పారు. వీరు వెల్లడించిన వాస్తవాలకు ఒక అంతస్సూత్రం కనిపిస్తుంది. అది వాక్‌స్వాతంత్ర్యం పేరుతో హిందూధర్మాన్ని కించపరచడమే. కాలానికి తగిన వాదనలు చేయకపోవడం కూడా వారందరి కుట్రలో భాగమే. ఒక తప్పిదాన్ని, ఒక ప్రాంత దురాచారాన్ని మొత్తం హిందూజాతికి అంటగట్టడం కూడా సర్వసాధారణం. అంతిమంగా భావి భారతపౌరులను నిత్యం డోలాయమానంలో ఉంచాలన్న ప్రయత్నమేనని అర్థమవుతుంది.

అర్థంలేని ప్రశ్నలకూ, కుతర్కాలకూ జవాబులు ఇచ్చుకోవలసిన భావదారిద్ర్యపు యుగంలో జాతీయవాదులు నోరు విప్పక తప్పడం లేదు. చరిత్రలో జరిగిన ఆ తప్పులే పునరావృతం కావడానికి వీలైన పరిస్థితుల వైపునకు ప్రజలను నెడుతున్న వారికీ, ఆ ప్రయత్నాన్ని భగ్నం చేయవలసిన అవసరాన్ని గుర్తించిన వారికీ జరుగుతున్న యుద్ధంలో వాస్తవాలు వెల్లడి కావడమే ప్రధానం. ఆ యుద్ధం సరైన సమయంలోనే మొదలయింది. వర్తమానం మీదనే కాదు, చరిత్ర మీద కూడా బ్రాండ్‌లు వేయాలన్న అత్యుత్సాహమే ఈ యుద్ధానికి నాంది పలికింది. భారత సమైక్యత కోసం, భారతీయ ఆత్మ కోసం ఈ యుద్ధంలో గెలవవలసిన అవసరం ఉంది. గెలుస్తున్నాం కూడా. వందేమాతరం ఉద్యమంతో, బెంగాల్ కేంద్రంగా పనిచేసిన తీవ్ర జాతీయవాద సంస్థ అనుశీలన్ సమితితో డాక్టర్జీ అనుబంధం ఎవరూ కాదనలేనిది. ఆ కాలంలో ప్రముఖ జాతీయ కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ బాలకృష్ణ మూంజే అనుచరునిగా డాక్టర్జీ ఉన్నారు. బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా జరిగిన నిరసనలలో పాల్గొన్నందుకు ఆయన మీద సెక్షన్ 180 కింద కేసు నమోదు చేశారు. అనుశీలన్ సమితి ప్రధాన పాత్ర వహించిన అలీపూర్ కుట్ర కేసులో దొరికిపోయిన వారికి న్యాయ సహాయం అందించడానికి ప్రయత్నించినవారిలో డాక్టర్జీ ఒకరు. అనుశీలన్ సమితిలో డాక్టర్జీ నిర్వహించిన భూమిక గురించి త్రైలోక్యనాథ్ చక్రవర్తి రాసిన 'జైల్ మే తీస్ వర్ష్' (జైలులో మూడు దశాబ్దాలు) పుస్తకంలో స్పష్టంగా ప్రస్తావించారు. ఈ పుస్తకంలో ఆయనే ప్రచురించిన సహచర స్వాతంత్ర్య సమరయోధుల ఫొటోలలో డాక్టర్జీ ఫొటో కూడా ఉంది. అలీపూర్ కుట్ర కేసులో (1908) అరవింద ఘోష్, బరీంద్ర ఘోష్, ఉల్లాస్కర్ దత్ సహా 37 మంది నిందితులు. ఈ కేసు విచారణ సమయంలోనే డాక్టర్జీ వైద్య విద్య కోసం నాగపూర్ నుంచి కలకత్తా చేరారు. అసలు ఢాకా అనుశీలన సమితి వ్యవస్థాపకుడు విప్లవకారుడు పులిన్ బిహారీదాస్‌తో ఉన్న పరిచయంతోనే డాక్టర్జీ కలకత్తా వెళ్లారు. అనంతర కాలాలలో భారత జాతీయ కాంగ్రెస్ రాష్ట్ర కమిటీలో సభ్యులయ్యారు. గాంధేయమార్గంలో ఉద్యమించి కొద్దికాలం జైలు జీవితం అనుభవించారు. ఆగస్ట్ 19, 1920లో దేశద్రోహం కేసులో ఆయనకు ఏడాది జైలు శిక్ష పడింది. కానీ డాక్టర్జీ కొంచెం భిన్నంగా ఆలోచించారు. ఉద్యమం కోసం ప్రాణత్యాగం తుది గమ్యం మాత్రమే. తొలి ప్రాధాన్యం– జీవించి ఉంటూ ఉద్యమాన్ని నడపడం, స్వరాజ్య లక్ష్యాన్ని సాధించడం. స్వాతంత్ర్యం వచ్చితీరాలన్న ఉగ్ర దీక్ష, సమగ్ర కాంక్ష; దీనితో ఆవిర్భవించే స్వతంత్ర భారతదేశ స్వరూపస్వభావాల గురించి భావనలూ ఆ ఆలోచనలో అంతర్భాగంగా ఉన్నాయి. జూలై 12, 1922న డాక్టర్జీ విడుదలై వచ్చినప్పుడు నాగపూర్‌లోని వెంకటేశ్ నాట్యగృహలో అభినందన సభ జరిగింది. మోతీలాల్ నెహ్రూ, విఠల్‌భాయ్ పటేల్, సి. రాజగోపాలాచారి, డా. ఎంఏ అన్సారీ పాల్గొన్నారు.





చేసినట్టు చరిత్రలో భారతజాతి దాస్యాన్ని ఆమోదించలేదు. ధర్మాన్ని తాకట్టు పెట్టలేదు. పురాతన భారతానికి శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం లేదన్న ఆరోపణ, శాస్త్రీయ దృక్పథం మృగ్యమన్న వ్యాఖ్య శుద్ధ అబద్ధం. ఇప్పుడు ఈ అబద్ధాలకే చుక్కెదురవుతోంది. వాస్తవాలు వెల్లువెత్తుతున్నాయి. ఇదంతా గొప్ప చరిత్ర కలిగిన భారతజాతి పురోగమనానికీ, సగౌరవంగా లక్ష్యాన్ని చేర్చడానికీ ఉపయోగపడేదే. హిందూత్వకు, భారతీయతకు ఏ చేటు వచ్చినా ఆర్ఎస్ఎస్ ఆదుకోవాలన్న దృక్పథమే సమాజంలో ఉంది. ఇప్పుడు కూడా మన గతంలోని మంచిని చెప్పడం, వాస్తవాలు చెప్పడం, తప్పులను అంగీకరించడం, అదే సమయంలో సరిదిద్దుకోవడం అనే బాధ్యతను కూడా సంఘమే స్వీకరించింది. కానీ ఇది దేశ పునర్నిర్మాణం కోణం నుంచి మాత్రమే సంఘం స్వీకరించింది. భావదాస్యం నుంచి బయటపడడమే ధ్యేయంగా చేపట్టింది. మనదైన ప్రతిభ, సామర్థ్యం వెలికి తీయడానికి మార్గంగా ఉపయోగించుకుంటున్నది. ఈ యజ్ఞంలో సంఘంతో సంబంధం లేనివారు కూడా పలువురు పాల్గొంటున్నారు. అంటే వాస్తవాలు గుర్తించే పనిని, సేకరించే బాధ్యతని సమాజం సమష్టిగా స్వీకరిస్తున్నది. ఇది మరింత స్వాగతించదగినది. ఆ ప్రయత్నాన్ని మనసారా స్వాగతిస్తూ, ఇంతదాకా జరిగిన ప్రయాణంలో పడిన కొన్ని అడుగులు చూద్దాం.

# ...న్న వాస్తవాలు

తరువాత డాక్టర్జీ కాంగ్రెస్ ప్రదేశ్ కమిటీ సహాయ కార్యదర్శి పదవి చేపట్టారు కూడా. డాక్టర్జీ సునిశిత సామాజిక, రాజకీయ దృష్టి కలిగిన వారు. స్వరాజ్య సమర నిర్వహణలో బాలగంగాధర తిలక్, ఆపై గాంధీజీ నాయకత్వ తీరులను బేరీజు వేయడానికి డాక్టర్జీకి అదే సునిశిత దృష్టి అద్భుతంగా ఉపయోగ పడిందనిపిస్తుంది. ఉద్యమం సరే, ఒక జాతి భవిష్యత్తు ప్రాతిపదికగానే ఆ కాలాన్ని బేరీజు వేశారాయన. వ్యక్తి ఆరాధన చుట్టూ స్వాతంత్ర్య పోరాటం నిర్మితం కావడం, ముందు నుంచీ దేశ విభజన దిశగానే అడుగులు వేస్తున్న ముస్లింలను దేశభక్తి వైపు నడిపించాలన్న విఫలయత్నం డాక్టర్జీని ఆలోచింప చేశాయి. ఉద్యమానికి దేశ చరిత్ర ద్వారా, పరంపర ద్వారా తాత్త్వికత లభించాలి. కానీ, ఆధిపత్య ధోరణి కలిగిన చిన్నవర్గం గొంతెమ్మ కోరిక ఆ గొప్ప తాత్త్వికత స్థానాన్ని అక్రమించడానికి ఉపకరిస్తున్న, ప్రోత్సహిస్తున్న వాతావరణం కూడా డాక్టర్జీని కలతపెట్టింది. ఇది డాక్టర్జీకి పరిమితమైన కలతేనా? కాదు. ఆనాడు మొదట కాంగ్రెస్‌తోనే కలసి నడచి, తరువాత తీవ్ర జాతీయవాదం వైపు మొగ్గిన అనేకుల గుండెల కలత. కాంగ్రెస్ పోకడ నుంచి పక్కకు జరిగి విదేశాల నుంచైనా ఉద్యమించవచ్చునని భావించిన అనేకమంది అనుభవించిన కలత కూడా. ఆ గొంతెమ్మ కోరికలోని ప్రమాదాన్ని జాతీయ కాంగ్రెస్ గుర్తించ నిరాకరించింది. ఫలితాన్ని వర్తమానతరం అనుభవిస్తోంది. దీనిని గుర్తించిన ఆర్ఎస్ఎస్‌ను మాత్రం నాడూ నేడూ కూడా మతోన్మాద సంస్థ అంటూ విమర్శిస్తున్నారు.

ఇలాంటి అంశాలతో పాటు, ఆర్ఎస్ఎస్‌కు ఆకృతినిచ్చిన ఆలోచనలు, సంస్థకు ఆయువు పట్టు వంటి శాఖా కార్యక్రమం, నేడు మనమంతా చదువుతున్న చరిత్ర గురించి సంఘ్ భావన, సనాతన హిందూత్వం గురించిన చింతన, కులం–సామాజిక న్యాయం, అనేక రంగాలకు విస్తరించిన సంఘ ఆలోచన, ప్రపంచీకరణను సంఘం అర్థం చేసుకున్న తీరు, కుటుంబం, ఆధునిక కాలంలో అనేక వాదోపవాదాలకు కేంద్ర బిందువులుగా ఉన్న సహజీవనం, హిజ్రాల హక్కులు, స్వలింగ సంపర్కం వంటి అన్ని అంశాలను 'ఆర్ఎస్ఎస్ ప్రణాళిక–21వ శతాబ్దం కోసం' ('ది ఆర్ఎస్ఎస్: రోడ్‌మ్యాప్స్ ఫర్ ది ట్వెంటీఫస్ట్ సెంచరీ'కి తెనుగుసేత. అను: బీరం వెంకటేశ్వరరెడ్డి, 2022) పుస్తకంలో సునీల్ అంబేకర్ (అఖిల భారత ప్రచార ప్రముఖ్) అవసరమైన మేరకు ప్రస్తావించారు. రాజకీయాలలో సంఘం నేరుగా జోక్యం కల్పించుకోదు. కానీ ఆ రంగం మీద సంఘానికి ఉన్నది నిశితమైన దృష్టే. దేశసేవ, దేశభద్రత రాజకీయ నాయకుల పరమావధి కావాలంటుంది సంఘం. సంఘానిది సజీవ లక్షణం, ప్రవాహశీలత కలిగిన కార్యక్రమం. కాబట్టి సమకాలీన సమాజాన్ని తాకిన ఏ విషయమైనా, జరిగిన పరిణామం ఏదైనా సంఘం వాటి మీద తనదైన వైఖరిని తీసుకుంటూనే ఉంటుంది. తన అభిప్రాయాన్ని సుస్పష్టంగా వెల్లడిస్తూనే ఉంటుంది కూడా. కానీ దీనికి ప్రాతిపదికలు మాత్రం మన చరిత్ర, అది అందించిన పాఠం, భారతీయత. ఇవన్నీ పది అధ్యాయాల ద్వారా అందించారు.

ఎంతో 'గంభీర అంశ'మైన చరిత్ర బ్రిటిష్ వలస దృక్పథం నుంచే బోధిస్తున్నారని సంఘ్ గట్టిగా విశ్వసిస్తున్నది. ఇప్పుడు ఇలాంటి అభిప్రాయం దేశవ్యాప్తంగానే ఉంది. విక్రమ్ సంపత్ వంటివారు ఆ అవాంఛనీయ దృక్పథం గురించి చక్కని విశ్లేషణలు చేస్తున్నారు కూడా. జాతీయవాదానికి ఆద్యులు అనదగిన భారతీయ వీరులు, వనవాసీల చరిత్రలను కావాలనే మరుగుపరిచారని సంఘం భావిస్తున్నది. రామమందిరం విషయంలోనూ ఇదే జరిగింది. ఢిల్లీ కేంద్రంగా చరిత్రంతా జరిగినట్టు చెప్పడం మరొక వికృతి. ఇందులో హిందుత్వకు, సంఘానికి ఉన్న అనుబంధం గురించి లోతైన వివరణ ఉంది. నిజానికి నేటి స్వయం ప్రకటిత మేధావులు చెబుతున్నట్టు ఆ భావన గానీ, ఆ పద ప్రయోగం కానీ సావార్కర్‌వి కావు. 1880లో వంగదేశీయుడు చంద్రనాథ్ బసు ప్రాచుర్యంలోకి తెచ్చారు. హిందూత్వం అనేది మతం కాదు. అదొక పరిపూర్ణ జీవన విధానంగానే ఆర్ఎస్ఎస్ స్వీకరిస్తుంది. ఇక ప్రపంచీకరణ యుగాన్ని ఆర్ఎస్ఎస్ ఎలా చూస్తోంది? 'ప్రపంచ వ్యవహారాలపై హిందూ ఆలోచనా పద్ధతి రాజకీయాలతో, దౌత్య సంబంధాలతో ముడిపడి లేదు. ప్రపంచంతో భారతదేశానికున్న సంబంధాలకు మూలం ప్రపంచం సంక్షేమం, నిర్మాణాత్మక ధోరణి, సహకారం, సంబంధాలు, కుటుంబ విలువలు' అన్నారు అంబేకర్. మతోన్మాదంతో జరిగే దాడులను ఆర్ఎస్ఎస్ నిర్ద్వంద్వంగా ఖండిస్తున్నది. ఈ దాడులు చేసిన వాళ్లకి శిక్షలు కొవ్వొత్తులు పుచ్చుకుని ఉదారవాదం పేరుతో ఊరేగడాన్ని ఆర్ఎస్ఎస్ గర్హిస్తున్నది. మానవ సంబంధాలను పటిష్టం చేయగలిగేది కుటుంబం అన్నదే ఆర్ఎస్ఎస్ నమ్మకం. అందుకే సంఘం తీసుకున్న ఐదు కీలకాంశాలలో కుటుంబ ప్రబోధన్ ఒకటైంది

(కుటుంబంలో స్త్రీపురుషులది సమష్టి బాధ్యత అనే సంఘం భావిస్తుంది). మిగిలినవి గ్రామ వికాస్, గో వికాస్, ధర్మ జాగరణ, సమరసత. ఇటీవల స్వీకరించినది పర్యావరణ పరిరక్షణ.


సహజీవనమనేది భారతీయ సమాజానికి మచ్చు వంటిదేనని చాలా విశ్లేషణతో అంబేకర్ వివరించారు. కులాంతర వివాహాలకు సంఘం వ్యతిరేకం కాకున్నా, అవి సామాజిక ఘర్షణలకు దారితీయని విధంగా జరగాలని అంటోంది. ఇతరుల జీవితాలను ప్రభావితం చేయనంత వరకు స్వలింగ సంపర్కం నేరంగా చూడనక్కరలేదని సంఘం అభిప్రాయం. హిజ్రాలను భారతీయ జీవనంలో అంతర్భాగంగా గుర్తిస్తూ, వారిని ఏవగించుకునే మనస్తత్వం నుంచి బయటకు రావాలనే సంఘం చెబుతోంది.

మరో రెండేళ్లలోనే నూరేళ్ల సందర్భం దగ్గరకు వెళుతున్న ఆర్ఎస్ఎస్ సిద్ధాంతం ఏమిటో సునీల్ అంబేకర్ విస్పష్టంగా పాఠకుల ముందు ఉంచారు. ఆర్ఎస్ఎస్ అంటే ఏమిటో తెలియకుండానే గంటల తరబడి ఉపన్యాసాలు, కాలమ్‌ల కొద్దీ వ్యాసాలు రాసేవాళ్లకు ఇదొక కనువిప్పు.

1948లో జరిగిన గాంధీజీ హత్యోదంతం నుంచి ఈనాటి వరకు కూడా ఆర్ఎస్ఎస్ పేరు వినపడని రోజు లేదంటే అతిశయోక్తి కాదు. మూడు నిషేధాల నుంచి కూడా బయటపడి సజీవంగా మిగిలిన ఏకైక సంస్థ ఆర్ఎస్ఎస్. సేవ, సర్వేజనా సుఖినోభవంతు అనే సిద్ధాంతంతో ఉండే దేశభక్తి, నిబద్ధత కలిగిన సంస్థ కాబట్టే సంఘం ఇవాళ అత్యధిక భారత ప్రజల గుండె చప్పుడయింది. దేశం ముక్కలైనా ఫర్వాలేదు, హిందువుల మనోభావాలు ఎంత తీవ్రంగా గాయపడినా పరిగణించనక్కరలేదనుకుంటూ ఓట్ల రాజకీయాలు, బుజ్జగింపు విధానాలు వీడనివారే సంఘం మీద అక్కసు వెళ్లబోసుకుంటూ ఉంటారు. ఆ విమర్శలైనా నానాటికీ పలచనై పోతున్నాయి. అందుకు నిదర్శనం– ఈ సంస్థతో ప్రేరణ పొంది రాజకీయవేత్తలైన ఇద్దరు దేశానికి ప్రధానమంత్రులయ్యారు. ఎవరికి బాధ కలిగినా 21వ శతాబ్దం ఆర్ఎస్ఎస్‌దే. అందుకే ఈ శతాబ్దంలో సంస్థ నడవబోయే బాట గురించిన ప్రణాళికను అంబేకర్ ఈ పుస్తకం ద్వారా భారతజాతి ముందు ఉంచారు. సానుకూల దృక్పథంతో సాగే సంస్థ చేయవలసిన, చేయగలిగిన పని ఇది. ఇందులోని ప్రతి అక్షరం దానినే ప్రతిబింబించింది.

**ఆర్ఎస్ఎస్ ఏమిటి.. ఎందుకు?**


ఆర్ఎస్ఎస్ అంటే ఏమిటో, దాని ప్రస్థానం ఏమిటో కొద్దిగా కూడా తెలియకుండా మాట్లాడే మేధావులకు దేశంలో కొదవలేదు. సంఘం స్థాపించిన కాలానికీ, వ్యవస్థాపక సర్‌సంఘచాలక్ డాక్టర్జీ నేపథ్యానికీ చాలా ప్రాధాన్యం ఉన్నాయి. ఈ అంశాల మీద విహంగ వీక్షణ చేయించే పుస్తకమిది.




డాక్టర్ సురేశ్‌చంద్ర వాజపేయి రాసిన ఆర్ఎస్ఎస్ ఎట్ గ్లాన్స్‌కు ఇది (అను: డాక్టర్ వడ్డి విజయసారథి) అనువాదం. స్వయంసేవకులు, కొత్తగా సంఘానికి వచ్చిన వారు ఎదుర్కొనే ప్రశ్నలకు సమాధానం చెప్పడానికి ఉపయోగపడాలన్న ధ్యేయంతో ఈ పుస్తకం వెలువరించారు.

**కేవల పరిశీలకుల భావనలో ఆర్ఎస్ఎస్**

ఆర్ఎస్ఎస్ సంస్థ ఏం మాట్లాడినా, ఏమీ మాట్లాడకపోయినా వార్తే. సంచలనమే. కానీ సంఘం పేరు చెప్పగానే ఉదారవాదులు వీరంగం వేస్తారు. కొందరు మాత్రం సమ్యక్ దృక్పథంతో సంస్థను బేరీజు వేయడానికి చూస్తున్నారు. అలాంటివారిలో వాల్టర్ ఆండర్సన్, శ్రీధర్ దామ్లే కూడా ఉన్నారు. వీరు ఆర్ఎస్ఎస్ ఆవిర్భావం, పనితీరులను చారిత్రక దృక్పథంతో అంచనా వేశారన్న పేరు ఉంది. ఈ ఇద్దరు ఇదే అంశంతో పలు పుస్తకాలు వెలువరించారు కూడా. అందులో ఒకటి 'ది ఆర్ఎస్ఎస్: ఏ వ్యూ టు ది ఇన్‌సైడ్' (2018). ఈ పుస్తకం మూడు ప్రశ్నలు వేసుకుని సమాధానం ఇవ్వడానికి ప్రయత్నం చేసింది. గడచిన పాతికేళ్లలో సంఘ అనుబంధ సంస్థలు ఇంత శరవేగంగా ఎలా విస్తరించగలిగాయి? ఆధునిక సామాజిక, ఆర్థిక పరిస్థితుల పరిణామాల నడుమ సంఘం తనను తాను ఎలా నిర్మించుకుంది? శరవేగంగా సాగిన సంఘ విస్తరణ దేశ రాజకీయాలను, ఇతర విధానాలను ఎలా ప్రభావితం చేసింది? చాలా కీలకమైన ప్రశ్నలే. కాస్త పరిచయం ఉన్నా ఈ ప్రశ్నలలోని సహేతుకత తెలుస్తుంది. కాస్త ఆలోచిస్తే జవాబు కూడా దొరుకుతుంది. ఎందుకంటే ఇప్పుడు ఆర్ఎస్ఎస్, సంఘ సిద్ధాంతం ఈ దేశ




జీవనాడి. అలాగే సంఘం లోపలి పనితీరును వీరు అసంపూర్ణంగానే అయినా తెలియచెప్పే ప్రయత్నం చేశారు. ఇవన్నీ ఎలా ఉన్నా సంఘ పరిణామక్రమం, ఇవాల్టి విశ్వరూపం దాల్చడానికి సాగించిన అపూర్వ యాత్ర, అధికార పార్టీతో (బీజేపీ) సంబంధాలు, దాని పరిమితుల గురించి ఈ పుస్తకం వివరించింది.

'ది బ్రదర్‌హుడ్ ఇన్ సాఫ్రాన్' అన్న పుస్తకంలో ఆండర్సన్, శ్రీధర్ దామ్లే పరిశీలించి, ఆలోచించదగిన కొన్ని అంశాలు ఇచ్చారు. 1925 సంస్థ స్థాపన, స్వయంసేవకుల నిర్మాణం, సిద్ధాంతం గురించి ఎలాంటి భాష్యాలకీ చోటు ఇవ్వకుండానే చర్చించారు. కానీ మొదటి నుంచి ఆర్ఎస్ఎస్ మత ఘర్షణలతోనే ఎదిగింది అన్న కొందరి వాదం ఎంత అర్థరహితమో చెప్పే ఒక ఉల్లేఖన ఇందులో ఉంది. అది 1943లో బ్రిటిష్ గూఢచారి శాఖ ఇచ్చిన నివేదికలో భాగం. 'ఇప్పటికిప్పుడే ఆర్ఎస్ఎస్ దేశానికి బెడదగా తయారవుతుందని చెప్పడం కష్టం' అనే అందులో ఉంది. అసలు మత కల్లోలాలను ఒక వర్గ బలహీనతగానే సంస్థ భావిస్తుం దని కూడా ఆ ఇద్దరు రచయితలు చెబుతారు.

**భారతీయ సమాజంలో సంఘ్ విశ్వరూపం: ఆర్ఎస్ఎస్ 360°**

అంబేకర్ ఆర్ఎస్ఎస్ సమగ్ర సైద్ధాంతిక చిత్రాన్ని అందిస్తే, ప్రముఖ కాలమిస్ట్ రతన్ శార్దా నేటి




భారతీయ సమాజంలో విస్తరించిన సంఘ విశ్వరూపాన్ని ఆవిష్కరించే ప్రయత్నం చేశారు. అందుకే ఆ గ్రంథానికి 'ఆర్ఎస్ఎస్ 360°' (2018) అని సరైన శీర్షిక ఇచ్చారు. టీవీ చర్చలు చూసేవారికి ఆయన చిరపరిచితులే కూడా. ఆర్ఎస్ఎస్ ఎంత శ్రమించి, ఎదురీది తనను తాను ఆవిష్కరించుకున్నదీ, నేటి రూపాన్ని సంతరించుకున్నదీ కూడా అద్భుతంగా వివరించారు రచయిత. స్వాతంత్ర్యోద్యమంలో ఆర్ఎస్ఎస్ పాల్గొనలేదు అంటూ చాలామందే ఇటీవల అంటున్నారు. సంఘం చరిత్ర అనే ఏమిటి? అసలు దేశ చరిత్ర గురించి రెండు వాక్యాలు కూడా తెలియనవారే ఇలాంటి అసంబద్ధ ఆరోపణ చేస్తున్నారని కచ్చితంగా చెప్పవచ్చు. ఇలాంటి అజ్ఞానులకి కూడా ఈ పుస్తకంలో చక్కని

సమాధానాలు ఉన్నాయి. స్ఫూర్తి, నిర్మాణం, అభివ్యక్తి అనే మూడు భాగాలలో అనేక అంశాలను పొందుపరిచారు రచయిత.

ఒక వ్యూహంతో, తన ప్రతిభను అద్భుతంగా వ్యక్తమయ్యే తీరులో ఈ రచనకు శ్రీకారం చుట్టారు రతన్. స్వతంత్ర భారత రాజకీయాలను మలుపు తిప్పిన బిందువు అది. కాంగ్రెస్ పార్టీ తన సమాధికి తానే పునాది వేసుకున్న ఘడియ కూడా అదే. ఆర్ఎస్ఎస్ పోరాట పటిమ, త్యాగనిరతి ఎంతటివో లోకానికి తెలిసిన క్షణాలు కూడా అవే. కాంగ్రెస్, దాని కుటుంబ పాలనకు వ్యతిరేకంగా విపక్షం ఒకే శిబిరంగా ఆవిర్భవించడానికి మార్గం చూపిన ఘటన అది. అదే అత్యవసర పరిస్థితి విధింపు (1975). స్వాతంత్ర్యం సమరం ఆకాంక్షించిన స్వేచ్ఛ, భారత రాజ్యాంగ పరిషత్ ప్రతిపాదించిన ప్రజాస్వామ్యం ఆ చర్యతో కుదేలైపోయాయన్న నిర్ణయానికి భారత జాతి వచ్చిన సమయంలో ఆర్ఎస్ఎస్ రంగంలోకి దిగి వాటిని పునరుద్ధరించింది. ఆ సమయంలో లక్షా ముప్పయ్‌వేల మందిని అరెస్టు చేస్తే అందులో లక్ష మంది ఆర్ఎస్ఎస్, దాని అనుబంధ సంస్థల సభ్యులే. మరి దేశంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించినవారు ఎవరు అంటే ఎవరైనా ఏ పేరు చెప్పాలి! ఆర్ఎస్ఎస్ ప్రయాణం నల్లేరు మీద నడక కాదు. దేశ విభజన, గాంధీజీ హత్య తరువాత నిషేధం, వివేకానంద రాక్ మెమోరియల్ నిర్మాణం, 1975లో రెండోసారి నిషేధం, ఏక్తా యాత్ర, డాక్టర్జీ శతజయంత్యుత్సవాలు, రామజన్మ భూమిలోని వివాదాస్పద కట్టడం కూల్చివేత–సంస్థ మీద నిషేధం వీటి మధ్యనే పుటం పెట్టిన బంగారంలా మెరిసింది సంస్థ. ఈ విషయాలే మొదట రచయిత చర్చించారు.

మొదటి భాగంలో భారత్‌ను ఎలా నిర్వచించాలి? హిందువులను సంఘటితం చేయవలసిన అవసరం, నిత్య శాఖ గురించి వివరణ ఉంది. ఈ మూడు ఒకదానితో ఒకటి సంబంధం కలిగినవే. రెండో భాగంలో మనవైన విలువలు, పండుగల ద్వారా అందే జాతీయ సమైక్యతా సందేశం, ప్రచారకుల వ్యవస్థ వంటి అంశాలను చర్చకు తెచ్చారు. మూడో భాగంలో సేవను ఒక బాధ్యతగా సంఘం ఎలా స్వీకరించింది అనే అంశం చుట్టూ వ్యాసాలు నడిచాయి. అనుబంధాల విభాగంలో చేర్చినప్పటికీ క్విట్ ఇండియా ఉద్యమంలో ఆర్ఎస్ఎస్, గాంధీ హత్య తరువాత పటేల్, నెహ్రూలతో విభేదాలు వంటి కీలక అంశాలు చర్చకు వచ్చాయి.

**వేయి కోతల దేహ బాధ**

ఈ పురాతన పుణ్యభూమి చరిత్రను చూస్తే వేనవేల గాయాలు కనిపిస్తాయి. స్వతంత్ర భారత దేశంలో చాలా ప్రభుత్వాలు ఆ గాయాలకు మందు వేయలేదు సరికదా, గాయపరుస్తున్నవారిని నిరోధించలేదు కూడా. ఆ గాయపరిచే వారు ఎవరో




కాదు, విదేశీ సిద్ధాంతాలను నమ్మినవారు, ఎడారి మతాలవారు. ఇప్పుడు ఇలాంటి ఇంటిదొంగలను కట్టడి చేయడం ప్రభుత్వాలకు కూడా సాధ్యం కావడం లేదు. భారత హోమ్‌శాఖ మాజీ కార్యదర్శి గోపాలకృష్ణ పిళ్లై రాసిన ఈ వాక్యాలు చూడండి: "నేను కేంద్ర హోమ్‌శాఖ కార్యదర్శిగా ఉన్నప్పుడు కోబడ్ ఘాండీ, అనురాధా ఘాండీలపై నడిచిన కేసులు చూశాను. మేధావులు, మానవహక్కుల కార్యకర్తలు అనే ముసుగులో పనిచేసే కరడుగట్టిన మావోయిస్టులకు వ్యతిరేకంగా కేసులు నడపడంలో ప్రభుత్వానికి ఎదురయ్యే క్లిష్ట పరిస్థితులు తద్వారా తెలుసుకోగలిగాను." ఈ వాక్యాలు బినయ్‌కుమార్ సింగ్ 'బ్లీడింగ్ ఇండియా: ఫోర్ ఎగ్రెసర్స్, థౌజెండ్ కట్స్' పుస్తకానికి రాసిన పీఠిక లోనివి (తెలుగు అనువాదం–రక్తసిక్త భారతం, నలుగురు ఘాతుకులు –వెయ్యి కోతలు. అను: వీవీ సుబ్రహ్మణ్యం). ఈ అంశాలనే ఇంకాస్త వివరిస్తూ వీవీ సుబ్రహ్మణ్యం రాసిన పుస్తకం 'ముంచుకొస్తున్న ముప్పు: ఎప్పటికి కనువిప్పు?'. ఐదు అధ్యాయాలలో చాలా మంది సమాచారం ఇచ్చారు రచయిత. వేయేళ్ల ముట్టడి, క్రైస్తవ మతతత్త్వం, ఇస్లామిక్ మతతత్త్వం, కమ్యూనిజాలతో భారతీయ సమాజానికి వచ్చిన ముప్పుతో పాటు హిందువులు ఎందుకు నిస్తేజంగా ఉండిపోతున్నారంటూ రచయిత ప్రశ్నించడం ఇందులో కీలకం.

టుక్డే టుక్డే గ్యాంగ్ పేరుతో విశ్వవిద్యాలయాలలో తిష్ట వేసిన వారికీ, భీమా కోరేగావ్ కుట్రకీ, పీఎఫ్ఐ ఘాతుకాలకీ, క్రైస్తవ మిషనరీల విరగబాటుకీ వెనుక ఉన్నది ఆ దుష్ట చతుష్టమయే. వారే ముస్లిం ఫండమెంటలిస్టులు, క్రైస్తవ మిషనరీలు, అర్బన్ నక్సల్స్... కొందరు కొందరు జర్నలిస్టులు. పాప్యులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా వంటి నిషిద్ధ సంస్థ రక్తపు టేరులు పారించడానికి డబ్బుమూటలు అందిస్తున్న కొన్ని ఎన్జీవోల గురించి కూడా ఇందులో ఉంది. 2047 నాటికి భారత్‌ను ఇస్లాం దేశంగా మారుస్తామని రంకెలు వేయగలిగే స్థాయికి పీఎఫ్ఐ వచ్చిందంటే వీళ్లందరి అండదండలతోనే. దేశంలో బలమైన, స్థానీయత కలిగిన ప్రభుత్వం ఏర్పడడం తోనే వీళ్లంతా తమ వికృతాలకు కొత్త కోరలు తగిలించారు. ఖలిస్తాన్ తీవ్రవాదానికి మళ్లీ ప్రాణం పోయాలని ప్రయత్నం చేస్తున్నారు. వీళ్లకి సిఖ్స్ ఫర్ జస్టిస్ అన్న సంస్థ పెట్టుబడి పెడుతున్నది. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం మీద ఫాసిజం ముద్ర వేసి సాగిస్తున్న ఈ అరాచకాలను సరైన రుజువులతో బినయ్ కుమార్ జాతి ముందు పుస్తకరూపంలో ఉంచారు. చిత్రంగా అంతర్జాతీయ క్షమా వంటి సంస్థ మాత్రమే కాదు, ప్రతి హక్కుల సంఘం ఈ దుష్టచతుష్టయం మీద ఈగ వాలినా సహించదు. సుప్రీంకోర్టును సైతం కదిలిస్తున్నది. మైనారిటీల హక్కుల పేరుతో వీళ్లు చేస్తున్నది మత మార్పిడులే. మైనారిటీల రక్షణ అంటే వీళ్ల అభిప్రాయంలో హిందువుల మనోభావాలను దారుణంగా అవమానించడమే. హిందూ ప్రార్థనామందిరాల మీద దాడులు చేయడమే. ఆయా సంస్థలే తయారు చేసిపెట్టుకున్న డాక్యుమెంట్ల ఆధారంగా రాసిన ఈ పుస్తకం చదివితే మనసు వికలమవుతుంది. మన మనసులను వికలం కానీయవద్దు. ఇలాంటి విద్రోహానికి వ్యతిరేకంగా అడుగులు వేసే కార్యాచరణ వైపు నడిచే చింతన అలవరుచుకోవాలి. ఈ పుస్తకం రాసి మనలని మరింత చింతాక్రాంతులను చేయడం రచయిత ఉద్దేశం కానేకాదు. 'వైవిధ్య భరితమైన, బహుళత్వమయమైన సమాజానికి, మన జీవన విధానానికి తీవ్రమైన ప్రమాదాన్ని తెచ్చి పెడుతున్న ఈ జాతి వ్యతిరేక శక్తుల కథనంతటినీ విశ్లేషించుకుని చూడవలసిందిగా ముందే ఏర్పరుచుకున్న భావాలు లేనివారందరికీ నేను విజ్ఞప్తి చేస్తున్నాను' అంటూ పుస్తకం ముగించారు. అంటే తన రచనలోని ప్రామాణికతను తనిఖీ చేసుకోవచ్చునని కూడా రచయత పాఠకులకు సవాలు వంటిది విసిరారని అనిపిస్తుంది. ఆయన తన నిజాయితీని నిరూపించు కోవడానికి ఈ మాట రాశారు. దేశం పట్ల, భద్రత పట్ల, మన ధర్మంపట్ల మనకున్న నిబద్ధతను చాటు కోవడంలో కర్తవ్య నిర్వహణకు పూనుకొనడంలో ఈ పుస్తకం నుంచి ఎంతవరకు ప్రేరణ పొందవచ్చునో చూసుకోవాలి.

**బ్రహ్మ పదార్థం- సెక్యులరిజం**

ఈ దేశంలో బీజేపీ తప్ప ప్రతి రాజకీయ పక్షం తప్పక వల్లించే ఒకే ఒక మాట, సెక్యులరిజం.



ఇందులోని అసంబద్ధత ఎంతో నాయకుల కంటే ప్రజలే త్వరగా అర్థం చేసుకున్నారని అర్థమవుతుంది. ఫలితమే రామజన్మ భూమి వంటి విజయాలు. సోషలిజం అంటే అందరూ ధరించడం వల్ల ఆకృతి కోల్పోయిన టోపీ అని ఒక రాజకీయ పరిశీలకుడు పూర్వమే అన్నాడు. ఇక్కడ చెల్లుబాటు అవుతున్న సెక్యులరిజం ధరించే దుస్తుకు తగ్గట్టు శరీరాన్ని కొసుక్కోవాలని చెబుతోంది. హిందూ వ్యతిరేకతే సెక్యులరిజమా? మైనారిటీలను బుజ్జగించడమే సెక్యులరిజం లక్షణమా? అసలు మన జీవన పరంపరకూ, చరిత్రకూ సెక్యులరిజం అవసరం ఉందా? ఈ అంశాలను చర్చించిన చిన్న పుస్తకం మన్నవ గిరిధరరావు రాసిన 'ఏది సెక్యులరిజమ్?' ఎంత తుప్పు పట్టిపోయినా దీనినే ఆయుధంగా చేసుకోవాలన్న మన సెక్యులర్ పార్టీల భేషజం గురించి ఈ పుస్తకం క్లుప్తంగా, బలంగా చెప్పింది.

**పౌరసత్వ సవరణ చట్టం:**
**వాస్తవాలు- వ్యాఖ్యానాలు**


డాక్టర్ కె. లక్ష్మణ్ (రాజ్యసభ సభ్యులు) బీజేపీ తెలంగాణ అధ్యక్షునిగా ఉన్నప్పుడు తన సంపాద కత్వంలో వెలువరించిన చిన్న పుస్తకమిది. పౌరసత్వ





సవరణ చట్టం లేదా సీఏఏ, నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్ నిర్ణయాల నేపథ్యంలో ఒక పథకం ప్రకారం జరిగిన అల్లర్లు, విద్వేష ప్రచారం చిన్నవేమీ కాదు. అసలు ఈ గొడవలతో బీజేపీ అధికారం కోల్పోవడం ఖాయమనే నిర్ధారణకు కూడా కొందరు వచ్చారు. ఆ రెండు చట్టాల మీద ఉన్న అపోహలను తొలగించ డానికి ప్రభుత్వం చేసిన ప్రయత్నం దుష్ప్రచారం ముందు చిన్నబోయింది అన్నా ఆశ్చర్యపడక్కర లేదు. కానీ నిజాలు వేరు. వాటిని వెల్లడించడమే ఈ పుస్తకం లక్ష్యం. ముస్లిం పెద్దలు సహా మేధావులు, పత్రికలలో వచ్చిన వ్యాసాలు వెల్లడించిన సంగతులు ఇందులో ఉన్నాయి.

ఇక్కడ ఆర్ఎస్ఎస్ సిద్ధాంతం, నిర్మాణం, భారతీయ సమాజంపై ప్రభావం వంటి అంశాలపై వచ్చిన కొన్ని పుస్తకాలను మాత్రమే పరిచయం చేశాం. ఇప్పుడు ఈ అంశం మీద విశేష సమాచా రంతో పుస్తకాలు వెల్లువెత్తుతున్న మాట నిజం. ★

## మోదీ ఆధ్యాత్మిక, రాజకీయ నేపథ్యం





లాల్ కిషన్ అద్వాణి అయోధ్య రథయాత్రలో భాగస్వామి అయిన నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా, భారత ప్రధానిగా పదవీ బాధ్యతలు స్వీకరించడం స్వతంత్ర భారత చరిత్రలోనే విశిష్ట ఘట్టం. ఆధ్యాత్మిక చింతన, సామాజిక సేవ నేపథ్యంగా ఉన్న మోదీ భారత్‌కు సరైన ప్రధాని అనిపించుకోగలిగారు. ఆయన గొప్ప వక్త. కానీ అవసరమైతేనే మాట్లాడతారు. ఆయన ప్రధానంగా కార్యశీలి. దేశం ఒక్కటే ఆయన ప్రాథమ్యం. ఈ అంశాలను అద్భుతంగా ఆవిష్కరించిన పుస్తకాలు 'మోదీ కామన్‌మ్యాన్స్ పీఎం', 'సోషల్ హార్మనీ'. ఇందులో మొదటిది కిశోర్ మక్వానా స్వీయ రచన. రెండోది నరేంద్ర మోదీ ఉపన్యాసాలకు వ్యాస రూపం. లేదా రాసిన వ్యాసాల సంకలనం. ఆయన అధిరోహించిన సోపానాల గురించే ఇందులో ఉంటుంది. ఉపన్యాసాలు, అభిప్రాయాలు గమనిస్తే మోదీ ముఖ్యమంత్రి అయినా, ప్రధాని అయినా మౌలికంగా తన భావాలను ఏనాడూ మార్చుకోలేదు. ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న అన్ని అంశాల మీద ఆయనకు తనదైన అవగాహన ఉంది. అవన్నీ ధార్మికమైన, దేశభక్తి ప్రపూరితమైనవే. ఇవి చదివితే మోదీ గురించి బయట వినిపించే విమర్శలకీ, వాస్తవంగా ఆయన వ్యక్తిత్వానికి మధ్య ఉన్న అగాధం స్పష్టంగా అర్థమవుతుంది.

## ధర్మాన్ని ఎందుకు రక్షించుకోవాలి?

భారతీయ సమాజం వేయేళ్ల పాటు విదేశీ పాలనలో ఎందుకు ఉండిపోయింది? ఈ ప్రశ్నకు జవాబులు అన్వేషించే క్రమమే మన చరిత్రను తెలుసుకోవడం అవుతుంది. అయితే ఈ చరిత్ర సక్రమంగా లేదు. దానితోనే హిందువులు తమ చరిత్రను తాము సరిగా అర్థం చేసుకోలేకపోతున్నారు. హిందూదేశం ఉన్నప్పుడే హిందువుల మనుగడ. ఆ విషయాన్ని అర్థం చేసుకోవడానికి ఉపకరించే పుస్తకం 'హిందూ సమాజ రక్షణ ఎందుకు? ఎలా?'. ప్రఖ్యాత చరిత్ర రచయిత సీతారాం గోయెల్ రాసిన ఈ పుస్తకాన్ని సౌదామని తెనిగించారు. హిందువులకు మరొక దేశం లేదు. భారతదేశం ఉంటేనే భారతీయులు లేదా హిందువులు ఉండగలరు. ఇదే ఈ పుస్తకం చెబుతుంది.





## హంపి శిథిలాలకు గొంతునిచ్చిన నవల

ఇలాంటి పుస్తకాలతో పాటు సృజనాత్మక ప్రక్రియలో కూడా చరిత్రకు జరిగిన అన్యాయాన్ని చిత్రించే కృషి కనిపిస్తుంది. దేశ చరిత్రను, ప్రధానంగా ముస్లిం దండయాత్రలను, వారి హిందూ ద్వేషాన్ని ఉదారవాదులు, వామపక్ష చరిత్రకారులు ఎంతటి వక్రీకరణతో చరిత్ర పేరుతో నమోదు చేయదలిచారో హంపీ నేపథ్యంతో వచ్చిన అద్భుత నవల 'ఆవరణ'. ఎస్ ఎల్ భైరప్ప రాసిన ఈ నవల చరిత్ర ఆధారంగా వచ్చిన అద్భుత నవలలో ఒకటి. ముస్లిం పాలనా కాలంలో దేశానికి వచ్చిన యాత్రికుల రచనల ఆధారంగానే ఈ నవలను ఆయన రాశారు. నాటి హిందువుల దుస్థితికి కన్నీళ్లు వచ్చినా, వారి అనైక్యత, అధైర్యాలను చూస్తే మాత్రం రక్తం ఉడుకుతుంది.









భారతదేశాన్ని కలకాలం తమ పదఘట్టనల కిందే అణచి ఉంచడానికీ, ఈ దేశవాసుల మానసిక స్థైర్యాన్ని నిరంతరం డోలాయమానంలో ఉంచడానికి జరిగిన తొలి ప్రయత్నం– హిందూ దేశ చరిత్రను వక్రీకరించడం. ఆ పని ఈస్టిండియా కంపెనీ వచ్చిన కొద్దికాలానికే మొదలయింది. ఎప్పుడో అలెగ్జాండర్ కాలం నుంచి, తమ వరకు అంటే ఈస్టిండియా కంపెనీ రాక వరకు ఒకటి రెండు ప్రతిఘటనలు తప్ప అంతా సజావుగా, ఎర్ర తివాచీ పరచినంత సులభంగా దండయాత్ర సాగిపోయిందని చెప్పడమే చరిత్ర వక్రీకరణకు తొలి మెట్టు. అది నిజమా? ఆ ప్రశ్న కంటే ఏనాడో చచ్చిపోయిన ఈస్టిండియా కంపెనీ వాదనలు ఇంకా ఉన్నాయా? అన్న ప్రశ్న ముందు వేసుకోవాలి. అవును, అవే వాదనలు పాచిపట్టి సాగుతున్నాయి. ఆర్యుల రాక సిద్ధాంతం అలాంటిదే. ఈ దేశానికి ముస్లింలు వచ్చే వరకు అసలు నాగరికత తెలియదన్న దురహంకారపూరిత వైఖరి కూడా చరిత్ర రచనలో తిష్టవేసింది. అంతేనా, అసలు బ్రిటిష్ జాతి రాకుంటే ఈ దేశం మధ్య యుగాలలోనే ఉండిపోయేదన్న వాదన కూడా ఉంది. ఇవన్నీ నిజాలేనా? వాళ్లు వచ్చింది భారతీయ సమాజాన్ని ఉద్ధరించడానికేనా? దాదాపు 30,000 గుడులు ముస్లిం యుగంలో కూలిపోయాయి. ఇదేనా నాగరికతను నేర్పడమంటే. బ్రిటిష్ ఇక్కడ నిర్మించిన బడులు, కర్మాగారాలు, రైలు మార్గాలు అన్నీ భారతదేశ సౌభాగ్యం కోసమేనా? అవన్నీ పచ్చి అబద్ధమని నాడే దాదాభాయ్ నౌరోజీ వంటివారు 'పావర్టీ అండ్ అన్ బ్రిటిష్ రూల్ ఇన్ ఇండియా' అన్న ఉద్గ్రంథంలో అరటిపండు ఒలిచి చెప్పినట్టు చెప్పారు. కానీ తొలితరం కాంగ్రెస్ నాయకత్వం కూడా దానిని పట్టించుకోవలసినంతగా పట్టించుకోలేదు. మిషనరీల ఉద్దేశం నిరుపేద భారతాన్ని అక్కున చేర్చుకోవడమా? ముమ్మాటికీ కాదు. దేశాన్ని క్రైస్తవ పరం చేయడమే. భారతీయ సమాజాన్ని కూకటివేళ్లతో పెళ్లగించడమే. ఈ వాస్తవాలు చెబితే అనేక ముద్రలు పడతాయి. నిజాలు పాఠ్య పుస్తకాలలో చేర్చబోతే కాషాయీకరణ గోల మొదలవుతుంది. అయినా అ చారిత్రక వాస్తవాలన్నీ ఇప్పుడు వెలుగు చూస్తున్నాయి.

# మన చరిత్రతో మాటామంతీ

చరిత్ర అంటే అంధకారంలో ఉంచేది కాదు. చరిత్ర అంటే గతాన్ని చూసి గర్వించేది మాత్రమే కాదు. చరిత్రలో ఎక్కడ నుంచి బయలుదేరామో తెలిస్తేనే, మనం ఎటు ప్రయాణించాలో తెలుస్తుంది. భారత్ వంటి దేశానికి చరిత్ర ఎప్పుడూ భారం కాదు, వరం. గతం చేసిన గాయాలకు కావలసిన ఔషధాన్ని అది మాత్రమే అందించగలదు.

**సాఫ్రాన్ స్వోర్డ్స్**

సెంచరీస్ ఆఫ్ ఇండిక్ రెసిస్టెన్స్ టు ఇన్వేడర్స్ ఈ రచన ఒక గొప్ప ప్రయత్నం. దేశం కోసం, ధర్మం కోసం, స్వరాజ్యం కోసం పాటుపడిన ఎవరైనా కావచ్చు– మహిళలు, వనవాసులు, కింది వర్గాల వారు, కర్షకులు, వృత్తిపనుల వారు– అందరికీ చరిత్రపుటలలో చోటు కల్పించాలన్న సమున్నత ఆశయంతో మనోషి సిన్హా రావల్ ఎంతో శ్రమకోర్చి ఈ చక్కని గ్రంథం వెలువరించారు. మన అల్లూరి శ్రీరామరాజు సహా 52 మంది మరుగున పడిన త్యాగమూర్తుల జీవితాలను ఈ ఆంగ్లగ్రంథంలో పరిచయం చేశారు. రాణా సంగ్రామ్, రాణా ప్రతాప్ చరిత్రలు ఏం చెబుతాయి? ప్రతిఘటన గురించి కాదా! ఇలాంటి వారందరి చరిత్ర వెల్లడైతే మొగలుల గురించి నెహ్రూ (భారత దర్శనం), వామపక్ష చరిత్రకారులు, ఉదారవాదులు ఇచ్చిన అభూతకల్పన ఒక్కసారిగా తునాతునకలవుతుందన్న భయమే ఈ ధోరణిలో కనిపిస్తుంది. 40,000 మంది మహిళలను సంఘటితం చేసి, తైమూర్‌ను ఎదిరించి ఓడించిన మహిళ రామ్‌ప్యారీ గుర్జర్. మీరట్, హరిద్వార్‌లలో ఆమె తైమూర్ సైన్యంతో తలపడింది. కానీ ఆమెకు చరిత్రపుటలలో స్థానం ఇవ్వలేదు. ఆ లోటు మనోషి సిన్హా కొంతవరకు తీర్చారు. అసలు ఏ విదేశీ దురాక్రమణదారుడికీ స్థానికుల నుంచి పెద్ద ప్రతిఘటన ఏదీ ఎదురుకాలేదన్న ఉదారవాద, వామపక్ష చరిత్ర రచయితల చెప్పే అతిపెద్ద అబద్ధానికి ఇదొక ఉదాహరణ. భక్తియార్ ఖిల్జీని అస్సాంలో ఎదిరించిన, నిలువరించిన పృథు చరిత్ర కూడా మనకు తెలియదు. విదేశాలలో ఉండి దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన ఆజాద్ హింద్ ఫౌజ్ తరపున గూఢచారిగా పనిచేసిన సరస్వతి రాజమణి గాథ చరిత్ర పుటలకు ఎందుకు ఎక్కలేదు. ఆనాడు కాంగ్రెస్‌కీ, వామపక్షవాదులకీ సుభాష్ చంద్ర బోస్ అంటే ఉన్న వ్యతిరేకత ఇందుకు కారణం కాదా? శివాజీ సహచరుడు బాజీప్రభు దేశ్‌పాండే, కన్నడ దేశంలో మొగలాయి సైన్యాన్ని ఓడించిన రాణి కర్ణావతి, ఇంకా చెన్నమ్మ, వీరపాండ్య కట్టబ్రహ్మన, కన్హోజీ ఆంగ్రే, హేమచంద్ర విక్రమాదిత్య, కుయిలీ, తారాబాయి భోంస్లే, బాజీ రౌత్, తిరోత్ సింగ్, కనకలత బారువా, పోనాబ్రాజా బాషి, శివదేవి తోమార్ వంటి త్యాగమూర్తుల చరిత్రలను రచయిత వాస్తవికంగా అందించారు. అదృష్టవశాత్తు చరిత్రలో కొద్ది స్థానమే అయినా దక్కించుకున్న ఝాన్సీలక్ష్మి, సావార్కర్, భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్, చంద్రశేఖర్ ఆజాద్, ఖుదిరాంబోస్ వంటి కొందరి జీవితాశయాలను కూడా ఇందులో పరిచయం చేశారు. అలాగే బిష్ణోయిలు, గుర్జర్ల పోరాటం కూడా చదవవచ్చు. ఈ పుస్తకం చదువుతుంటే ఒక వాస్తవం గమనంలోకి వస్తుంది. వీరంతా భారతదేశం నలు మూలలకూ చెందినవారు. అంటే స్వాతంత్ర్యం పోరాటం చాలామంది చెప్పినట్టు ఉత్తర భారత దేశానికో, చదువుకున్న మధ్య తరగతి వర్గాలకో, ఉన్నత కులాలకో, ఒక వర్గానికో, పురుషులకో పరిమితం కాలేదు. కానీ మన చరిత్ర పుస్తకాలు ఇలాంటి అవగాహనను ఎందుకు కల్పించడం లేదు? పైగా చాలామంది చరిత్ర పురుషులకు వ్యక్తిగత

ప్రయోజనాలు ఆపాదించి వారిని కించపరిచే ప్రయత్నం కూడా సుస్పష్టం.

**నిజాం పోరులో హిందూ సంస్థల పాత్ర**


దేశమంతటా నిరుడే ఆజాదీ కా అమృతోత్సవ్ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. కానీ పాత హైదరాబాద్ సంస్థానంలో ఒక్క సంవత్సరం ఆలస్యంగా ఇప్పుడు ఆ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. దురదృష్టవశాత్తు ఇక్కడ అధికారంలోకి వచ్చిన రాజకీయ పక్షం, ఆనాటి పోరులో పాల్గొన్న కమ్యూనిస్టులు ఈ ఉత్సవాలను మనస్ఫూర్తిగా చేయడం లేదు. కారణం, నిజాం భూతం వీరిని వీడలేదు. నిజాంను గద్దె దించవలసిన ఆ చారిత్రక సందర్భాన్ని సంస్థానవాసులు మతం ప్రాతిపదికగా గుర్తించలేదని అంగీకరించవచ్చు. ఆ పోరాట చరిత్రలో అదంతా కమ్యూనిస్టులు చేసిన పోరాటంగా నమోదయిపోయింది. ఈ చారిత్రక దగాను వివరించే ప్రయత్నం చేసిన పుస్తకం 'హైదరాబాద్ నిరాయుధ ప్రతిఘటన: ఆర్ఎస్ఎస్, ఆర్యసమాజ్, హిందూ మహాసభ పాత్ర' డాక్టర్ శ్రీరంగ్ గోడ్బొలే రాసిన ఈ మరాఠీ పుస్తకాన్ని హైందవి, పరిమళ నడింపల్లి అనువదించారు. అటు కన్నడ ప్రాంతాలు, ఇటు మరాఠీ ప్రాంతాలు కూడా కలసి ఉన్న ఈ సంస్థానంలో తిరుగుబాటును రగిలించినది ఆర్యసమాజమే. భారత జాతీయ కాంగ్రెస్ కూడా కలిసింది. సావార్కర్, లక్ష్మణ్ బల్వంత్ భోపట్కర్, గోవింద రఘునాథ్ కాళే, శివరాం విష్ణు మోదక్, సేనాపతి బాపట్, యశ్వంత్‌రావు దిగంబర్ జోషి, గజానన్ విశ్వనాథ కేత్కర్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, పండిత్ నారాయణ్ స్వామి, చాంద్ కరణ్ శారద, బాబా మదన్‌సింగ్ గాగా, డాక్టర్ హెడ్గేవార్, భయ్యాజీ దాణి, వామన్‌రావ్ హెడ్గేవారు,బాబూరావ్ మోరే, వేలాదిమంది స్వయంసేవకులు ఇందులో పాలు పంచుకున్నారు. ఆ వివరాలను ఈ చిన్న పుస్తకం క్లుప్తంగా అందిస్తుంది. ఏడు అధ్యాయాలలో విషయాన్ని వివరించారు. కాగా నిజాం మీద గాంధీజీ ఏర్పరచుకున్న దృక్పథంతో విభేదించడానికి ఏమాత్రం వెనుకాడకుండా మూల రచయిత చరిత్ర రచన పట్ల తన నిబద్ధతను నిరూపించుకున్నారు. నిజాం ప్రభువు నిజంగానే అంతటి ఉదారుడైతే ఇంత ఉద్యమం, దేశ సమగ్రత ప్రశ్నార్థకం కావడం వంటి అంశాలు ఎందుకు చర్చకు వచ్చాయన్నదే అసలు ప్రశ్న.

**నిజాం దోపిడీకి నిలువెత్తు నిదర్శనం**

ప్రఖ్యాత వైద్యులు డాక్టర్ దేమె రాజారెడ్డి, రచన 'మీర్ ఉస్మాన్ అలీఖాన్ అండ్ హిస్ వెల్త్'లో నిజాం ఆస్తుల గురించి అద్భుతమైన వివరణ ఉంది. భూములు, ఆభరణాలు, వజ్రవైఢూర్యాలను అక్షరాల మేటలు వేయించారు నిజాం ప్రభువులు. ప్రభువుల భోగాలకు పోయినంత పోగా మిగిలిన సంపద ఇది. భృత్యులు, బంధువులు కొల్లగొట్టినంత కొల్లగొట్టగా నేటికి కనిపిస్తున్న కనకరాశులు ఇవి. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి సేకరించిన సమాచారమిది.

**ఆ ఏలుబడి అంతా దోపిడీయే**

1757 నుంచి 1947 వరకు భారతదేశాన్ని ప్రత్యక్షంగా, పరోక్షంగా బ్రిటిష్ జాతి పాలించింది. దేశం నుంచి ఇంగ్లండ్‌కూ ఓడల కొద్దీ సంపద తరలిపోయిన కాలమిది. మనదైన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అణచి ఉంచడమే కాదు, పారిశ్రామిక విప్లవానికి దేశం దూరంగా ఉండిపోయిన దుస్థితికి కూడా ఆ కాలమే కారణం. కానీ దీనినే చాలామంది ఉదారవాదులు దేశం ఆధునికతను సంతరించుకున్నదిగా భాష్యం చెబుతూ ఉంటారు. అదెంత బూటకమో సవివరంగా ఆధారాలతో చెప్పిన ఉద్గ్రంథం 'ఆంగ్లేయుల ఏలుబడి అంతులేని దోపిడి'










(బి.సారంగపాణి) ఇంగ్లండ్ సైనిక వ్యయం మొత్తం భారతదేశం నుంచే గుంజేవారు. దీనికే నౌరోజీ డ్రెయిన్ థియరీ అని పేరు పెట్టారు. ఆంగ్లేయుల ఆధ్వర్యంలో వచ్చిన రైల్వే, నౌకా రేవులు ఇవన్నీ భారతదేశాభివృద్ధికి దోహదం చేసినవి కానేకావు. ఇక్కడి ముడిసరుకును అక్కడకు తీసుకుపోయి, తయారైన వస్తువులను ఇక్కడికి తెచ్చి విక్రయించడానికే. ఈ అంశాలను ఎంతో సమర్థ వంతంగా పొందుపరిచిన పరిశోధన గ్రంథమిది. బ్రిటిష్‌పాలన మీద ఇప్పటికీ కొందరికి ఉన్న భ్రమలను ఈ పుస్తకం నిశ్చయంగా నిర్మూలించ గలుగుతుంది.

**ఖిలాఫత్ ఉద్యమంతో జరిగిందేమిటి?**

ఈ ప్రశ్నను రేకెత్తిస్తూ సాగిన రచన 'ఖిలాఫత్: ముస్లిం వేర్పాటువాదం- దేశ విభజన'.ఇది కూడా డాక్టర్ శ్రీరంగ్ గోడ్బొలే రాసినదే. ఖిలాఫత్ ఉద్యమం వందేళ్ల సందర్భాన్ని చాలా ఆర్భాటంగా నిర్వహించాలని కాంగ్రెస్, కమ్యూనిస్టులు ఉబలాటపడిన వేళ చాలా వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. ఆ అంశాల సంకలనమే ఈ పుస్తకం. ఖిలాఫత్ ఉద్యమంతో ఎంతటి అవాంఛనీయ ధోరణులు ప్రవేశించాయో చెప్పాలంటే మలబార్‌లో జరిగిన హింసను చూపవచ్చు. కానీ ఖిలాఫత్ ఉద్యమం సమయంలోనే జరిగిన ఈ హిందూ నరమేధాన్ని ఉదారవాదులు రైతాంగ పోరాటంగా చరిత్రకెక్కించారు. ఆ దగాను ఈ పుస్తకం వివరిస్తుంది.

**సార్థక జీవితం**

వినాయక్ దామోదర్ సావార్కర్ భారత స్వాతంత్ర్యోద్యమంలో పరిపూర్ణ జాతీయవాదానికీ, తిరుగులేని విదేశీ వ్యతిరేకతకీ చిరునామా. కానీ ఆయన జీవించి ఉన్న కాలంలోనే కాదు, కీర్తిశేషులైన తరువాత కూడా కాంగ్రెస్ వెంటాడే, వేటాడే ప్రయత్నం చేస్తూనే ఉంది. సావార్కర్ పోరాట యోధుడు. అంటరానితనం మీద, ఇతర మూఢ నమ్మకాల మీద తిరుగుబాటు చేసిన సంస్కర్త. 1857 మహోన్నత చరిత్రను ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామమని పిలిచినవారు. వక్త. మహా రచయిత. ఆయన మీద ఎందుకీ అక్కసు? నెహ్రూ,గాంధీజీల మార్గానికి వ్యతిరేకంగా నడిచిన ఎంతటి దేశభక్తి పరుడు, చరిత్రపురుషుడు అయినా వారిని నిందించడం ఎంతవరకు న్యాయం? ఈ అంశాలను చర్చించిన పుస్తకం డాక్టర్ అరవింద్ గోడ్బొలే రాసిన 'సావర్కర్ అంటే.. సమున్నత వ్యక్తిత్వం సార్థకమైన జీవితం' (అను: నడింపల్లి పరిమళ). సావార్కర్‌పై కురిపించే విమర్శల వెనుక ఉన్నది దేశభక్తా? చారిత్రకతా? దేశద్రోహమా? అన్న ప్రశ్న దగ్గరకి పాఠకులను ఈ పుస్తకం తీసుకువస్తుంది.

**బలిదాన పరంపర**

'స్వాతంత్ర్య పోరాటపు పూర్తి గౌరవం గాంధీజీకి, కాంగ్రెస్‌కే దక్కుతుందని భావించడం అసంఖ్యాక విప్లవవీరులను అన్యాయం చేయడమే' అన్న దృక్పథంతో వెలువడిన పుస్తకం 'బలిదాన పరంపర'. హిమాచల్ ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శాంతా కుమార్ 1962లో రాసిన ఈ పుస్తకానికి (అను: కె. శ్యాంప్రకాశ్) వీర సావార్కర్ ముందుమాట రాశారు. పైన పేర్కొన్న వాక్యాలు ఆయనవే. ఇది భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌ల చరిత్రతో పాటు తీవ్ర జాతీయవాద పంథాలో నడిచిన వాసుదేవ్ బల్వంత్ ఫాడ్కే, కూకారాం సింగ్, చాపేకర్ సోదరులు, మదన్‌లాల్ ధీంగ్రా, గేందాలాల్ దీక్షిత్ వంటి ఎందరో చరిత్ర పుటలకు చేరని ధన్యజీవుల చరిత్రలను అందిస్తుంది.

**(ఈ వ్యాసాలలో ప్రస్తావించిన పుస్తకాలు కావలసినవారు సాహిత్యనికేతన్, నవయుగభారతి సంస్థలతో సంప్రదించవచ్చు. 040-27563236, 9290127329)**

– జాగృతి డెస్క్

సుజాత గోపగోని, 6302164068



'దేశంలోనే తెలంగాణ అత్యంత ధనిక రాష్ట్రం' ఇది ఎవరో అన్న మాట కాదు, ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా అనేకసార్లు బాహాటంగా ప్రకటించిన వాస్తవం. తెలంగాణ ఆవిర్భవించి ఎనిమిదేళ్లు గడిచాయి. మరికొన్ని నెలలైతే తొమ్మిదేళ్లు కూడా పూర్తవుతాయి. అయితే, ఈ తొమ్మిదేళ్లలో ధనిక రాష్ట్రం కాస్తా అప్పుల కుప్పలా మారిందని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ అప్పులు కేసీఆర్ పాలనకు అద్దం పడుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

# ధనిక రాష్ట్రం నుంచి అప్పుల కుప్పగా..



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సింహభాగం ఆదాయం వివిధ పన్నుల రూపంలో రాజధాని హైదరాబాద్ నుంచే వచ్చేది. ఈ ఆదాయాన్నే అన్ని జిల్లాలకు, అంటే 23 జిల్లాలకు వ్యయం చేసేవాళ్లు. రాష్ట్రం విడిపోయిన తర్వాత 13 జిల్లాలు ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లిపోయాయి. తెలంగాణలో 10 జిల్లాలే మిగిలాయి. ఇప్పుడు హైదరాబాద్ నుంచి వచ్చే ఆదాయం ఒక్క తెలంగాణకే సొంతం. అంతేకాదు, హైదరాబాద్ కాస్మో పాలిటన్ సిటీగా శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. ఈ నేపథ్యంలో దేశంలోనే తెలంగాణ అత్యంత ధనిక రాష్ట్రంగా ఆవిర్భవించే పరిస్థితులు ఉన్నాయి. స్వయంగా కేసీఆర్ కూడా ఈ విషయాన్ని అనేకసార్లు చెప్పుకున్నారు. కానీ, తొమ్మిదేళ్లు గడిచేసరికి రాష్ట్రం అప్పుల కుప్పగా మారిపోయింది. ఈ విషయాన్ని స్వయంగా కేంద్ర ప్రభుత్వమే పార్లమెంటులో ప్రకటించింది.

తెలంగాణ ఆవిర్భవించిన సమయంలో ఉన్న అప్పు ఎంత? ప్రస్తుతం ఉన్న అప్పు ఎంత? ఇందులో రాష్ట్ర ప్రభుత్వం నేరుగా తీసుకున్నది ఎంత? ప్రభుత్వరంగ సంస్థలు, కార్పొరేషన్లు తీసుకున్న రుణాల మాటేంటి? ఈ వివరాలన్నింటినీ లెక్కలతో సహా ప్రకటించింది కేంద్రం. అభివృద్ధి.. అప్పులపై తెలంగాణ ప్రభుత్వం, కేంద్రం మధ్య ఒక చిన్న యుద్ధమే నడుస్తోంది. మొన్నటి బడ్జెట్ సమావేశాల్లో అసెంబ్లీ వేదికగా కూడా సీఎం కేసీఆర్ ప్రధాని మోదీ లక్ష్యంగా విమర్శలు చేశారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశం అన్ని రంగాల్లో వెనకబడిందని విమర్శించారు. అయితే, ఇప్పుడు కేంద్రం తెలంగాణ అప్పులపై లోక్‌సభలో కీలక ప్రకటనచేసింది. కాంగ్రెస్ ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఏపీ నుంచి విడిపోయి తెలంగాణ ఆవిర్భవించినప్పుడు ఉన్న అప్పు.. 75 వేల 577 కోట్ల రూపాయలు. ఆ తర్వాత నుంచి ఏటా అది ఎలా పెరిగింది? ఏ సంవత్సరంలో ఎంత అప్పు తీసుకున్నారు అన్న వివరాలను కేంద్రం వెల్లడించింది. 2020-21 నాటికి తెలంగాణ అప్పు 2 లక్షల 83 వేల 452 కోట్ల రూపాయలకు చేరినట్లు కేంద్రం పేర్కొంది. అయితే ఇది ప్రభుత్వం చేసిన అప్పు మాత్రమే. ఇక ప్రభుత్వరంగ సంస్థలు, కార్పొరేషన్లు మరో లక్షా 50 వేల కోట్లు అప్పు తీసుకున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ వెల్లడించింది. ఈ మొత్తం కలిపితే తెలంగాణ రుణం 4 లక్షల 33 వేల 817 కోట్ల రూపాయలకు చేరింది. ఇందులో 12 వాణిజ్య బ్యాంకుల నుంచి తెలంగాణ ప్రభుత్వరంగ సంస్థలు, కార్పొరేషన్లు చేసిన అప్పు లక్షా 30 వేల 934.94 కోట్ల రూపాయలు, నాబార్డు నుంచి ప్రభుత్వం, ప్రభుత్వరంగ సంస్థలు తీసుకున్న రుణాలు 19 వేల 431 కోట్ల రూపాయల మేర ఉన్నట్లు వివరించారు.

ఈ ఎనిమిదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం నికరంగా 2 లక్షల 7 వేల 875 కోట్ల రూపాయల అప్పు చేసినట్లు కేంద్రం వెల్లడించింది. ప్రభుత్వరంగ వాణిజ్య బ్యాంకులు 2014 జూన్ నుంచి, 2022 అక్టోబర్ వరకు రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి అప్పులూ ఇవ్వలేదని, కానీ ప్రభుత్వరంగ సంస్థలు, కార్పొరేషన్లకు మాత్రం ఇచ్చాయని స్పష్టంచేశారు. ఇదే సమయంలో నాబార్డు ఆర్ఐడీఎఫ్ కింద తెలంగాణ ప్రభుత్వానికి 2014 జూన్ నుంచి 2022 అక్టోబర్ వరకు మొత్తం 7 వేల 144 కోట్ల రూపాయలు, వేర్‌హౌస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ కింద 852.27 కోట్ల రూపాయల రుణం ఇచ్చినట్లు కేంద్ర మంత్రి తెలిపారు. మౌలిక వసతుల అభివృద్ధి సాయం కింద ప్రభుత్వరంగ కార్పొరేషన్లకు 11 వేల 424.66 కోట్ల రూపాయలు, తెలంగాణ ఐఐసీకి 10.07 కోట్ల రూపాయల రుణం ఇచ్చినట్లు వెల్లడించారు.

గత కొన్ని నెలలుగా కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంపై తెలంగాణ సీఎం కేసీఆర్ సందర్భం దొరికినప్పుడల్లా విమర్శల వర్షం కురిపిస్తున్నారు. దూషణల స్థాయిని సైతం పెంచేస్తున్నారు. ఈ క్రమంలోనే తెలంగాణ అప్పులపై కేంద్రం చేసిన కీలక ప్రకటన కలకలం సృష్టిస్తోంది. తెలంగాణ తీసుకున్న అప్పుల వివరాలు కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు సాక్షిగా ప్రకటించడంతో బీఆర్ఎస్ తట్టుకోలేకపోతోంది. ఆ పార్టీ నాయకులు బీజేపీపై అవాస్తవాలు ప్రచారం చేస్తూ ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు.


వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

**పార్లమెంటు సాక్షిగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వ అప్పుల వివరాలు యేడాది వారీగా...**


| | |
|---|---|
| 2014-15లో | రూ. 8,121 కోట్లు |
| 2015-16లో | రూ. 15,515 కోట్లు |
| 2016-17లో | రూ. 30,319 కోట్లు |
| 2017-18లో | రూ. 22,658 కోట్లు |
| 2018-19లో | రూ. 23,091 కోట్లు |
| 2019-20లో | రూ. 30,577 కోట్లు |
| 2020-21లో | రూ. 38,161 కోట్లు |
| 2021-22లో | రూ. 39,433 కోట్లు |

**అమరావతి రాజధాని వ్యవహారంలో అధికార వైసీపీ ఇరకాటంలో పడింది. ఇప్పటి వరకు మూడు రాజధానుల నాటకం ఆడిన వైసీపీ, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన అఫిడవిట్‌తో గిలగిలలాడుతోంది. ఇప్పటికే 2014 ఏపీ పునర్విభజన చట్ట నిబంధనల మేరకే అమరావతి రాజధాని ఏర్పాటైందని, ఆ మేరకే రాజధానికి నిర్మాణానికి రూ.2,500 కోట్ల నిధులు విడుదల చేసినట్లు కేంద్ర ప్రభుత్వం కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. అలాగే పార్లమెంటులోనూ అమరావతి రాజధానిపై కూడా కేంద్ర ప్రభుత్వం లిఖితపూర్వక సమాధానమిచ్చింది. దీంతో ఈసారి ఉగాది పండుగ నాటికి ఎట్టి పరిస్థితుల్లో సీఎం క్యాంపు కార్యాలయం విశాఖకు తరలించాలన్న ఉత్సాహంతో ఉన్న వైసీపీ అధిష్ఠానం ఆశలు నీరుగార్చినట్లైంది. విశాఖను రాజధానిగా చేసి ఉత్తరాంధ్ర ప్రజల అభిమానం పొందాలనే ఆ పార్టీ ఆశ ఆడియాశైపోయే పరిస్థితి కనిపిస్తోంది.**


కేంద్ర మంత్రి నిత్యానందరాయ్


విజయసాయిరెడ్డి

రాజధానిని నిర్ణయించుకునే స్వేచ్ఛ రాష్ట్రాలకు ఉంటుందని కేంద్ర ప్రభుత్వం విస్పష్టంగా చెప్పిన మాట వాస్తవమా? అదే నిజమైతే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒకటికి మించిన రాజధానులను ఏర్పాటు చేసుకోవడాన్ని నిరాకరిస్తూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై కేంద్ర ప్రభుత్వ వైఖరి ఏమిటని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ లిఖితపూర్వక సమాధానమిస్తూ, 'ఏపీ విభజన చట్టం



**తురగా నాగభూషణం**
సీనియర్ జర్నలిస్ట్

లోని సెక్షన్ 5, 6 ప్రకారం రాష్ట్ర రాజధాని ఏర్పాటుపై అధ్యయనం కోసం కేంద్రం నియమించిన నిపుణుల కమిటీ సూచనలు, సలహాలతో నివేదికలు అంద చేసింది. వాటిని రాష్ట్ర ప్రభుత్వానికి పంపించగా, దాన్ని పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి రాజధానిగా అమరావతినే ఎంపిక చేస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది'అని వెల్లడించారు. ఆ తర్వాతే ఆంధ్రప్రదేశ్ క్యాపిటల్ రీజినల్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఏపీసీఆర్డీఏ)ని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఓ చట్టాన్ని తీసుకొచ్చినట్లుగా కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పార్లమెంటుకు వివరించింది. అయితే ఏపీసీఆర్డీఏను రద్దుచేసినట్లుగా, మూడు రాజధానులు ప్రతిపాదనలు తీసుకొస్తున్నట్లుగా వైసీపీ ప్రభుత్వం 2020లో కొత్త బిల్లు ప్రవేశపెట్టినట్లు మంత్రి వివరించారు. మళ్లీ ఆ బిల్లును వెనక్కి తీసుకుంటూ ఏపీసీఆర్డీఏ చట్టాన్ని కొనసాగింపుగా మరో బిల్లు ముందుకు వచ్చినట్లుగా మంత్రి వివరించారు. రాజధాని అంశం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉంటుం దని కేంద్ర ప్రభుత్వం చెప్పిందా? అని విజయ సాయిరెడ్డి అడిగిన మరో ప్రశ్నకు సమాధానంగా, అమరావతి రాజధాని అంశంలో హైకోర్టు ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసిందని, ప్రస్తుతం కేసు కోర్టులో ఉన్నందున దీనికి సంబంధించి ఇంతకంటే చెప్పడానికి ఏమీ లేదని కేంద్రం స్పష్టం చేసింది. దీనిపై మాట్లాడటం కోర్టు ధిక్కరణ అవుతుందని కూడా పేర్కొంది.

**ఆదినుంచీ అమరావతిపై వ్యతిరేకతే**

వైసీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి 'అమరావతి రాజధాని నిర్మాణం నిలిపివేసి మూడు రాజధానులు నిర్మిస్తామ'ని చెబుతూ ప్రజలందరినీ గందరగోళంలో నెట్టివేసింది. దాంతో రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులు కోర్టును ఆశ్రయించారు. ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు రాజధానులు బిల్లు చెల్లదని విభజన చట్టం ప్రకారం

# రాజధానిగా

హైకోర్టు స్పష్టమైన తీర్పునిచ్చిన విషయం తెల్సిందే. అలాగే కోర్టు తీర్పుకు భిన్నంగా ఏ ప్రభుత్వ శాఖ కార్యాలయాన్ని తరలించినా ఆ శాఖ ముఖ్య కార్యదర్శిపై చర్యలు తప్పవని కోర్టు హెచ్చరించింది. దీంతో కనీసం సీఎం క్యాంపు కార్యాలయాన్నైనా విశాఖకు తరలించి, అక్కడే సమీక్షలు నిర్వహించడం ద్వారా పరిపాలనా రాజధాని విశాఖేనన్న భ్రమ ప్రజలకు కల్పించాలని వైసీపీ అధిష్ఠానం ప్రయత్నిస్తోంది. దీనికి కూడా సాంకేతికంగా అనేక ఆటంకాలు ఏర్పడుతూ ఉండడంతో వాయిదాలు వేస్తూ వస్తోంది. గత మూడేళ్లుగా ప్రతి ఉగాదికి తరలింపు ఖాయమనే ప్రచారం చేస్తున్నారు. అమరావతే రాజధాని అని హైకోర్టు స్పష్టంగా తీర్పు ఇచ్చినా, వైసీపీ వైఖరిలో మార్పు రాలేదు. మూడు రాజధానుల బిల్లు ఉపసంహరించుకుంటున్నామని హైకోర్టులో స్వయంగా అఫిడవిట్ దాఖలు చేసింది. అంతలోనే, రాజధానిపై నిర్ణయం తీసుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదన్న హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

**ఉత్తరాంధ్ర ప్రజల ఓట్ల కోసం గాలం**

విశాఖలో రాజధాని ఏర్పాటు వెనుక సొంత లాభాలు ఎన్నున్నా ఉత్తరాంధ్ర ప్రజల ఓట్లకు గాలం వేయడమేనని బహిరంగంగా తెలిసిపోతోంది. అమరావతి రాజధాని కేసుపై ఈనెల 23వ తేదీ విచారణ జరుపుతామని సుప్రీంకోర్టు వెల్లడించింది. కోర్టు తీర్పు ఎలా ఉన్నా వచ్చే ఎన్నికల నాటికి వైసీపీ ప్రభుత్వం తన పంతం నెగ్గించుకోవడానికి విశాఖకు


సీఎం క్యాంపు కార్యాలయాన్ని అయినా తరలించాలనే పట్టుదలతో ఉంది. అందుకోసం ఉగాది నాటికి తరలించేలా విశాఖ బీచ్ రోడ్డులో ఏర్పాట్లు జరుగుతున్నట్లు మీడియాలో వార్తలు రావడమే కాదు పాలక నేతలే చెబుతున్నారు. అమరావతి రాజధాని నిర్మాణానికి దాదాపు 30వేల మంది రైతులు 34 వేల ఎకరాల భూములు ఉచితంగా ఇవ్వడం, ఆ భూముల్లో సుమారు 50వేల విలువైన నిర్మాణ పనులు ప్రారంభం కావడం, గత ఏడేళ్లుగా ఇక్కడ నుంచే పరిపాలన జరుగుతున్న నేపథ్యంలో అమరావతి రాజధాని తరలింపు అసాధ్యమని అందరూ అంగీకరిస్తున్నారు. కాని వైసీపీ ప్రభుత్వం మాత్రం విశాఖపై మనసును మాత్రం వదలిపెట్టడం లేదు. అక్కడ రాజధాని ఏర్పాటును ఉత్తరాంధ్ర ప్రజల అభివృద్ధితో ముడిపెట్టింది. అందుకోసం విశాఖలో ఉత్తరాంధ్ర గర్జన నిర్వహించింది. ప్రజల్లో ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టింది. మంత్రి ధర్మాన ప్రసాదరావు అయితే అమరావతి రాజధానిగా కోరిన పక్షంలో విశాఖ రాజధానిగా ప్రత్యేక ఉత్తరాంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేయాలని కూడా ప్రకటించారు. సీఎం క్యాంపు కార్యాలయం ఎక్కడైనా పెట్టుకునే అధికారం ఉన్నందున, ఆ అవకాశాన్ని వినియోగించుకుని ఇకపై విశాఖలోనే సీఎం తిష్టవేసి అక్కడే అన్ని శాఖల సమీక్షలు జరుపుతూ చెప్పిన మాట ప్రకారం పరిపాలనా రాజధానిని విశాఖకు తరలించామని విస్తృత ప్రచారం చేసుకుని ఉత్తరాంధ్రలో ప్రజాభిమానం పొందాలనేది వైసీపీ ప్రభుత్వ ఆలోచన.

# విశాఖ కలేనా?

**'శివరామ' నివేదిక అమలుచేయాలని పిటిషన్**

సుప్రీంకోర్టులో దాఖలు చేసిన కేంద్రం అఫిడవిట్‌కు కౌంటర్‌గా ఏపీ సర్కార్ వికేంద్రీకరణకు మద్దతుగా శివరామకృష్ణన్ కమిటీ రిపోర్టును తెరపైకి తెచ్చింది. ఏపీ రాజధాని విషయంలో శివరామకృష్ణ కమిటీ నివేదిక అమలు చేయాలని సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్ వేసింది. చంద్రబాబు ప్రభుత్వం ఆ కమిటీ నివేదికను సక్రమంగా అమలు చేయలేదని సుప్రీంకోర్టులో బలంగా వాదించి, కేసు నెగ్గాలనే ధోరణిలో వైసీపీ ఉంది. ఏపీ రాజధాని విషయంలో శివరామకృష్ణ కమిటీ నివేదిక అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ వేయగా, జస్టిస్ కేఎం జోసెఫ్, జస్టిస్ నాగరత్నం ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ పిటిషన్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో నాటి కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన శివరామకృష్ణ కమిటీ సిఫార్సులను వివరించింది. ఏపీలో అతి పెద్ద రాజధాని ఏర్పాటు సరైందని కాదని, రాష్ట్రంలో రాజధానిని, అధికార వ్యవస్థలను వికేంద్రీకరించాలని, ప్రభుత్వ వ్యవస్థలను ఒకేచోట కాకుండా వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని కమిటీ తెలిపినట్లు గుర్తుచేసింది. విజయవాడ–గుంటూరు, విశాఖ కేంద్రంగా ఉత్తరాంధ్ర, శ్రీకాళహస్తి – నడకుడి, రాయలసీమ ప్రాంతాల మధ్య ప్రభుత్వ వ్యవస్థలను వికేంద్రీకరించాలని, అసెంబ్లీ, సచివాలయం ఎక్కడ ఉంటాయో అక్కడే హైకోర్టు ఉండాలని లేదని తెలిపింది. హైకోర్టు ఒక ప్రాంతంలో, మరో ప్రాంతంలో బెంచ్ ఏర్పాటు చేయవచ్చు అని, ఉత్తరాంధ్ర, రాయలసీమలో ప్రభుత్వ వ్యవస్థలను విస్తరించాలని, రాజధానిని రెండు పట్టణాల మధ్య పూర్తిగా కేంద్రీకరిస్తే... రాష్ట్రంలో ఇతర ప్రాంతాల అభివృద్ధి అవకాశాలు దెబ్బతింటాయని కమిటీ తెలిపినట్లు పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్రధానంగా గుంటూరు–విజయవాడ మధ్య సారవంతమైన పంటలకు తక్కువ నష్టం జరిగేలా రాజధానిని ఏర్పాటు చేయాలని, విజయవాడ–గుంటూరు మధ్య భూగర్భ జలమట్టం చాలా పైకి ఉంటుందని తెలిపిందని, ఈ ప్రాంతం భూకంప ప్రభావిత క్షేత్రం అని, అందుకే ఇక్కడ భారీ భవనాల నిర్మాణం సరికాదని, అన్ని జిల్లాల ప్రధాన నగరాల్లో సమగ్రాభివృద్ధికి విధి విధానాలను రూపొందించాలని కమిటీ సూచించిందని పిటిషన్లో వివరించింది. ★

## 'కథాకృపాకరం' ఆవిష్కరణ



**విశాఖపట్టణం:** కృపాకర్ రాసిన కథా సంకలన 'కథాకృపాకరం' ఆవిష్కరణ కార్యక్రమం ఇటీవల విశాఖ జిల్లా పౌర గ్రంథాలయం ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా రచయిత (ఎడమ నుంచి ఐదోవ్యక్తి) మాట్లాడుతూ హైదరాబాద్ వాసినైనా, విశాఖపట్నంపై మక్కువతో ఇక్కడ కార్యక్రమం ఏర్పాటు చేశామని అన్నారు. వేదిక మీద సమీక్షకులు ఎంవీ రామిరెడ్డి, వరిష్ఠ రచయిత ద్విభాష్యం రాజేశ్వర రావు, సభాధ్యక్షులు మల్లాప్రగడ రామారావు, ఆవిష్కర్త ఒలేటి శ్రీనివాసభాను, కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కార గ్రహీత ఎల్.ఆర్. స్వామి, కథామంజరి సంపాదకులు జయంతి ప్రకాశశర్మ ఉన్నారు.

## గ్రామాల అభివృద్ధే గ్రామ వికాస్ లక్ష్యం



**అనంతపురం :** అనంతపురం జిల్లా రాయదుర్గం చుట్టుపక్కల మండలాల్లో గల గ్రామాల్ని ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు గత ఆరేళ్లుగా గ్రామవికాస్ కృషిచేస్తోంది. సంస్కార కేంద్రాలను ఏర్పాటుచేసి గ్రామాల్ని అభివృద్ధి పథంలో నడిపిస్తోంది. 25 గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రతిరోజు రెండు గంటల పాటు సంస్కారంతో కూడిన విద్యాబోధన జరుగుతోంది. ఇందులో దేశభక్తి పాటలు, సుభాషితాలు, కోలాటం, అభినయగేయం, భగవద్గీత, యోగావంటివి నేర్పిస్తున్నారు. విద్యార్థులలో శారీరక దృఢత్వం, మానసిక వికాసం, నైతిక విలువలను పెంపొందిస్తున్నారు. విద్యార్థులకు మట్టి గణపతి, సీడ్‌బాల్స్ తయారీ, రక్షాబంధన్ తయారీ నేర్పిస్తున్నారు. విహార యాత్రలకూ తీసుకెళ్తున్నారు. సంక్రాంతి, ఉగాది, యోగా డే, శ్రీరామనవమి, సూర్యనమస్కార యజ్ఞం, భారతమాత పూజా దినోత్సవం, సంస్కార కేంద్ర వార్షికోత్సవం తదితర కార్యక్రమాల నిర్వహణ ద్వారా విద్యార్థులు, గ్రామస్తుల్లో సద్గుణాలు నిర్మాణంచేయడం కోసం గ్రామవికాస్ కృషిచేస్తోంది. తల్లిదండ్రులు, పిల్లల మధ్య సంబంధాలు పటిష్టపరిచేందుకు మాతాపితృ పూజా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. సమరసతా సాధన కోసం అన్ని కులాలవారితో కలిసి దీపోత్సవం నిర్వహిస్తున్నారు. రైతులు సేంద్రీయ వ్యవసాయం చేసేలా ప్రోత్సహిస్తున్నారు. సంవత్సరంలో ఒకసారి బాల సంగమం జరుపుతారు. ఈ కార్యక్రమాల్లో గ్రామస్తులు అందరూ ఎంతో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. మార్పులను స్వాగతిస్తున్నారు. ★

మతి, స్మృతి, బుద్ధి. ఈ మూడింటిలో మొదటిది భవితను సూచిస్తుంది. రెండోది గతానికి చెందింది. ఇక మూడోది – ప్రస్తుతాన్ని వెల్లడిస్తుంది. వీటన్నింటికీ వర్తించేది ప్రజ్ఞ. ఇది వెల్లివిరిస్తే ప్రతిభ. దీనికి సృజన తోడైతే శక్తి. మరి శక్తియుక్తీ కలగలిస్తే... ఏమవుతుంది? అని నటాషాను అడిగితే బాగా చెప్తుంది. ఆ అమ్మాయికి పదమూడేళ్లు. భారత సంతతి బాలిక. పూర్తిపేరు-నటాషా పెరియ నాయగం. స్వస్థలం తమిళనాడులోని చెన్నై ప్రాంతం. అక్కడి నుంచి ఆ కుటుంబ పెద్దలు ఏనాడో అమెరికా దేశానికి చేరారు. అదే వంశంతో పాటు మన భారతదేశ కీర్తినీ విదేశంలో వెలిగిస్తోంది బాలిక. ప్రపంచంలోని 76 దేశాల నుంచి పదిహేను వేల మందికి పైగా ప్రజ్ఞాసంపన్న విద్యార్థులు పాల్గొన్న గ్రేడ్ స్థాయి పరీక్షల్లో పటిమ చాటింది. విశ్వవ్యాప్త ప్రతిభావంత బాలల జాబితాలో ఈమె పేరు చోటు చేసుకుంది! ఇంతటి ఖ్యాతిని సాధించడం తనకు ఇది మొదటిసారి కాదు. రెండోసారి. ఇండియన్ – అమెరికన్ టీన్స్‌లో ఇంతటి సుప్రసిద్ధత సంపాదించిన నటాషా గురించి అన్ని వివరాలూ తెలుసుకుందాం. ఈ బ్రైటెస్ట్ స్టూడెంట్‌కి అభినందన చందన మందారహారం అందించి, మనసారా శుభాకాంక్షలు తెలిపి, భారతీయత ప్రభానిధిత్వాన్ని ఎంతైనా ప్రశంసిద్దాం. 'సుభగ సుందర సుమనోజ్ఞ శోభలొలుకు రంజతాఖలలోక భారత పతాక / భరత బాలల భాగ్యాల పంటయగుచు అవని ఆచంద్ర తారార్క మలరుగాక' అని కలసికట్టుగా దీవిద్దాం. ఎందుకంటే నటాషాలో రెండు మేధలున్నాయి. ఒకటి సుమేధ, మరొకటి సత్యమేధ. గొప్ప తెలివి, పాటవ సంపత్తి ఉన్నాయి కాబట్టే.. సెంటర్ ఫర్ టాలెంటెడ్ యూత్ (సీటీవై) నుంచి మరోసారి ప్రత్యేక గుర్తింపు పొందింది బాల 'సరస్వతి'!

# విదేశంలో మరో భారతతేజం 'నటాషా'



ఎప్పుడూ నవ్వుల పువ్వులు రువ్వే నటాషాకి గమనింపు సామర్థ్యం మొదటి నుంచీ ఎక్కువే. తాను న్యూజెర్సీలోని పాఠశాలలో చదువుతోంది. గ్రేడ్ 5 విద్యార్థినిగా ఉండగానే, 2021లో టాలెంట్ టెస్ట్ రాసింది. వివిధ విభాగాల్లో అత్యధిక మార్కులు సంపాదించి, గ్రేడ్ 8 స్థాయిని కనబరచింది. ఇంతటి అద్భుత ముందడుగే తనను ఆనర్స్ లిస్టులోకి చేర్చింది. పాఠశాలతో పాటు కళాశాల స్థాయి ఫర్‌ఫార్మెన్స్‌లోనూ ఎబిలిటీ టెస్ట్ మేటిగా నిలిచింది. ఇదే అంశాన్ని సంబంధిత విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు సగర్వంగా ప్రకటించారు. టాలెంట్ సెర్చ్‌లో తన మేధాసంపత్తి చూసి ఆశ్చర్యచకితులమయ్యామని విపులీకరించారు. ఎప్పుడు ఏ కాస్త సమయం లభించినా ఆంగ్ల నవలల్లో తలదూర్చే అమ్మాయి ఎప్పుడూ మెదడుకు పదునుపెడుతూనే ఉంటుంది. ప్రపంచం మొత్తం మీద అడ్వాన్స్ మేధావులను అన్వేషించే క్రమంలో పరమోన్నత స్థాయి పరీక్షను నిర్వహించింది వర్సిటీ. ఈ సిటీవై శోధనలో పాలుపంచుకున్న అందరికన్నా గ్రేడ్ల ఉన్నతిని వశం చేసుకుంది నటాషా. కచ్చితంగా ఇదొక అపూర్వ అపురూప ఘన విజయమంటున్నారు నిర్వాహకులు. విజేతల పరిశోధనాసక్తి, వారి శక్తియుక్తులను ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ – మరీ ముఖ్యంగా ఈమె పేరును కరతాళ ధ్వనుల మధ్య ప్రకటించారు. అత్యద్భుత భవితవ్యానికి ఇదొక సూచిక అంటూ సెంటర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అమీషెల్టన్ కితాబిచ్చారు. 'తెలివితేటలను ఆ బాలిక ప్రదర్శించిన తీరు మమ్మల్ని ముగ్ధుల్ని చేసింది. అంత చిన్న వయసులో ఇంత మేధను మేం ఇంతవరకు ఇంకెక్కడా చూడలేదు. వేగం, ధారణ, జ్ఞాపకశక్తి, సమయస్ఫూర్తి, అన్నింటినీ మించి పరిణతి నటాషాలో పుష్కలంగా ఉన్నాయి. తనను చూసి నిజంగా మేమెంతో గర్వపడుతున్నాం' అన్నారామె.



**జంధ్యాల శరత్‌బాబు**
సీనియర్ జర్నలిస్ట్

భవంతి ఎంత మహోన్నతంగా ఉన్నా, దాని ఉనికి మొత్తానికీ పునాదే ఆధారం. అదే రీతిన జీవితంలో సముదాత్త స్థాయికి చేరడానికి చదువే ప్రధానం. చదువుల పరిమళాలు గుబాళిస్తేనే, ఆస్వాదించి మానవాళి పులకిస్తేనే, జీవితానికి సార్థకత. చదివినంతసేపూ ఆసక్తి ఉంటే, ఆ చదివింది పరీక్షల్లో వ్యక్తపరిచేంత శక్తి నిండితే, స్వదేశంలోనైనా విదేశాన అయినా పురోగమనే కదా! నటాషా వంటి విజేత విద్యార్థినుల దృష్టిలో – విద్య అన్నది ఎప్పటికప్పుడు ఎక్కడికక్కడ పడి ఉంటే జడపదార్థమేమీ కాదు.



**చదువుల మాలిక ఈ బాలిక**

డెస్ట్‌స్కోర్ ఆధారంగా, ఈ మేధావి బాలకు అంతటా గ్రాండ్ ఆనర్ హోదా లభించింది. ‘పిట్ట కొంచెం, కూత ఘనం’ అనేది ఇందుకేనేమో! తన చదువుకూ, ఎదురయ్యే ప్రశ్నలకు తను చెప్పే సమాధానాలకు ఎంతో తేడా! మాటలు సైతం ఆచితూచి అన్నట్లు ఉంటుంటాయి. తాను చదువు తున్న తరగతి కన్నా, ఆపై గ్రేడ్ స్థాయి ప్రశ్నలకు బదులివ్వడమంటే మాటలా? అంతటి మేటి బాలల్లో అర్హత పొందింది 27 శాతంలోపే. వారిలో నటాషా విశేషాల బాలిక. ఎంత పాటవం లేకపోతే ఆమె రెండు (వెర్బల్, క్వాంటిటేటివ్) విభాగాల్లో 90కి పైగా స్కోర్ చేస్తుంది? ఎంతటి శక్తి సామర్థ్యాలు లేకుంటే టాపర్ల జాబితాలో చోటు సంపాదించుకుంటుంది? అత్యంత చురుకైన పిల్లల్ని వెలికితీసి పేరు ప్రఖ్యాతులు సంతరింపచేయాలన్నదే నిర్వాహకుల లక్ష్యం. అందుకే ఏటా విభిన్న రీతిన పాటవ పరీక్షలు ఏర్పాటు చేస్తుంటారు. అభ్యసించాలన్న తపన, గెలిచి తీరాలన్న పట్టుదల మెండుగా కలవారు వీటిల్లో పాల్గొంటూ ఉంటారు. వయసుకు మించిన జ్ఞాన ప్రతిభ చూపు తుంటారు. వారిలో అగ్రస్థానాన నిలవడమే నటాషా విలక్షణత. ఇంతింత అరుదైన రికార్డును సృష్టించిన ఈమె దీన్ని పోటీగా భావించిందా? పరీక్షగా పరిగణించిందా? అంటే... రెండూ! మెదడు అనేది కేంద్ర నాడీ వ్యవస్థ మొత్తానికి కీలకం. ఇందులో ఎన్నెన్ని కోట్ల కణజాల కూడళ్లు ఉంటాయో ఒక పట్టాన చెప్పలేం. ధారణ అయినా, విశ్లేషణ నిండినా, సృజన సంబంధమైనా– అన్నీ ఇందులోనే. చూసేది నేత్రాలోకానీ, చూపేది మటుకు మెదడే కదా! ఆ కణాల సంచలన వేగం ఎంత ఎక్కువగా ఉంటే, అంత మేధ దాగి ఉన్నట్లు. అది ఇంకా ఇంకా విస్తరించాలంటే, మెదడు కణాలన్నీ ఉత్తేజితమవ్వాలి. ఆ రీత్యా చూసినప్పుడు, నటాషా ఆలోచనల వేగాన్ని ఇంత అని ఎలా నిర్ధారించగలమో కదా!

**విద్యాధన వర్ధనం**

ఇదంతా చూస్తుంటే, వింటుంటే, ఆలోచనగా సాగిస్తుంటే, ప్రాచీన పద్యమొకటి గుర్తుకొస్తుంది. దాన్ని ఇదే సందర్భంలో సమన్వయిస్తే –

**కలదు మాకడ శుభంకర తపః ఫలరూపమై**
**జగమేలు మహాధనమ్ము**
**కలదు మాకడ సత్యబలమాన్యమై**
**శాశ్వతానందకరమౌ మహాధనమ్ము**
**కలదు మాకడ దానకల్పకమై**
**నిత్య అభివర్ధ తమ్మపు మహాధనము!**

ఇవే మాటల్ని ‘నాకడ’ అని అన్వయించి నటాషా నోట చెప్పిస్తే–జగాన్ని ఏలేది, ఆనందాన్ని శాశ్వతంగా ప్రసాదించేది, నిత్యమూ వర్ధిల్లుతూనే ఉండేది జ్ఞానధనం! ఆ ధనికురాలు నటాషా. ఆమె భారత సంతతి బాలిక కావడం అందరికీ సగర్వనీయమే. విద్య, విజ్ఞానం, వికాసం... వీటిల్లో దేనికి అదే మహాధనం. అదొక దీపం. ప్రకాశమైనా, వికాసమైనా దానితోనే! విద్యలో భాగాలుగా అనేకం ఉంటుంటాయి. ప్రధానంగా సూచకం, వాచకం, బోధకం. నటాషాలో ఈ మూడూ మిళితమై ఉన్నాయి. తాను చదివే పుస్తకాలు సామాజిక, శాస్త్రగమనాన్ని సూచించేవి. తాను పొందిన పరీక్షల అనుభవాలు మాటల్లో వ్యక్తమవుతూ ఉంటున్నవే. తన ఈ ఘనతకు కారణం తల్లిదండ్రులు నేర్పిన బోధలే అనడం ఆమె మూర్తిమత్వాన్ని చాటి చెప్తున్నాయి. శాస్త్రం, గణితం, సంఖ్యాశాస్త్రం, ఏ ఇతర అంశంమీదనైనా తర్కిస్తుందామె. కేవలం పుస్తక పరిజ్ఞానం కాదు. మార్కులకే పరిమితమైన జ్ఞానం అంతకన్నా కాదు. రోజువారీ అభ్యాసాలు, ప్రయోగాల నుంచి వెలువడటంవల్ల – నటాషా కృషి అంత అత్యుత్తమ ఫలితాన్ని అందుకుందని మనలో ఎవరైనా సరే, ఢంకా బజాయించి చెప్పవచ్చు. తను సాధించి సముపార్జించింది ఒక్క బుద్ధిబలంతోనే కాదు, ఆచరణాత్మక దృక్పథంవల్ల కూడా.

**విజయాల మారు పేరు**


భవంతి ఎంత మహోన్నతంగా ఉన్నా, దాని ఉనికి మొత్తానికీ పునాదే ఆధారం. అదే రీతిన జీవితంలో సముదాత్త స్థాయికి చేరడానికి చదువే ప్రధానం. చదువుల పరిమళాలు గుబాళిస్తేనే, ఆస్వాదించి మానవాళి పులకిస్తేనే, జీవితానికి సార్థకత. చదివినంతసేపూ ఆసక్తి ఉంటే, ఆ చదివింది పరీక్షల్లో వ్యక్తపరిచేంత శక్తి నిండితే, స్వదేశంలోనైనా విదేశాన అయినా పురోగమనే కదా! నటాషా వంటి విజేత విద్యార్థినుల దృష్టిలో – విద్య అన్నది ఎప్పటికప్పుడు ఎక్కడికక్కడ పడి ఉంటే జడపదార్థమేమీ కాదు. అదంతా

**ఒక సత్తా**
**ఒక సత్తువ**
**ఒక శోధన**
**ఒక సాధన.**

వీటిని ఫలప్రదం చేసేందుకే శిక్షణలైనా, పరీక్షలైనా! ఇందులో ఎవరికివారు నిలవాల్సిందే, గెలుపు అందుకోవాల్సిందే. దీనిలో ఒత్తిడిని చిత్తు చేయటముంటుంది. చదువున్నది అలవోకగా సాగిపోతుంటుంది. సమస్యలూ సవాళ్లూ కనిపించవు. పరీక్షలు, వాటిల్లో కృతార్థతలే కనిపిస్తాయి. అలా కనిపించే, వినిపించే ప్రతిభా సంపత్తి ఉన్న భారతీయ సంతతి బాలిక, అమెరికా విజ్ఞాన వీధిన ధగధగ లాడుతున్న తారక నటాషా. ఎప్పుడైనా అంతేకదా! సారవంత మనోభూమిలోనే చదువు సేద్యం వర్ధిల్లు తుంది. నటాషా వంటి అమ్మాయిల పాత్ర, ప్రత్యేకత, ప్రశస్తి వల్లనే సరస్వతీమాత మహదానంద తరంగిత అవుతుంది. బాల మేధావినికి జేజేలు! ★


# అపూర్వ

తెలుగువారికే సొంతమైన అపురూప వినోద, విజ్ఞాన సమ్మేళనం అవధానం. 'అవధానం అంటే మనసులో హెచ్చరిక లేదా ఏకాగ్రత కలిగి ఉండడం అని చెబుతారు. ఒక విషయాన్ని మనసులో ధరించడం లేదా ధారణ చేయడం అవధానం అనే పదాన్ని నిర్వచించవచ్చు. అలా ధారణ చేసిన దానిని 'స్మృతి'లో (Memory)లో నిలిపి ఉంచి అవసరమైనప్పుడు ఇతరులకు అప్పగించడం (Reproduction) అనే భావం కూడా ఇందులో ఇమిడి ఉంది. ఈ మహోన్నత సాహిత్య ప్రక్రియ వందల ఏళ్ల నుంచే ఉన్నప్పటికీ, ఆధునిక కాలానికి సంబంధించి గుంటూరుకు చెందిన మాడభూషి వేంకటాచార్యులును ఆద్యులుగా పరిగణిస్తారు. ఆయన 150 ఏళ్ల క్రితం (ఫిబ్రవరి 22, 1872) కృష్ణా జిల్లాలోని ఆగిరిపల్లిలో మొదటిసారి అవధానం నిర్వహించినట్లు చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. ఆ ప్రాతిపదికపైనే ఆ రోజును 'అవధాన దినోత్సవంగా నిర్వహించాలని సాహితీలోకం చిరకాలంగా కోరుతోంది.


తిరుపతి వేంకటకవులు

తెలుగువారికి సొంతమైన అపురూప వినోద, విజ్ఞాన సమ్మేళనం అవధానం. అవధానమంటే ఏకాగ్రత, తదేక నిష్ఠ అని అర్థం చేసుకోవచ్చు. ఇది కవి మేధోసంపత్తిని ప్రతిబింబింపచేసే విశిష్ట ప్రక్రియ. 13వ శతాబ్దం కడపటి దశ నుంచి ఈ ప్రక్రియ ఉన్నట్లు సాహిత్య చరిత్ర చెబుతుండగా, 19వ శతాబ్దంలో విద్వాన్ మాడభూషి వేంకటాచార్యులు అవధానం చేసేంత వరకు దీని స్వరూప స్వభావాల పట్ల ఆంధ్రులకు అంతగా అవగాహన లేదని సాహితీ వేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఆయన గంటకు వందల పద్యాలు చెప్పగలగడమే కాక అద్భుతావహమైన 'ఏకసంథా'గ్రహణ శక్తి కలవారని ప్రసిద్ధి. అష్టావధాన, శతావధాన ప్రక్రియలకు సరైన లక్షణాలు లేని కాలంలో వాటిని ఏర్పచి ఆంధ్ర సాహిత్యలోకానికి వాటి స్వరూప స్వభావాలను ఎరుకపరచిన మాడభూషి వారు నూజివీడు సంస్థాన ఆస్థాన కవిగా విలసిల్లారు. పద్యాన్ని అనులోమంగా, ప్రతిలోమంగాను చదవగల నేర్పరి. ఆయన అనుసరించిన విధానాన్ని తాము అనుకరించి అవధానాలు నిర్వహించామని తిరుపతి వేంకటకవులు తమ 'శతావధానసార' పీఠికలో పేర్కొన్నారు.

అవధానులుగా తిరుపతి వేంకటకవుల ప్రాభవం, ప్రభావం అనన్య సామాన్యం. దివాకర్ల తిరుపతి శాస్త్రి, చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి జంట అవధానులకు ఆద్యులు. తెలుగు సాహితీ సుమగంధాలను సామాన్య జనవాహినికి చేరేలా చేసిన ఘనత వీరికే దక్కుతుంది.




డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి

సీనియర్ జర్నలిస్ట్


పామరులు కూడా అవధానాలను ఆస్వాదించేలా సాధారణ విషయాలను కూడా వాటిలో మిళితం చేసేవారు. అప్పటి వరకు రాజాస్థానాలలో నర్తించిన కవితాకన్యను అవధానాల ద్వారా ప్రజా సమూహం మధ్యకు తెచ్చిన ప్రజాస్వామ్య కవితా వ్యవస్థాపకులుగా కీర్తిని ఆర్జించారు. ఈ ప్రక్రియకు బహుళ ప్రాధాన్యం కల్పించారు. దీనిని 'జగదాశ్చర్యకర' విద్యగా అభి వర్ణించారు. వారి హయాంలో తెలుగునాట అవధా నులు, ఆశుకవులు, ప్రబంధకర్తలు విరివిగా కనిపి స్తారు. అందుకే, శతావధాని వేలూరి శివరామ శాస్త్రి.


**'ఎక్కడఁ జూచినన్ గవులె, యెక్కడఁ జూడ శతావధానులే / యొక్కడఁ జూడ నాశుకవులెక్కడఁ జూడ బ్రబంధకర్తలే**
**దిక్కరులంచుఁబేర్వడిన తిర్పతి వేంకట సూరు లేగు నా / ప్రక్కల నెల్ల నీ కడుపు పండినదమ్మ! తెలుగుదేశమా!...** అని కీర్తించారు.

మాడభూషి వారి స్ఫూర్తితోనే తాము శతావధాన విద్యలో కృతార్థులమయ్యామని దేవులపల్లి సోదరులు (పిఠాపురం) చెప్పుకున్నారు. కాకతీయుల ఆస్థానంలో కోలాచలం మల్లినాథయ్య తొలి అవధానిగా, శిరిశన హళ్ కృష్ణమాచార్యులు (కోరుట్ల) ఆద్య శతావధానిగా వినుతికెక్కారు. మొత్తం తెలుగునాట వేంకట రామకృష్ణకవులు, కొప్పరపుకవులు, వేలూరి శివరామ శాస్త్రి, అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రి, కాశీ కృష్ణాచార్యులు, ప్రతివాద భయంకర రాఘవాచార్యులు, పీశుపాటి చిదంబరశాస్త్రి, గాడేపల్లి వీరరాఘవ శాస్త్రి, పోకూరి కాశీపతి, జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి, సీవీ సుబ్బన్న అవధాని, పింగళి లక్ష్మీకాంతం, కాటూరి వేంకటేశ్వ రావు, విశ్వనాథ సత్యనారాయణ తదితరులు అవధాన శుకవితా ప్రదర్శనలతో విద్వత్కవితాప్రియుల మెప్పు పొందారు.

**అవధానం-ఏకాగ్రత**

కవిత్రయంతో పాటు శ్రీనాథుడు, తెనాలి రామకృష్ణ కవి, పుష్పగిరి తిమ్మన తదితరులు తమ రచనలలో 'అవధాన' శబ్దాన్ని 'ఏకాగ్రత'కు ప్రత్యా మ్నాయ పదంగా వినియోగించారు. చిత్తం (మనసు) అతి చంచలమైనది. అటుఇటు పరుగులు తీసే దానిని నియంత్రించడం కష్టసాధ్యమని ప్రత్యేకంగా చెప్పన వసరం లేదు. అది ఒకప్పుడు గాఢసుషుప్తిలో ఉంటుంది. మరొకప్పుడు పరుగులు తీస్తుంది. సుషుప్తి సమయంలో మేల్కొలిపి, పరుగులు తీస్తున్నప్పుడు నియంత్రిస్తూ ఏకాగ్రతను సాధించడం మహా కష్టతరం. వాస్తవానికి దీనిని ఒక యోగంగా చెప్పాలి. 'దయచేసి వినండి' అని అభ్యర్థన పూర్వక ప్రకటన లోనే 'సావధాన మనస్కత' ఎంత కష్టమో బోధపడు తుంది. ఒక అంశంపై మనసు పెట్టడమే అసాధ్య మనుకుంటే అనేక విషయాల పట్ల మనసును లగ్నం చేసి సావధానచిత్తులై ఉండడం ఎంత కష్టతరమో అనిపిస్తుంది సామాన్యులకు. ఏకకాలంలో అనేక అంశాలను చక్కదిద్దుకుంటూ నిభాయించుకు రావడానికి ఎంతో ప్రజ్ఞాపాటవాలు అవసరం. అందుకే ఏకకాలంలో అన్ని పనులను అతి సమర్థంగా నిర్వహించగలిగే వారిని 'అష్టావధానులు' అని ప్రశంసించడంలోనే ఈ ప్రక్రియ విశిష్టత తెలుస్తోంది.

పృచ్ఛకులకు ఇచ్చే సమస్యలు, అడిగే ప్రశ్నలకు అవధాని ఏకాగ్రత, సృజనాత్మకత, సద్యఃస్ఫూర్తితో చందోబద్ధంగా ఒక్కొక్క ఆవృతానికి ఒక్కొక్క పాదం పూరించి, చివరిలో ధారణతో వివరిస్తారు. ఎలాంటి సమస్యనైనా పూరించగల సామర్థ్యం, చతురత, సమయోచిత సమాధానం చెప్పి ఒప్పించడంలో ఏకాగ్రత అవసరం. అష్టాదశ పురాణాలు, తెలుగు కావ్యాలు, పూర్వ కవుల ప్రయోగాలతోపాటు వర్తమాన వ్యవహారాల పట్ల అవగాహన కలిగి, వాటిని సందర్భానుగుణంగా ఉటంకించగలగాలి. అప్పుడే అవధాన అక్షర క్రతువు రక్తికడుతుంది. ఈ ప్రక్రియకు ఆశుకవిత, ధారణ ఆయుపుపట్టు. వెయ్యిమంది



మేడసాని మోహన్ గరికపాటి నరసింహారావు మాడుగుల నాగఫణిశర్మ

# ప్రక్రియ అవధానం

అడిగిన సమస్యలను పూరించడం ఒక ఎత్తయితే, అన్ని పద్యాలను అక్షరం పొల్లుపోకుండా చివరిలో వరుసక్రమంలో ధారణ (అప్పగించడం) చేయడం ఎంత కష్టమో ఊహించలేం. విన్న విషయాన్ని మరుక్షణంలో మరచిపోయే పరిస్థితులలో అన్నన్ని పద్యాలను గుర్తు పెట్టుకుని అప్పగించడం ఎలా సాధ్యం? అని ప్రశ్నించుకుంటే ఆ కిటుకు అవధానులకు తెలియాలి. స్థూలంగా.. దానిని 'ఏకాగ్రత'గా చెప్పుకోవాలి. చక్కని పాండిత్యం, ఆశుధార, ప్రతిభ, వ్యుత్పన్నత, అభ్యాసం కలిగిన అవధానులు సద్యఃస్ఫూర్తితో అప్పటికప్పుడు (ఆశువుగా) చెప్పిన పద్యాలు, శ్లోకాలు ఎక్కడా కుంటుపడకుండా నిలకడగా రాసినట్లుగానే మనసులకు హత్తుకుంటాయి.

వేదాధ్యయనం, వేదపఠనాన్ని కూడా నాడు అవధానంగానే వ్యవహరించేవారట. వాటిలోని పన్నలు, పనసలను కంఠస్థం చేసి, జ్ఞాపకం పెట్టుకుని అవసరమైనప్పుడు అనర్గళంగా అప్పగించేవారు. కానీ అవధాన ప్రక్రియ దానికంటే కొంత భిన్నత్వంతో కూడుకున్నది. అధ్యయనం చేసిన దానిని తిరిగి అప్పగించడానికి, ఆశువుగా కవిత్వం అల్లి అందరి పూరింపులను గుర్తుంచుకుని ఏకధాటిగా ధారణ చేయడానికి వ్యత్యాసం ఉంటుందంటారు సాహితీవేత్తలు.

**పడిలేచిన కెరటం**

ఒకనాడు సాహితీవనంలో పచ్చగా విలసిల్లిన అవధాన ప్రక్రియ కొన్నేళ్లపాటు మోడువారింది. 'పదకొండవ శతాబ్ది నారాయణ భట్టు నాడు మొలకెత్తి పదునారవ శతాబ్దిలో చిగురించి పందొమ్మిదవ శతాబ్దిలో మాడభూషి వారిచే మొగ్గతొడిగి తిరుపతి వేంకటేశ్వర కవీశ్వరాదులచే ఆమనియందువలె పూచిన ఈ అవధానాశు కవిత్వ కళావల్లి కొన్నినాళ్లు తెలుగువారినలరించి క్రమంగా వెర్రి తలలు వేయ జొచ్చినది. అందువలన దీనియెడ రసప్రలుబ్ధులుగు వారి యాదరాభిమానములు క్రమముగా తగ్గిపోసాగినవి. కవులును ఈ మార్గము నంతటితో విడిచి పెట్ట వలసిన వారైరి' అని ప్రముఖ సాహితీవేత్త ఎర్రోజు మాధవాచార్యులు సుమారు ఐదున్నర దశాబ్దాల క్రితం ఆవేదన వ్యక్తం చేశారు. అయితే 1980వ దశకం నుంచి అవధాన ప్రక్రియ పరిమళింప సాగింది.

సర్వశ్రీ మేడసాని మోహన్, మాడుగుల నాగఫణిశర్మ, గరికపాటి నరసింహారావు, ఆశావాది ప్రకాశరావు, ధారా రామనాథశాస్త్రి, నరాల రామారెడ్డి, కె.రాజన్న కవి, ఎస్వీ భుజంగరాయశర్మ, గుమ్మన్నగారి లక్ష్మీనరసింహ శర్మ, గండ్లూరి దత్తాత్రేయశర్మ, కడిమెళ్ల వరప్రసాద్, వద్దిపర్తి పద్మాకర్, పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, రాళ్లబండి కవితా ప్రసాద్, దోర్బల ప్రభాకరశర్మ, కోట వేంకట లక్ష్మీనరసింహారావు, గౌరీభట్ల రామకృష్ణశర్మ, ప్యారక శేషాచార్యులు, సూరం శ్రీనివాసులు, తిగుళ్ల శ్రీహరిశర్మ, అవధానం రంగనాథ వాచస్పతి, మరడాన శ్రీనివాసరావు, దిట్టకవి శ్రీనివాసాచార్య, అవధానం సుధాకరశర్మ, చేబోలు శేషగిరిరావు, చక్రాల లక్ష్మీకాంత రాజారావు, గురువేపల్లి నరసింహం, కోట రాజశేఖర్, సురభి శంకరశర్మ, జీఎం రామశర్మ, మాచిరాజు శివరామరాజు, అష్టకాల రామ నృసింహ శర్మ, అబ్బిరెడ్డి పేరయ్య నాయుడు, ఎం.కె. ప్రభావతి, ధూళిపాళ మహదేవమణి తదితరులు నూతన సొగబులద్దారు. పలువురు అవధానులు రాష్ట్రేతర ప్రాంతాల్లో, దేశ విదేశాలలో లెక్కకు మిక్కిలిగా అవధాన ప్రదర్శనలతో తెలుగు కవితా ప్రతిభను వ్యాపింప చేస్తున్నారు. రస హృదయులను రంజిపచేస్తున్నారు. 'వయసు మీరిన వారు, పూర్ణారోగ్యవంతులు కానివారు అవధానాలు చేయలేరు' అనే అపప్రథను పక్కకునెట్టి అవధాన జైత్రయాత్రను కొనసాగిస్తున్నారు. అవధాన ప్రదర్శనలు ఇచ్చిన 150 మందిపై డాక్టర్ రాపాక ఏకాంబరాచార్యులు రెండు తెలుగు దిన పత్రికలలో ధారావాహిక వ్యాసాలు వెలువరించారు.

తిరుపతి వేంకట కవులు, ఇతర సుప్రసిద్ధ అవధానుల అవధాన ప్రదర్శనల స్ఫూర్తితో 20వ శతాబ్ది ఉత్తరార్థంలో తమిళ, కన్నడ కవులు కొందరు తమ భాషలలో ఈ ప్రక్రియను చేపట్టారు.

**అవధాన పీఠమేది?**

అవధాన విద్యా ప్రదర్శనకు ఆదరణ తగ్గలేదనేందుకు వివిధ సందర్భాలలో నిర్వహిస్తున్న కార్యక్రమాలే నిదర్శనం. ప్రభుత్వ పరంగా ప్రోత్సాహం ఉంటే ఈ ప్రక్రియ మరింత రాణిస్తుందనడంలో సందేహం లేదు. అందుకు అవధానాలకు విశేషం సంఖ్యలో హాజరవుతున్న సాహిత్యాభిమానులే నిదర్శనం. పీవీ నరసింహారావు ప్రధాని హోదాలో అవధాన ప్రదర్శనకు ముఖ్య అతిథిగా హాజరై అవధానం పట్ల అభినివేశాన్ని, పద్యానురక్తిని, సాహిత్యాభిమానాన్ని చాటుకున్నారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు తన మానస పుత్రికగా చెప్పుకున్న శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో అవధాన విద్యకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలనుకున్నా, ఆ ఆలోచన సాకారం కాలేదు. తెలుగు భాష, సాహిత్యంలోని వివిధ ప్రక్రియలలో విశేష సేవలు అందించిన వారికి ఏటా ప్రదానం చేసే పురస్కారాల జాబితాలలో మాత్రం అవధానాన్ని చేర్చింది. ఆంధ్ర విశ్వకళాపరిషత్ ఉపకులపతిగా ఆచార్య జీఎస్ఎన్ రాజు అవధాన విద్య కోసం ప్రత్యేక విభాగాన్ని ప్రారంభించారు. ఆయన పదవీ కాలం ముగిసిన తరువాత దాని ఉనికి ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తమవుతోంది. నెల్లూరులోని 'ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయనం కేంద్రం' అయినా ఆ దిశగా చొరవ చూపాలని సాహిత్యాభిమానులు అభిలషిస్తున్నారు. ★




9

జూలియస్ సీజర్ కాలినడకన సెర్విలియా ఇంటికి చేరుకున్నాడు. గృహ ప్రాంగణంలో నిలబడి ఉన్న భటుడు సీజర్‌ను గుర్తుపట్టి, లోనికి తీసుకొని వెళ్లాడు. కొంతసేపటికి సెర్విలియా వచ్చి, కౌగలించుకుని, "నేను పిలిపించవలసినదేనా? నీ అంతట నీవు వస్తావని ఎంతగానో ఎదురుచూసాను" అన్నది, నిష్టురంగా.

"ప్రేయసీ! అనుక్షణమూ నా తలపులలో నీవు కదలాడుతూనే ఉన్నావు. జూపిటర్ దేవుని ప్రధాన పురోహితుని కుమారునిగా నీ దగ్గరకొచ్చిన నేను ఈనాడు ధనహీనునిగా రాలేకపోయాను"

"ధనం కన్నా ప్రేమ గొప్పది. రోమ్ నగరంలోని ధనవంతురాళ్లలో నేను ఒకతెను. అయినా ఏం ప్రయోజనం? తండ్రి నా చిన్నతనంలోనే మరణించినాడు. నా తల్లి పునర్వివాహం చేసుకున్నది. ఇద్దరు పిల్లలను కన్న తరువాత ఆమె మరణించింది. నా సవతి తండ్రి పరలోకగతుడైనాడు. నా వయసుకు రెట్టింపు వయసున్న వృద్ధునితో పెళ్లికావడం ఎంత దుఃఖకరమో కదా! నా చీకటి బతుకులో ఉన్న ఒకే ఒక్క వెలుగువు నీవే".

''సెర్విలియా'' అంటూ సీజర్ ఆమెను గాఢాలింగనం చేసుకున్నాడు.

రెండు జాములు గడిచిపోయాయి."అర్ధరాత్రి కావస్తున్నది. చీకటిలో నడచి వెళ్లడం ప్రమాదం. నగర నియమాలు అంగీకరించవు. భటులు చంపివేయగలరు" అన్నాడు సీజర్.

**ఎండిపై రామమూర్తి స్మారక నవలల పోటీలో ప్రథమ బహుమతి పొందిన రచన**

"ఉదయమే వెళ్లవచ్చును" సెర్విలియా అన్నది.

"ఇప్పుడు వెళ్లవలసిన అవసరముంది!"

"నీ భార్య మీద మనసు మళ్లిందా ఏమిటి?" వ్యంగ్యంగా అన్నది సెర్విలియా.

జూలియస్ సీజర్ సంభాషణను మళ్లిస్తూ, "ఇంతకూ నా పుత్రుని నాకు చూపించనే లేదు" అన్నాడు.

"పుత్రుడు అతని తండ్రితో కలసి కార్యార్థమై వెళ్లినాడు."

"తండ్రి ఎవరు? నేనే కదా తండ్రిని!"

"కుమారుని పేరు మార్కస్ బ్రూటస్" అన్న సెర్విలియా లేచి నిలబడి "నీవు నడచి వెళ్లడం ప్రమాదం. నీ కోసమో రథం సిద్ధం చేయమని సారథికి చెప్తాను" అని బయటకు వెళ్లింది.

సీజర్ ముభావంగా కూర్చున్నాడు. పిల్లవాడు తన కొడుకు కాదా?

* * *

రథం దిగిన జూలియస్ సీజర్‌కు ఇంటి ముంగటనే ఎదురైన కొర్నీలియా "మీ కోసమే ఎదురుచూస్తున్నాను. సాయం సమయములో బయటకు వెళ్లిన మీరు ఇంతవరకూ రాలేదు. భటులు బంధించారేమోనని భయపడ్డాను" అన్నది.

"రాచకార్యార్థమై వెళ్లవలసి వచ్చింది"

"రాచకార్యమా? రోమ్‌కు రాజులు లేరు కదా!"

"నేడు లేకున్ననేమి? రేపు రాజరికం రావచ్చును. నీవు చక్రవర్తి భార్యవు కావచ్చును."

"నాకు అటువంటి కోరికలు లేవు. మీ ప్రేమ తరంగిణిలో నన్ను ఓలలాడిస్తే చాలు."

ఇదేమిటి? సెర్విలియా తన ప్రేమనే కోరుకుంటున్నది. తన భార్య కూడా తన ప్రేమనే కోరుకుంటున్నది. ఇంకెందరు స్త్రీలు తనను వలచి, వరించగలరో! గ్రీసు రాజ్యంలో వలె రోమ్‌లో బహుభార్యత్వం చట్ట సమ్మతం కాదు. అయిననేమి? బహు ప్రేయసీ వ్రతాన్ని ఎవరు కాదనగలరు?

తనలోని మగసిరికి తానే నీరాజనాలు సమర్పిస్తూ జూలియస్ సీజర్ భార్యను దగ్గరగా తీసుకొని, శయన మందిరం వైపు నడిచాడు.

* * *

తనకు శాస్త్రాన్ని బోధిస్తున్న యవన జ్యోతిషశాస్త్ర గురువు చెప్పిన విషయాలు దేరియస్‌తో చర్చించాడు మిహిరుడు.

"అలెక్సాండరు అనే గ్రీకు రాజు భరతభూమిపై దండెత్తినాడనీ, పాంచాల రాజ్య ప్రభువు పురుషోత్తముడతనిని నిలువరించినాడనీ ఇదివరకే నాకు తెలుసు. అయితే విచ్చిన్నమైన గ్రీకు సామ్రాజ్యం లోని రెండు భాగాలను రోమ్ పాలకులు జయించి, సర్వనాశనం చేసినారని ఇవాళే మా గురువులు తెలియజెప్పారు. రోమ్ పాలకుల క్రూర ప్రవర్తన, ఆ చరిత్ర నా మనసును వికలం చేశాయి.

"గ్రీకు రాజులు సాధు వర్తనులని నీ నమ్మకమా? గ్రీసులో అనేక చిన్న రాజ్యాలుండేవి. వారు ఒకరితో ఒకరు యుద్ధం చేసినప్పుడు ఒకరి నగరాలను ఒకరు నాశనం చేసికొనేవారు. అలెక్సాండరు పారశీకంపై దండెత్తి విజయం సాధించినప్పుడు దేశ రాజధాని పెర్సిపోలిస్‌లోని ముఖ్య ప్రాంతాలన్నిటినీ తగలపెట్టించినాడు. నాడు వారు చేసినదే నేడు రోమ్ పాలకులూ చేస్తే ఆశ్చర్యమేముంది?" అన్నాడు దేరియస్.

మిహిరుడు "భరతభూమిలో ధర్మరక్షణకో, అధర్మ నిర్మూలనకో మాత్రమే యుద్ధాలు జరుగుతాయి. రాజ్యాలను ఆక్రమించుకోవడం, జనావాసాలను ధ్వంసం చేయడం జరగనే జరగదు. ఓడిన రాజు విజేతకు కప్పం చెల్లించడం వరకే. . యుద్ధంలో రాజు మరణించిన పక్షంలో అతని కుమారునికే సింహాసనంపై కూర్చుండే అర్హత ఉంటుంది" అని అన్నాడు.

వారి సంభాషణ వింటున్న ఖనా "నాకు అందుకే భరతభూమిపై, భరత ఖండ సంస్కృతీ సంప్రదాయ



ములపై అపారమైన గౌరవం" అని అన్నది.

'నీవు భారతీయుల బిడ్డవే కదా!' అని మనసులో డేరియస్ అనుకున్నాడు. అతని ఆలోచనలను గమనించిన మిహిరుడు, ''భారతీయ జ్యోతిషంకూడా నీకు నచ్చినట్లుగానే ఉన్నది కదా" అని ఖనాతో చెప్పి డేరియస్‌తో "మీ పుత్రిక ఎంతో తెలివైనది. నేను ఆరు సంవత్సరాలలో నేర్చుకున్న విద్యను ఆమె ఆరు నెలలలోనే చక్కగా నేర్చుకున్నది" అన్నాడు.

అందులో నా గొప్పతనమేమీ లేదు. నాకు విద్యనేర్పిన గురువుల ఘనత" ఖనా అన్నది.

"నేను మా తండ్రిగారి వద్ద విద్యాభ్యాసం చేశాను. ఆయన కన్నా ఘనుడినా ఏమిటి? ఏనాటికీ ఆయనను మించిపోలేను".

"ఏ తండ్రి అయినా తన కుమారుడు తనను మించి పోవాలని కోరుకోవడం సహజం. మీరు ఎన్ని శిఖరాగ్రాలను అధిరోహించగలరో ఇవాళే ఎలా చెప్పగలం?"

"నిన్ను మాటలలో మాత్రం మించలేను!" అన్న మిహిరుని మాటలకు ఖనా మందహాసం చేసినది. డేరియస్ ఆనందంగా నవ్వాడు.

* * *

ఆనాటి సాయం సంధ్యావందనమైన తర్వాత మిహిరుడు ఖనాకు సప్తర్షి చలనం గురించి పాఠం ప్రారంభించాడు.

"భూమి తన చుట్టూ తాను తిరగడం వలన సూర్యోదయం, అస్తమయం మనకు కన్పిస్తున్నవని నీకు తెలుసు. భూమి సూర్యుని చుట్టూ తిరగడం వలన సూర్యుడు ఆకాశంలోని పన్నెండు రాశులలో కదలుతున్నట్లు కన్పించడం గురించి నేర్చుకున్నావు. చంద్రుని పెరుగుదల, తరుగుదల మొదలైనవీ నీకు బోధించాను. నేడు సప్తర్షి మండలం కదలిక గురించి తెలిసికొనెదవు గాక."

"నక్షత్రాలు కదలిక లేనివని అన్నారు కదా!"

"నిజమే, సప్తర్షి మండలం కదలిక అయినా భ్రమ మాత్రమే. సూర్యుడు కదలినట్లుగా కనిపించే వృత్తమూ, ఖగోళ మధ్య రేఖ వృత్తమూ ఖండించుకునే బిందువులకు విషువులని పేరు. ఈ విషువులు ఒకే చోట ఉండవు. వృత్తం వెంబడి పయనిస్తూ ఉంటాయి" అని చెప్పి మిహిరుడు ఆమెకు భూర్జ పత్రంపై పటం గీసి చూపించాడు.

ఖనా పాఠం వింటూ, పటం చూస్తూ విషయాన్ని గ్రహిస్తున్నది.

"విషు బిందువులు వృత్తమంతటినీ తిరిగి మొదటనే ఉన్న స్థానం చేరుకొనడానికి 26,000 సంవత్సరాల సమయం పడుతుంది. విషు బిందువుల స్థానాన్ని బట్టి ఆకాశంలో ఉత్తర, దక్షిణాలను నిర్ణయిస్తారు. సప్తర్షి మండలంలో ముందుగా ఉదయించేవి పులహ, క్రతువులు. వాటికి నేరుగా దక్షిణంగా ఏ నక్షత్రముంటుందో, సప్తర్షులు ఆ నక్షత్రంలో ఉన్నట్లుగా చెప్తారు."

మిహిరుడు పటాల సహాయంతో వివరిస్తున్నాడు. ఖనా ఆకళింపు చేసుకుంటున్నది.

అర్ధరాత్రి అయింది. పరిచారిక వచ్చి విన్నవించే వరకూ ఇరువురికీ కాలగమనం తెలియలేదు.

* * *

మరునాడు మధ్యాహ్న భోజన సమయంలో మిహిరుడు డేరియస్‌తో “నిన్న మీ పుత్రికకు సప్తర్షి మండల చలనం గురించి వివరించాను. ఒక పర్యాయం ఆకాశంలోని నక్షత్రాలను సూర్యోదయానికి ముందుగా ఆమె గమనిస్తే మరింత చక్కగా ఆకళింపు చేసుకొనగలదు. రేపు సూర్యుని తులా సంక్రమణం. మీరు అంగీకరిస్తే నగరం వెలుపల ఆరుబయట ప్రదేశానికి ఆమెను తీసికొని వెళ్లగలను” అన్నాడు.

“అలాగే. రేపు ఉదయమే రథం సిద్ధపరచమని సారథికి చెప్తాను”

ఎక్కువ దూరం లేదే. రథమెందుకు? భోగ భాగ్యాల మధ్య పెరిగిన ఖనా సుకుమారి కనుక నడువలేదా? పర పురుషుని వెంట పంపేందుకు భయమా? ఏ కారణమైన ఏమి? మిహిరుడు ఆలోచనా ప్రవాహాన్ని ఆపివేశాడు.

**ఇద్దరూ కలిసి నడుస్తున్నారు. ఖనా కాలికి రాయి తగిలి ఆమె ‘అమ్మా’ అంటూ పడిపోయింది. మిహిరుడామెను పడిపోకుండా పట్టుకున్నాడు. ఆమె అతని చుట్టూ చేయి వేసి పడిపోకుండా నిలబడింది. మిహిరునిలో అతనికే అవగతం కాని మధుర భావం ప్రవాహంలా శరీరంలో సాగిపోయింది. అతడామెను పట్టుకున్న చేతిని ఆమె నుండి తీయలేదు.**



* * *

ఆనాటి రాత్రి రెండు జాములు గడిచిన కొంతసేపటికే నిద్ర లేచి కాలకృత్యాలు తీర్చుకుని, గృహం వెలుపలకు వచ్చిన మిహిరునకు రథం పక్కనే నిలబడి ఉన్న ఖనా కనిపించింది. అతడు ఆనందంగా “నీకు తొందరగానే మెలకువ వచ్చినట్లున్నది” అన్నాడు.

“నిద్రపోతే కదా!” అంటూనే ఖనా సారథిని పిలిచింది. దగ్గరలోనే ఉన్న సారథి వచ్చి, రథాన్ని ఆయత్తపరచిన తర్వాత ఖనా, మిహిరులిద్దరూ ఆరోహించారు. కొంతసేపటికే నగరం వెలుపలకు వచ్చిన రథాన్ని ఆరుబయట ప్రదేశంలో సారథి నిలిపాడు.

ముందు మిహిరుడు, వెనుక ఖనా మైదానం మధ్యకు చేరుకున్నారు. అతడామెకు ఆకాశంలోని ఉత్తర దిశను చూపుతూ “అదిగో సప్తర్షి మండలం. పులహ, క్రతువులు ఉన్న బిందువు దగ్గర నుండి దక్షిణంగా ఒక రేఖను మనసులో ఊహించుకునే ప్రయత్నం చేయాలి. ఆ రేఖ నేరుగా వెళ్లి రాశి చక్రంలో ఏ నక్షత్రాన్ని చేరుకుంటుందో సప్తర్షులు ఆ నక్షత్రంలో ఉన్నట్లు లెక్క. ధర్మరాజు పట్టాభిషిక్తుడైనప్పుడు సప్తర్షి మండలం ఉన్నది. ఆపైన విష బిందువు వెనుకకు జరిగి పరీక్షిత్తు సింహాసన మధిష్టించే నాటికి ఆశ్లేషలో ఉన్నది. 2700 సంవత్సరాలు పూర్తయ్యేనాటికి ఆంధ్ర చక్రవర్తి శాతవాహన మేఘస్వాతి రాజ్యమేలేవాడు. ఆనాటి నుంచి కొత్త యుగ మేర్పడింది. నేను మేఘస్వాతి సమయం నుంచే కాలగణన చేస్తున్నాను.”

సప్తర్షి మండలాన్ని, రాశి చక్రాన్ని గమనించిన ఖనాకు విషయం సంపూర్ణంగా అర్థమయింది. ఆమె భారతీయ సంప్రదాయ పద్ధతిలో మిహిరుని పాదాలకు నమస్కరించి “మీ వంటి గురువు లభించడం నా అదృష్టం” అన్నది. ఆపైన “మీరు కనుక ఇంత చక్కగా వివరించారు. భవిష్యత్తులో ఇటువంటి గురువులు ఉండరేమో! అప్పుడు సప్తర్షియుగం ఎవరికీ అర్థము కాదేమో! ఈ లెక్కను తప్పుగా భావిస్తారేమో!” అన్నది.

“ఎప్పుడేం జరుగుతుందో ఎవరు చెప్పగలరు? కాల స్వరూపం సామాన్య మానవులమైన మనకు తెలియదు. ఒకప్పుడు వాస్తవం మరుగున పడవచ్చును. మరొకప్పుడు బహిర్గతం కావచ్చును” అంటూనే మళ్లీ మిహిరుడు “తెలవారవచ్చుచున్నది. ఇంటికి పోయి జపమూ, సంధ్యావందనమూ నిర్వర్తించాలి” అన్నాడు.

ఇద్దరూ కలిసి నడుస్తున్నారు. ఖనా కాలికి రాయి తగిలి ఆమె ‘అమ్మా’ అంటూ పడిపోయింది. మిహిరుడామెను పడిపోకుండా పట్టుకున్నాడు. ఆమె అతని చుట్టూ చేయి వేసి పడిపోకుండా నిలబడింది.

మిహిరునిలో అతనికే అవగతం కాని మధుర భావం ప్రవాహంలా శరీరంలో సాగిపోయింది. అతడామెను పట్టుకున్న చేతిని ఆమె నుండి తీయలేదు. అతని చుట్టూ వేసిన చేతిని ఆమె కదల్చలేదు. కాలం కదలలేదు. తీయని అనుభూతుల పరంపర ఆగలేదు.

కొంతసేపటికి బాహ్య ప్రపంచంలోనికి వచ్చిన ఖనా ముఖంపై సిగ్గూ, ఆనందం కలిసి తాండవించడాన్ని తూర్పు దిక్కున కన్పిస్తున్న వెలుగు రేకలు మరింత రమణీయంగా తీర్చిదిద్దాయి. ఆ సౌందర్య లక్ష్మిని చూస్తూ నిలబడిన మిహిరుడు ఒక్కసారి ఉలికిపడి, మనస్సును నిలువరించుకుని, ఆమె మీద నుండి చేతిని తీసివేసి, శీఘ్రంగా నడవసాగాడు. అతనిలో ఆలోచనలు అంతకన్నా వేగంగా కదలసాగాయి.

“ఏమిటి? ఇట్లయినదేమి? ఒక కన్యను స్పృశించవచ్చునా? ఆపద్ధర్మంగా ఆమె పడిపోకుండా ఆపే ప్రయత్నం జరిగినది చెప్పుకొనవలెనా? అయితే పులకరింతలేల? అవసరం తీరినప్పటికీ చేతిని తీయకపోవడం ఏమిటి? శరీరం హద్దు మీరితే ప్రాయశ్చిత్తముండవచ్చును. మనస్సు చంచలమైతే.... భరత ఖండానికి తిరిగి వెళ్లిన తర్వాత జనకులే తగిన శిక్షను విధించెదరు గాక.

* * *

ఆనాటి సాయం సంధ్యాసమయం దాటినాక ఖనా ఎప్పటివలెనే పాఠం నేర్చుకొనడానికి మిహిరుని వద్దకు వచ్చింది. అతడు తనను తాను తమాయించుకుని బోధన ప్రారంభించాడు. కొంత సేపయినాక ఖనా “గాలి వీయడం లేదు. పరిచారికను చామరం తీసుకురమ్మని చెప్పనా!” అన్నది.

“వాన వచ్చుననిపిస్తున్నది” అని మిహిరుడన్నాడు.

“ఆకాశం నిర్మలంగా ఉంది. మబ్బులెక్కడా లేవు. వాన రాదనుకుంటాను”

“అదిగో అక్కడ చీమల బారును చూడు. తమ గుడ్లను సులువుగా మోసికొనిపోతున్నవి. వర్షానికి అది సూచన”.

ఖనా ఆశ్చర్యంగా చూసింది.

“సర్ప సమాగమం, పాము చెట్టెక్కడం, ఆవులు తమ గిట్టలనూ, చెవులనూ ఆడించడం వంటివి వాన రాకడను సూచిస్తాయి. కుక్కలు ఇంటిపైకెక్కి ఆకాశం వైపు చూస్తూ అదే పనిగా మొరగడం కుంభవృష్టికి సంకేతం. “అయితే ఈనాటి రాత్రి వాన తప్పకుండా పడుతుందా?”

“సంకేతమన్నాను కానీ జరిగి తీరుతుందని అనలేదు. జంతువులూ, పక్షులూ తెలితక్కువవనీ, మానవుడే వివేకవంతుడనీ మన జాతికి గర్వం. కానీ అనేక విషయాలను అవి మనకన్నా చక్కగా గ్రహించగలవు. మానవజాతి అనేక యంత్రాలను కనుగొన్నది. నేటికీ కనుగొంటూనే ఉంది. యంత్ర సహాయంతో వాతావరణ సూచనను జంతువులకన్నా సరిగా గ్రహించగలమనుకోవడం మన భ్రమ మాత్రమే.”

“నాకు వాన రాకడ తెలుసుకునే విషయ మిదివరలో చెప్పలేదేమి”?

“విజ్ఞానశాస్త్ర పారంగతులు కావడం ఎవరి వల్లనూ కాదు. సర్వజ్ఞాని, సర్వశక్తిమంతుడు భగవంతుడు మాత్రమే”.

**(సశేషం)**

**(సప్తర్షి చలనం గురించి మరిన్ని వివరాలు తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురించిన గణిత, ఖగోళ శాస్త్రములు అనే గ్రంథం నుండి తెలిసికొనవచ్చును: రచయిత)**



పాపం, కాంగ్రెస్ ప్రముఖుడు రాహుల్ గాంధీ నోటి నుంచి ఊడిపడినవి మూడంటే మూడే ప్రశ్నలు. ఆ మూడు ప్రశ్నల మాటేమోగానీ, ముందు ఈ 11 ప్రశ్నలకు జవాబులు విప్పండి అన్నారు బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబె. కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాల ధోరణికి ఈ బాటే సరైనది. కీలెరిగి వాత పెట్టాలి. నీవు ఇతరుల వైపు ఒక వేలు చూపిస్తే, నీ వైపు మూడు వేళ్లు చూస్తూ ఉంటాయి అంటారు పెద్దలు. ఇది అక్షరాల భారత విపక్షాలకు సరిపోతుంది. వారు తమలపాకుతో అలా విసిరితే, బీజేపీ వారు తలుపుచెక్కతో ఫెడీఫెడీమనిపించాలి. తప్పదు. ఈ ప్రశ్నోపనిషత్ గౌతమ్ అదానీ వివాదం నేపథ్యంలోదే. పార్లమెంటు శీతాకాల సమావేశాలలో వినిపించింది. ప్రధాని నరేంద్ర మోదీ మీద విరుచుకు పడడానికి ఏ చిన్న అవకాశం దొరికినా ముందూ వెనకా చూడకుండా దూకుతోంది కాంగ్రెస్. అసలే శతాధిక వర్షాల పార్టీ. ఈ మధ్య ఒక్కొక్క విమర్శకి ఒక్కొక్క భాగం పుటుక్కున విరిగిపోతోంది. ఇప్పుడూ అదే జరిగింది. ప్రధాని మోదీ రాష్ట్రపతి ప్రసంగానికి జవాబు ఇచ్చే పనికి పరిమితమయ్యారు. అంటే తన ప్రభుత్వం సాధించిన ప్రగతిని ఒక క్రమ పద్ధతిలో సమీక్షించారు. ఆ క్రమంలో కాంగ్రెస్ పార్టీ లీలలని మచ్చుకి కొన్ని పరిచయం చేయక తప్పింది కాదు మరి!

# ఆయన రాహులేనా! ఆయన దెయ్యమా?

నిజంగానే చావు తప్పి కన్ను లొట్టపోయిన పరిస్థితిని కాంగ్రెస్ ఎదుర్కొన్నది. ఆ పార్టీకే సొంతమనిపించే శతాధిక అక్రమాలు, ఆర్థిక అవకతవకలు, రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చివేయడం, అంటే ఆర్టికల్ 356ను చేతికి ఎముక లేకుండా వడ్డించిన సంగతి, నెహ్రూ పేరును బీజేపీ చెరిపి వేయడం వగైరా వగైరా అన్నీ పార్లమెంట్ ఉభయ సభలలో ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ మంత్రులు, నాయకులు ఎలుగెత్తి చాటారు. వీటికి సమాధానం ఇవ్వడంలో మోదీ, ఇతర నాయకులు చూపించిన ప్రతిభ ముచ్చటగొలిపింది జాతిని. ఆజాదీ కా అమృతోత్సవ్ సందర్భంగా సమీప గతంలోని తప్పుల కుప్పలని బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్ వేదికగా జాతి జనుల ఎదుట ఉంచింది. ఆ అవకాశం ఇచ్చినదే కాంగ్రెస్, దాని తైనాతీలే.

ఇంతకీ రాహుల్ సంధించిన ప్రశ్నలేమిటి?

అదానీ గ్రూప్ దొంగ కంపెనీలను స్థాపించిందని హిండెన్‌బర్గ్ రిసెర్చ్ సంస్థ చెప్పింది. మారిషస్‌లో ఉన్న అలాంటి దొంగ కంపెనీలు ఎవరివి? ఆ కంపెనీలే కోట్లాది రూపాయలు భారతదేశానికి తెచ్చాయి. ఇదంతా అదానీ దేశం కోసం ఉచితంగా చేసిపెట్టారా?

8 బిలియన్ డాలర్లు ఉన్న అదానీ వ్యాపారం 2014 తరువాత 140 బిలియన్ డాలర్లకి ఎలా చేరింది. అంటే మోదీ అధికారం చేపట్టాకనే కదా ఈ పెరుగుదల అని కవి హృదయం.

ప్రపంచ కుబేరుల జాబితాలో అదానీకి రెండో



స్థానం దక్కినవిధంబెట్టిది? 2014 సంవత్సరంలో అదానీ సదరు జాబితాలో 609 స్థానంలో ఉన్నారు. ఇప్పుడు నంబర్ 2 స్థానానికి ఎలా ఎగబాకారు? అంత పెద్ద నిచ్చెన ఎవరు సరఫరా చేశారు? ఇందులోని మర్మమేమి? గడచిన రెండు దశాబ్దాలలో బీజేపీకి అదానీ ఇచ్చిన సొమ్మెంత? ఎన్నికల బాండ్ల పేరు పెట్టి అదానీ నుంచి బీజేపీ తీసుకున్నది ఎంత?

పార్లమెంట్‌లో కాంగ్రెస్ సభ్యులు, మిగిలిన చిన్నాచితకా విపక్షాలు ఒకటే నినాదం అందుకున్నాయి. "అదానీ...అదానీ." అసలు రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేస్తుంటే తమిళనాడు నుంచి కశ్మీరం దాకా ఒక్క పేరే వినిపించిందట పాపం. అదే 'అదానీ' అట. అదానీ మైకం వల్లనేనేమో, హైదరాబాద్ వస్తే పీవీ నరసింహారావు విగ్రహం ఆయనకు కనపడలేదు. తమిళనాడులో తన కోసం వేచి ఉన్న వృద్ధ స్వాతంత్ర్య సమరయోధులకి శాలువా కప్పి దండవేయాలనీ అనిపించలేదు. యాత్ర అంతా ఇలాగే ఉందని మాత్రం అనుకోవద్దు. కొన్ని ప్రత్యేక సమయాలలో అదానీ పేరు ఆయన దరికి చేరలేదు. అనగా వినిపించలేదు. చర్చి ఫాదర్లతో, టుక్డే టుక్డే గ్యాంగ్

స్వరభాస్కర్‌తో, పాకిస్తాన్ జిందాబాద్ అన్న యువతితో భుజం భుజం కలిపి, చేయి చేయి జోడించి నడిచినప్పుడు మాత్రం అదానీ పేరు చెవులకు సోకడానికి భయపడింది. బీజేపీని ద్వేషించే ప్రతి చానల్, పత్రిక ఈ ప్రశ్నలని అప్పటికే పాఠకుల చేత దాదాపు భట్టీయం వేయించినంత పనిచేశాయి. అంటే అన్నిసార్లు రాసి, అరిగిపోయిన గ్రామఫోన్ రికార్డు కూడా సిగ్గుపడేటట్టు చేశాయి. తిరగేసి మరగేసి ఎలా వీలుంటే అలా రాశాయి. చివరికి తీరికగా పార్లమెంటులో హావభావాలతో అవే ప్రశ్నలు సంధించడం రాహుల్ వంతయింది. ఆ ప్రశ్నలు తన స్వకపోల కల్పితమే అన్నట్టు ఆ క్షణంలో రాహుల్ ప్రదర్శించిన భంగిమలను చూసిన జాతి జనులు ఎంతో పరవశించారు కూడా. భారత్ జోడో యాత్ర ఫేం రాహుల్ ప్రశ్నలు ఎంత కాకరేపాయో తెలియదు కానీ, బీజేపీ ఎంపీ నిశికాంత్ వేసిన ప్రశ్నలు మాత్రం వృద్ధ పక్షానికి చుక్కలు చూపించాయి. ప్రజాస్వామ్య ప్రేమికులం కాబట్టి ఆ ప్రశ్నలేమిటో కూడా ఆలకిద్దాం.

పరీక్షా కేంద్రంలో ఇచ్చే ప్రశ్నపత్రంలో ప్రశ్నలకీ, పార్లమెంటులో వేసే ప్రశ్నలకీ తేడా లేకపోతే ఎలా అనుకున్నారు కాబోలు దూబే! అందుకే మొదటి ప్రశ్నతోనే రాహుల్ గాంధీకి చెమటలు పట్టేశాయి. ఏమీ చదవకుండా దర్జాగా పరీక్ష హాలులో దూరిన విద్యార్థిలా తయారైంది రాహుల్ పరిస్థితి.

రాహుల్ గాంధీ జీవించే ఉన్నారా? లేక రాహుల్ దెయ్యం వచ్చి పార్లమెంటులో కూర్చుందా? ఇదీ దూబే ఘాటు ప్రశ్న.

ఈ ప్రశ్న పార్య ప్రణాళికలో లేనిదేమీ కాదు. అన్ పార్లమెంటరీ అసలే కాదు. ఘనత వహించిన భారత్ జోడో యాత్ర సందర్భంలోనే ఒకచోట కాంగ్రెస్ నేత నిక్కచ్చిగా చెప్పారు, 'పాత రాహుల్ చనిపోయాడు' అని. ఈ చావుపుట్టుకల తతంగం ఇంత సులభం కాదుకదా అన్న ధర్మ సందేహమే దూబే చేత ఇలాంటి ప్రశ్న వేసేందుకు సాహసింపచేసి ఉండాలి. లేదా ఆవేశపరిచి ఉండాలి. దూబే మాటెలా ఉన్నా రాహుల్ గుక్క తిప్పుకోలేని పరిస్థితికి వచ్చేశారు. ఇక మిగిలిన ప్రశ్నలు....

భోపాల్ మిక్ గ్యాస్ లీకేజీ విషాద ఘటనలో నిందితుడు ఆండర్సన్ అనే వాడిని దేశం దాటించింది ఎవరు? అప్పుడు మధ్యప్రదేశ్‌లోనూ, కేంద్రంలోనూ ఉన్నది కాంగ్రెస్ సర్కార్లే. వీరిలో ఆ పాపం ఎవరిది? ఎవరి 'వాటా' ఎంత?

మీ పార్టీ నుంచి ప్రధాని పదవి చేపట్టిన పీవీ నరసింహారావు నాగపూర్‌లో ఒకసారి బాలాసాహెబ్ దేవరస్ (ఆర్ఎస్ఎస్ మూడో సర సంఘచాలక్) నివాసానికి వెళ్లారా, లేదా?

మాజీ రాష్ట్రపతి, మీ పార్టీ ప్రముఖుడు ప్రణబ్ ముఖర్జీ ఆర్ఎస్ఎస్ కేంద్ర కార్యాలయానికి వచ్చారా, లేదా?

అసలు ఎప్పుడు పార్లమెంటు సమావేశాలు మొదలైనా ప్రపంచంలో ఏదో మూల ఒక పత్రిక, లేదా చానల్, ఈ భూగోళం మీద చీమ తలకాయంత పరిమాణం లోని వెబ్‌సైట్ కావచ్చు..ఏమైతేనేం! ఇలాంటి మోదీ వ్యతిరేక టుమ్రీ ఒకటి వినిపిస్తుంది. దానిని పట్టుకుంటాయి విపక్షాలు. ఇప్పుడూ అంతే. ఇంతకీ విపక్షాలన్నీ బుద్ధిగా, కోరస్‌గా అదానీ అంశాన్నే ఎందుకు పట్టుకున్నాయి? ఇది భారత విపక్ష శిబిరంలో రివాజు కాబట్టి. ఈ ఐకమత్యం మోదీ వ్యతిరేకతతో వచ్చింది కాదు. మరేమిటి?

2010లో ఆస్ట్రేలియా గనుల కాంట్రాక్టు గౌతమ్ అదానీకి ఇప్పించింది మీ ప్రభుత్వమా కాదా?

ఖత్రోకి దేశం దాటడంలో నాటి మీ నేత మాధవరావ్ సింధియా, ఇతర నాయకులు తోడ్పడలేదా?

సంజయ్ భండారీకీ, రాబర్ట్ వాద్రాకీ మధ్య లంకేమిటి?

నేషనల్ హెరాల్డ్ కేసులో కోట్లు చేతులు మారాయన్న కారణంగా గాంధీ కుటుంబం మీద ఈడీ, సీబీఐ ఒక కన్నేసి ఉంచిన మాట నిజమా కాదా?

ఒస్, బీజేపీ ఎంపీ పస ఇంతేనా అనుకోవద్దు. నిజమే, కాంగ్రెస్ పాపాల చిట్టా విప్పితే ఒళ్లు గగుర్పొడుస్తుంది. కాంగ్రెస్ కంపు గురించీ, అక్రమ లావాదేవీల గురించి చర్చ పెడితే ఒక్కొక్క బీజేపీ సభ్యుడికి గంట వంతున సమయం ఇచ్చినా, వాటన్నిటిని సభ దృష్టికి తేవడానికి రెండేళ్లు పడుతుంది. అందుకే మరికొన్ని ప్రశ్నలు సంధించే అవకాశం తమ నాయకుడు, ప్రధాని మోదీకి దూబే మిగిల్చారు.

కాంగ్రెస్ పార్టీని మోదీ తనదైన శైలిలో రేవు పెట్టి చాలా కాలమైందని జనం అనుకుంటున్న తరుణంలోనే ఆ శుభ ఘడియ వచ్చింది. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు చెప్పే ప్రసంగాన్ని మోదీ సరిగానే ఉపయోగించుకున్నారు. విపక్షాలన్నీ ఏకమై అదానీ అంశం మీద చర్చ జరగాలనీ, కమిటీ వేయాలనీ బృందగానం లంఘించుకున్నాయి. అసలు ఎప్పుడు పార్లమెంటు సమావేశాలు మొదలైనా ప్రపంచంలో ఏదో మూల ఒక పత్రిక, లేదా చానల్, ఈ భూగోళం మీద చీమ తలకాయంత పరిమాణం లోని వెబ్‌సైట్ కావచ్చు..ఏమైతేనేం! ఇలాంటి మోదీ వ్యతిరేక టుమ్రీ ఒకటి వినిపిస్తుంది. దానిని పట్టుకుంటాయి విపక్షాలు. ఇప్పుడూ అంతే. ఇంతకీ విపక్షాలన్నీ బుద్ధిగా, కోరస్‌గా అదానీ అంశాన్నే ఎందుకు పట్టుకున్నాయి? ఇది భారత విపక్ష శిబిరంలో రివాజు కాబట్టి. ఈ ఐకమత్యం మోదీ వ్యతిరేకతతో వచ్చింది కాదు. మరేమిటి? ఈడీ వచ్చి పలకరిస్తుందేమోనన్న భయమే వారిని అలా అతుక్కు పోయేటట్టు చేసిందని గుట్టు విప్పారు మోదీ.

మోదీ పెట్ బాటిళ్ల రీసైక్లింగ్ పదార్థంతో తయారు చేసిన జాకెట్ ధరించి వస్తే, ప్రతిపక్ష నాయకుడు, స్వయం ప్రకటిత పేదవాడు మల్లికార్జున ఖర్గే మాత్రం అరలక్ష విలువ చేసే స్కార్ఫ్ వేసుకోవడం సభ దృష్టి నుంచి తప్పించుకోలేకపోయాయి. మోదీ మరోసారి విజృంభించారు. కకావికలైపోయారు విపక్ష నేతలు. మీరు ఏడుపదుల పాలనలో కాంగ్రెస్ ముక్కీ మూలిగీ 70 విమానాశ్రయాలు కడితే మేము తొమ్మిదేళ్లలో 70 కట్టించామని గట్టి చురకే వేశారు ప్రధాని. టూజీ, ఏషియన్ గేమ్స్ నిధుల నొక్కుడు, అగస్టా అవకతవకల గురించి కూడా మోదీ లీలగా మాత్రమే గుర్తు చేశారు. అసలు 2004 నుంచి, 2014 మధ్య ఒక దశాబ్దాన్నే భారతదేశం కోల్పోయింది అని తీవ్రమైన వ్యాఖ్య చేశారు మోదీ. ఆ కాలంలో దేశాభివృద్ధికి అంది వచ్చిన ప్రతి అవకాశాన్ని కూడా కాంగ్రెస్ దిగ్విజయంగా చేజార్చిందని ఎద్దేవా చేశారాయన. టీవీ చానెళ్లలో తనను ఎంత మంది దుమ్మెత్తి పోసినా, వార్తాపత్రికలలో తన గురించి ఎన్ని అబద్ధాలు చెప్పినా 140 కోట్ల భారతీయులు తన మీద ఉంచిన నమ్మకం రక్షణకవచంలా పనిచేస్తుందని మోదీ కుండ బద్దలుకొట్టినట్టు చెప్పారు. మీది కుటుంబ పాలన అయితే, మాది వసుధైక కుటుంబ పాలన అన్నారన్నమాట. కమలం బురదలో వికసిస్తుంది. మీరు ఎంత బురద చల్లితే అంతగా అది వికసిస్తుందని కూడా అన్నారు.

నెహ్రూ పేరును స్వతంత్ర భారత చరిత్ర నుంచి చెరిపివేయాలని కాంగ్రెస్ పదే పదే ఆరోపించడం గురించి మోదీ ఏమన్నారు? ఆయన మీద అంత గౌరవమే ఉంటే, మీరంతా పేర్ల చివర గాంధీ అంటూ ఎందుకు తగిలించుకున్నారు? నెహ్రూ అని కూడా పెట్టుకోవచ్చుకదా అని ప్రశ్నించారు. ఈ మధ్య కేరళ కమ్యూనిస్టులు, పశ్చిమ బెంగాల్ టీఎంసీ వాళ్లు, తెలంగాణ బీఆర్ఎస్ వాళ్లు మోదీ రాష్ట్ర ప్రభుత్వాలను గవర్నర్ల ద్వారా ప్రజాప్రభుత్వాలను కూల్చేయడానికి చూస్తున్నారని గంగవెర్రులెత్తినట్టు ప్రకటనలు ఇస్తున్నారు. స్వతంత్ర భారత చరిత్రలో ఆర్టికల్ 356ను 90 సార్లు ప్రయోగించిన పార్టీ ఏదైనా ఉన్నదీ అంటే అది కాంగ్రెస్ పార్టీయేనని మోదీ జాతి

దృష్టికి తీసుకుపోయారు. ఇందిరాగాంధీ చేతికి ఎముక లేని చందంగా 50 పర్యాయాలు ఆర్టికల్ 356ని రాష్ట్రాల మీద వడ్డించారు. ఇదంతా విన్న తరువాత పాపం కాంగ్రెస్ సభ్యులకే మతి పోయినట్టు ఉంది. అదానీ నినాదం గోల మిగిలిన పార్టీలకి వదిలేసి ఖిన్నులై కూర్చున్నారు. ముసలితనంలో చాదస్తం వస్తుంది. చాదస్తం వస్తే శాస్త్రీయత మీద నమ్మకం పోతుంది. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో స్పష్టంగా కనిపిస్తున్నది అదే కదా! కరోనాకు భారత్ తయారు చేసిన టీకాను ప్రతిపక్షాలు అపహాస్యం చేసిన సంగతిని కూడా ప్రధాని విడిచి పెట్టలేదు. కానీ 150 దేశాల ప్రజలకు మన టీకాయే ప్రాణం పోసిన సంగతినైనా గుర్తించండి అంటూ ప్రధాని కర్రు కాల్చి వాత పెట్టారు.

అదానీ గురించి సభలో ఎత్తితే చాలు, మోదీ కకావికలై పారిపోతారనీ, ఏవో పాత ఫొటోలు చూపిస్తే బెదిరిపోతారనీ లెక్కేసిన రాహుల్, కాంగ్రెస్, విపక్షాల కథ ఘోరాతిఘోరంగా అడ్డం తిరిగింది. దీనితో కాంగ్రెస్ బుర్రతక్కువ తనమే కాదు, గురవింద గింజ పంథా కూడా యావత్ భారతజాతి దృష్టికి వచ్చింది. రాహుల్ గాంధీ అంతకు ముందురోజు లోక్‌సభలో వీరావేశంతో ప్రసంగించిన సందర్భంలో నరేంద్ర మోదీ, అదానీ కలసి విమానంలో ప్రయాణిస్తున్న పెద్ద పెద్ద ఫొటోలు సభలో ప్రవేశ పెట్టేందుకు ఉబలాటపడ్డారు. కానీ సదా శాంతంగా ఉండే స్పీకర్ ఓం బిర్లా ఆ పని చేయబోయిన రాహుల్‌కి భారీ వాత పెట్టారు. మోదీతో అదానీ ఉన్న చాటంత ఫొటోలు మీ దగ్గర ఉంటే ఉండొచ్చు. వాటిని సభలో ప్రదర్శించాలని మీరు సరదా పడితే పడొచ్చు. కానీ మీ పార్టీ రాజస్థాన్ ముఖ్యమంత్రితో అదానీ కలసి ఉన్న పోస్టర్లనే బీజేపీ సభ్యులు సభకు తెచ్చే ప్రమాదం ఉంది, చూసుకోండి మరి! అని స్పీకర్ గారు హెచ్చరించే సరికి బిక్కచచ్చిపోయారు రాహుల్. అన్నట్టు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షపదవిలో కూర్చోబెట్టాలని కాంగ్రెస్ విశ్వప్రయత్నం చేసినా, నా కదేమీ వద్దనీ, సీఎం పదవే ముద్దనీ చెప్పిన ఘనుడు ఇతడే కదా! నాకు ముఖ్య మంత్రి పదవే ముచ్చట అంటూ అధినాయకులను పూచిక పుల్లలతో సమం చేశారు కూడా.


అయితే రాహుల్ వరకు ఇది ప్రసూతి, లేదా శ్మశాన వైరాగ్యం వంటిది మాత్రమే. షాహీన్‌బాగ్, పంజాబ్ దొంగరైతులు, భారతదేశంలో మైనారిటీలపై దాడులు, రఫేల్ కొనుగోళ్ల అవకతవకలు వంటి ఎన్ని దొంగ ఆరోపణలను పట్టుకుని రాహుల్ మోదీ మీద దండయాత్ర చేయడానికి ప్రయత్నించలేదు? ఒక్కొక్కటి కోర్టులలో వీగిపోయినా పదును లేని బాణాలు ప్రయోగించడం రాహుల్ మానలేదు కదా! అయినా భారతదేశంలో ఏ అక్రమం జరిగినా అది కాంగ్రెస్ పాలనలోనే జరగాలి గాని, ఇలా ఇతర పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు కూడా జరిగిపోతే మేం దాన్ని గుర్తించనే గుర్తించం, మా పార్టీ చరిత్రకే సొంతమైన ఆ ఘనతను వేరొకరికి ఇవ్వలేం అన్నట్టే ఉంటుంది రాహుల్ ధోరణి. రైతుల సమస్య వంటి వాటితో గతంలో పార్లమెంట్ సమావేశాలను అడ్డం కొట్టినట్టే, ఈ పార్లమెంటు సమావేశాలను అదానీ మీద విమర్శతో సాగనివ్వరాదన్న ఏక వాక్య తీర్మానంతో వచ్చిన కాంగ్రెస్, విపక్ష ముఠాకి బీజేపీ సభ్యులు మూర్ఛ వచ్చినంత పనిచేశారు. ‘మీరంతా రాహుల్‌ని పప్పును చేశామని అనుకున్నారు. మీ పప్పులేమీ ఉడకలేదు. రాహుల్ గాంధీయే మిమ్మల్నందరినీ టోకున పప్పులను చేశారు’ అంటూ ఆ చర్చకి ఏ మాత్రం పొసగని, సంబంధం లేని పోలిక తెచ్చి, పప్పు బిరుదు వాళ్ల నాయకుడికే సరైనదని నిరూపించారు, విపక్ష నేత అధీర్ రంజన్ చౌధురి. ఇంత వాడివేడిగా సాగుతున్న చర్చకు కాస్త వెసులుబాటు కోసం అన్నట్టు తోలుబొమ్మలాట వినోదాన్ని తలపిస్తూ శ్రీమాన్ కేతిగాడి పాత్రను ఇలా అధీర్ రంజన్ కాసేపే అయినా బాగా రక్తి కట్టించారు. కేతిగాడి సరిజోడి బంగారక్క పాత్రలో మహువా మైత్రాను చూడవచ్చు గానీ, ఆ ఇద్దరి పార్టీలు వేర్వేరు. కాబట్టి కెమిస్ట్రీ పండదు. మైత్రా సభలో నికార్సయిన బూతులు ప్రయోగించారు.

కాంగ్రెస్ వాళ్లకి ఉన్న మహా సౌలభ్యం ఏమిటంటే, మరుపు. రాష్ట్రపతిని రాష్ట్రపత్ని అంటూ వాగి, ఆనక చెంపలు వాయించుకున్న అధీర్ రంజన్ మరొక ‘పప్పు’ ఆరోపణ కూడా చేశారు. ఇంతకాలం భారత రాష్ట్రపతి పదవిలోకి వచ్చిన వారి కుల గోత్రాలు చీమకి కూడా తెలిసేవి కాదట. మతం అంతకంటే తెలియలేదట. ఇప్పుడు మాత్రం రాష్ట్రపతి ఏ వర్గమో అందరికీ తెలిసిందట. జాతీయ అంతర్జాతీయ వేదికల మీద బీజేపీ నేతలు ఆమె ఎవరో, ఏ వర్గమో పదే పదే చెబుతున్నారట. అలా చెప్పేటట్టు చేసింది ఎవరు? భారత్‌లో అణచివేతకు గురి అవుతున్నారంటూ కమ్యూనిస్టులు, కాంగ్రెస్ వాళ్లు ఇచ్చే జాబితాలో గిరిజనులు కూడా ఉన్నారు. కానీ అది అబద్ధం, మేం ఒక గిరిజన మహిళను ప్రథమ పౌరురాలిగా గౌరవించుకుంటున్నామని బీజేపీ వివరణ ఇస్తే అందులో తప్పు కనిపిస్తున్నది, ఈ పప్పు అనుచరుడికి. భారతదేశంలో మైనారిటీలకు మనుగడ లేదని అంతర్జాతీయ వేదికల మీద వదరిన నోళ్లు ఇప్పుడు ఈ మాట అనడం అత్యంత వికారంగా అనిపించడం లేదా? అసలు రాహుల్, ఆయన కన్నతల్లి, కాంగ్రెస్ మూలస్తంభం సోనియా ప్రస్తుతం బెయిల్ మీద ఉన్న సంగతి గుర్తుందా లేదా అని నిలదీశారు, కేంద్ర మాజీ మంత్రి రవిశంకర్ ప్రసాద్.

మోదీ ప్రతి వ్యంగ్యాస్త్రం సభను నవ్వులతో ముంచెత్తింది. ప్రతి విమర్శ రాహుల్‌ను నీరు గార్చేసింది. కాంగ్రెస్ తల కొట్టేసింది. ఆ క్షణంలో ఆయన్ని చూస్తే నిశాంత్ దూబె ప్రశ్న వాస్తవరూపం దాల్చిందేమోనని అనుమానం వస్తుంది కూడా. కళ్లు తేలేసినంత పనైంది రాహుల్‌కి. దేశంలో కాంగ్రెస్ అంతిమ క్షణాలు లెక్కిస్తున్న వాస్తవాన్ని హార్వార్డ్ విశ్వవిద్యాలయం చేసిన అధ్యయనం ఖరారు చేసిన సంగతిని కూడా సభ దృష్టికి తెచ్చారు మోదీ.

ఆరోపణ నిజం కావచ్చు. అసత్యం కావచ్చు. కానీ అదానీ వ్యవహారం కొన్ని వేల కోట్లతో ముడిపడి ఉంది. పార్లమెంటులో, మీడియాలో ఇంత రచ్చ జరిగింది. అయినా మోదీ మీద అవినీతి ఆరోపణ చేయడానికి ఎవరూ సాహసం చేయలేకపోతున్నారు. ఇది చాలు మోదీ ఏమిటో తెలియడానికి! ఇదొక్కటి చాలు ఆయన ఎంతటి నిష్కళంక చరితుడో అర్థం చేసుకోవడానికి!

– జాగృతి డెస్క్



'ఎంత మాత్రమున ఎవ్వరు దలచిన అంతమాత్రమే నీవు...' అని పదకవితా పితామహుడు అన్నమాచార్యులు తిరుమలేశుని కీర్తించినట్లు నారసింహుడూ భక్తులు కోరినట్లు అనుగ్రహిస్తాడు. 'భగవంతుడి కోసం భక్తులు కారు...భక్తుల కోసం భగవంతుడు' అని పురాణగాథలను బట్టి, ఆధ్యాత్మికోన్నతి సాధకులను బట్టి అవగతమవుతుంది. పరమ భాగవతోత్తముడు బాలప్రహ్లాదుని బ్రోచేందుకు ఉగ్ర నరసింహుడిగా అవతరించిన నారసింహుడు, యాదరుషి విన్నపం మేరకు లక్ష్మీసమేతంగా ప్రసన్నవదనుడిగా కొలువు దీరాడు. అదే నాటి (పంచనారసింహ క్షేత్రం) యాదగిరిగుట్ట నేటి యాదాద్రి. ఏటా ఫాల్గుణ శుద్ధ విదియ నుంచి ద్వాదశి వారకు పదకొండు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. గుహాలయంగా సుపరిచితమైన ఆలయం అత్యంత ఆధునిక హంగులు సమకూర్చుకుంది. ఆలయపునర్నిర్మాణం నేపథ్యంలో నరసింహుడు బాలాలయం పేరుతో భక్తులకు దర్శనమిచ్చారు. దివ్యభవ్య మందిరంలోని ఆయన దర్శనం అందుబాటులోకి వచ్చిన తరువాత జరగనున్న కల్యాణోత్సవాల కోసం భక్తికోటి నిరీక్షిస్తోంది.

'ఇందుగలడందులేడని సందేహం వలదు...' అని పోతనామాత్యుడు ప్రహ్లాదుడితో పలికించినట్లు భగవంతుడు సర్వాంతర్యామి. జగత్తంతా నిబిడీకృతమైనట్లు చెప్పడమే భగవతత్త్వం. నరసింహావతారం పరమార్థమూ అదే.

**'నాహం వసామి వైకుంఠే నయోగి హృదయేరవౌ!**
**మద్భక్తా యత్ర గాయంతి తత్ర తిష్ఠామి నారదా!!'**

(నేను వైకుంఠంలో లేను. యోగులు హృదయాలలోనో, సూర్యునిలోనో కనిపించను. నా భక్తులు తలచే చోట, నన్ను కీర్తించేచోట ఉంటాను' అని శ్రీ మహావిష్ణువు దేవర్షి నారదమునితో అన్నట్లు పద్మ పురాణం పేర్కొంటోంది. అలాంటి విశిష్ట నృసింహ క్షేత్రాలలో యాదాద్రి (యాదగిరిగుట్ట), పంచనార సింహ క్షేత్రం ఒకటి. నృసింహుని చరిత్ర ఎన్నో పురాణాలలోనూ వర్ణితమైంది. ఈ క్షేత్రం గురించి స్కాంద, బ్రహ్మాండ పురాణాలలో ఉంది. హిరణ్య కశిపుని వధానంతరం శ్రీమహావిష్ణువు తన ఉగ్రరూపాన్ని (సింహ) ఉపసంహరించి ప్రహ్లాదునికి ప్రేమాస్పదమూర్తిగా, ప్రసన్నకారుడిగా దర్శనాన్ని అనుగ్రహించాడంటారు. అలా తేజరిల్లిన దివ్య క్షేత్రమే యాదాద్రి. శ్రీ మహావిష్ణువు నరసింహుని రూపంలో అర్చామూర్తిగా ఆవిర్భవించారు.

మహాజ్ఞాని విభాండకుడి మనవడు, రుష్యశృంగుడి కుమారుడు యాదరుషి కోరిక మేరకు ఉగ్ర, జ్వాల, గండభేరుండ, యోగానంద, ఉగ్ర నరసింహ, శ్రీ లక్ష్మీనృసింహస్వామి రూపాలతో శ్రీమన్నారాయణుడు ఈ క్షేత్రంలో సాక్షాత్కరించారు. కొండగుహ లోని రెండు శిలలపై యోగానంద నరసింహుడు, శ్రీలక్ష్మీనరసింహుడు విగ్రహరూపంలో కనిపిస్తారు. ఆ రెండు శిలా ఫలకాల మధ్య సన్నటి రేఖలా సర్పాకృతిలో జ్వాలా నరసింహస్వామి దర్శనమిస్తాడు. ఆంజనేయుడు క్షేత్రపాలకుడిగా తూర్పు వైపు, కొండబిలంలో గండభేరుండస్వామి కొలువై ఉంటారు. ఉగ్రనరసింహుడు అభౌతిక రూపంలో కొండ చుట్టూ తేజోవలయంలా ఆవరించి ఉంటాడని భక్తుల విశ్వాసం. అందుకే కొండను ఉగ్రనరసింహ స్వామి రూపంగా కొలుస్తారు.

యాదరుషి తపస్సు కారణంగా సింహాకృతిలోని ఆ గుట్ట 'యాదవగిరి'గా కాలక్రమంలో యాదగిరి గుట్ట, యాదాద్రిగా వ్యవహారంలోకి వచ్చింది పురాణాల విశేషాలను బట్టి యాదరుషి ప్రహ్లాదుడి మాదిరిగానే పరమ విష్ణుభక్తుడు. నృసింహ సాక్షాత్కారం కోసం అడవిదారి పట్టి తపస్సు ద్వారా తన ఆశయ సాధన కోసం ప్రశాంతమైన ఈ పర్వత ప్రాంతాన్ని ఎంచుకున్నాడు. ఆయనను అక్కడి కొండజాతి వారు పట్టి క్షుద్రదేవతలకు బలి ఇచ్చేందుకు ప్రయత్నిస్తుండగా, స్వామి తరపున సుదర్శన చక్రం వచ్చి కాపాడిందని, ఈ క్షేత్రం చుట్టూ సుదర్శనుడు రక్షణ వలయాన్ని నిర్మించాడని స్థల పురాణం. క్షేత్రానికి సంబంధించి మరో కథనం ప్రకారం, ఈ గుట్టకు రెండు మైళ్ల దూరంలో స్వామి వారు వెలిశారు. దానినే పాత నృసింహాలయంగా వ్యవహరిస్తారు.

పన్నెండవ శతాబ్దంలో పశ్చిమ చాళుక్య త్రిభువన మల్లుడు స్వామివారిని సేవించుకున్నారని భువనగిరి కోటలోని శాసనం ద్వారా తెలుస్తోంది. అనంతర కాలంలో కాకతీయ గణపతి దేవుడు, శ్రీకృష్ణ దేవరాయలు దర్శనం చేసుకున్నట్లు చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. చాలాకాలం పాటు మరుగున పడిపోయిన క్షేత్ర మహాత్మ్యాన్ని స్థానిక గ్రామాధికారి గుర్తించారు. ఆయనకు స్వామి కలలో కనిపించి అవతార రహస్యాన్ని చెప్పారని, భాగ్యనగర వాస్తవ్యుడు రాజా మోతీలాల్ ఆలయాన్ని నిర్మించి, పూజాదికాలను పునరుద్ధరించారని చరిత్ర చెబుతోంది. ఎంతో మహిమాన్వితమైన క్షేత్రంగా మన్ననలు అందుకుంటున్న దీనిని రాష్ట్ర ప్రభుత్వం సుందరంగా తీర్చిదిద్దింది. పురాతన గుహాలయంగా భక్తులకు సురపరిచితమైన ఈ ఆలయం ఆధునిక హంగులు

# యాదాద్రీశా! జయ



## స్వామి




సమకూర్చుకుని అద్భుత క్షేత్రంగా అలరిస్తోంది. ఆలయ పునర్నిర్మాణం, అభివృద్ధిలో భాగంగా 'యాదమహర్షి తపో వృక్షస్థలి' రూపుదిద్దుకుంది. గిరి ప్రదక్షిణకు అవకాశం గల అరుదైనది యాదాద్రి. ఈ కొండనే 'నరసన్న' పంచమ క్షేత్రాలలో రూపంగా భావించి 'యాదగిరి నరసింహా! ఆదుకో...నీ కొండక చేదుకో' అంటూ గిరి ప్రదక్షిణ చేస్తారు.

అనారోగ్యం, గ్రహపీడ బాధితులు, సంసార బాధ దుఃఖితులు మండలదీక్ష ప్రదక్షిణలు చేపడుతుంటారు. సాక్షాత్తూ బ్రహ్మ కడిగిన పాదాల నుంచి ఉద్భవించి నట్లు చెప్పే విష్ణు పుష్కరిణిలో స్నానమాడి స్వామిని సేవించడం ద్వారా స్వస్థత పొందుతారని చెబుతారు. శంకరభగవత్పా దులు రచించిన 'లక్ష్మీనృసింహ కరావలంబ' స్తోత్రం దీనినే స్ఫురింప చేస్తుంది. మానవాళిపై అపార సానుభూతితో వారిని ఆదుకోవాలని నృసింహుని వేడుకున్నారు. 'ఈ సంసార సాగరంలో నౌక వంటి నీవు నాకు చేయూతనిచ్చి కాపాడు. భయంకరమైన దట్టమైన సంసారమనే అడవిలో కోరికలు అనే సింహాలు సంచరిస్తాయి. భయంకరమైన మొసళ్లు, తిమింగాలు గల ఈ సంసారమనే సాగరాన్ని ఈదలేకపోతున్నాను. ఈ సంసారం విషవృక్షం లాంటిది. ఎంతో ఎత్తుకు ఎగబాకిన చెట్టుపై నుంచి దిగలేకున్నాను. కోరల సాచిన ఆశలు క్రూర మృగాల మాదిరిగా వెంటాడ తాయి. అగాధమైన బావి అనే సంసారం లోతు ఎంతో తెలియదు. అందులో దిగితే కష్టాలనే పాములు కాటేస్తాయి. సంసారమనే అడవిలో సమస్యలు కష్టాలు అనే దావాగ్ని (మంటలలో) చిక్కుకున్నాను. అజ్ఞానం అంధుడిని చేస్తోంది. ఇంద్రియాలు చోరుల్లా దోచుకుంటున్నాయి. మోహం అనే అగాధంలో పడిపోతున్న నన్ను రక్షించు' అంటూ భక్తుల తరపున వేడుకున్నారు. 'నిన్ను ఐశ్వర్యం కోసం అనుసరించడంలేదు. ధనకనకవస్తు వాహనాలను కోరడంలేదు. భూపశుసంపద, బలం కోసం పట్టుబట్టడం లేదు. సత్వరం మోక్షం ప్రసాదించు చాలు నీలవర్ణా!' అని శేషప్ప తదితర కవులు చేసిన విన్నపాలను ఆలకించి అలంబనగా నిలుస్తాడని భక్తజన విశ్వాసం.

దానవ్రతాలకు, యజ్ఞయాగాదులకు, జపతపాదు లకు, నియమనిష్ఠలకు వశం కానీ శ్రీహరి భక్తికి బందీ అవుతాడని, ముఖ్యంగా ఆర్తులను ఆదు కోవడంలో ముందుంటాడని ఆధ్యాత్మికవాదులు చెబుతారు. ఆ కోవలోని ఇతర నృసింహ క్షేత్రాలతో పోలిస్తే, స్వస్థత పొందేందుకు వచ్చే అనారోగ్యం, గ్రహపీడితుల సంఖ్య ఇక్కడ ఎక్కువగా ఉంటుంది.

## తు.. జయతు...



యాదాద్రీశుని కరుణతో స్వస్థత పొందినవారిలో 'యాదగిరి క్షేత్ర సంకీర్తన' కవి ఈగ బుచ్చిదాసును ప్రముఖంగా చెబుతారు. ఓరుగల్లుకు చెందిన ఆయన తీవ్ర అనారోగ్యంతో ఎన్ని ఔషధాలు వాడినా గుణం కనిపించలేదట. దాంతో భగవంతుడిపై భారం వేసి కొండపై గల గుండం వద్ద గుడిసె వేసుకుని ఉంటూ, భాగవత ఘట్టాలను పారాయణం చేస్తూ భక్తులకు వివరించి చెప్పేవారట. ఒకసారి స్వామి వారు ఆయనకు కలలో కనిపించి తనపై కీర్తనలు చెప్పాలని ఆదేశించారట. అప్పటి నుంచి సంకీర్తనలతో పాటు స్వామి వారిపై శతకం రాశారు.

**బ్రహ్మోత్సవ వైభవం**

నృసింహుని బ్రహ్మోత్సవాలలో భాగంగా, మొదటిరోజు స్వస్తి వాచకసహిత శుద్ధి. మంత్ర జలంతో ఆలయ వీధులను శుద్ధి చేసి ఉత్సవాలు నిర్విఘ్నంగా సాగేలా విష్వక్సేనుడికి బాధ్యతలు అప్పగిస్తారు. సాయంత్రం పుట్ట బంగారం (మట్టి)లో నవధాన్యాలు నాటి ఉత్సవాలకు అంకురార్పణ చేస్తారు. రెండవ నాడు ధ్వజారోహణ, ఆ రాత్రి భేరీపూజ చేపడతారు. మూడో రోజు వేద పారాయ ణంతో పాటు ఉదయం మత్స్యావతార అలంకారంలో సేవించి రాత్రికి శేష వాహనంపై ఊరేగిస్తారు. నాలుగవ రోజు ఉదయం శ్రీకృష్ణ అలంకారం, రాత్రి హంసవాహన సేవ, ఐదవ నాటి ఉదయం పటవత్ర సాయికి 'జోల', సాయంత్రం కల్పవృక్ష వాహనసేవ ఉంటుంది. ఆరవనాడు స్వామి వారు గోవర్ధన గిరిధారిగా దర్శనమిచ్చి రాత్రి సింహ వాహనంపై ఊరేగుతారు. ఏడవనాడు జగన్మోహినిగా సాక్షాత్క రించి, అశ్వవాహనరూఢుడై ఎదుర్కోలు సంబరానికి బయలుదేరతారు. ఎనిమిదవ నాటి ఉదయం హనుమద్వాహనంపై రామావతారంలో దర్శనమిచ్చి, గజేంద్రవాహనం అంబారిపై ఊరేగుతూ కల్యాణ మండపానికి చేరుకుంటాడు. అర్ధరాత్రి లక్ష్మీ నరసింహుల తిరుకల్యాణం, తొమ్మిదవ రోజు ఉదయం గరుడవాహనసేవ, సాయంత్రం దివ్యవిమాన రథోత్సవం నిర్వహిస్తారు. నిరంతరం స్వామితో ఉంటూ ఆయనకుసేవలు అందించే శ్రీచక్ర ఆళ్వార్ స్వామి వారికి తీర్థ స్నానం(చక్రస్నానం) పదవ రోజున ఉంటుంది. చక్రస్నానం, ఆ మరునాడు అష్టోత్తర శతాఘటాభిషేకంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తి అవుతాయి.

గుహాలయం నుంచి బాలాలయానికి మారి ఆరేళ్ల పాటు దర్శనమిచ్చిన యాదగిరీశుడు, దివ్యభవ్య మందిరం దర్శనం అందుబాటులోకి వచ్చిన తరువాత జరుగనున్న కల్యాణోత్సవాల కోసం భక్తికోటి నిరీక్షిస్తోంది.

**మంగళం నారసింహాయ మంగళం గుణసింధవే**
**మంగళాం నివాసాయ యాదాద్రీశాయ మంగళమ్!!**

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్






# ముగ్గురూ ముగ్గురే..

పత్రికలపై నిషేధం, పండుగలపై నిషేధం, సమావేశాలపై నిషేధం.. పెళ్లి ఊరేగింపుకైనా, చావు ఊరేగింపుకైనా అనుమతి తప్పనిసరి. నిజాం పాలనలో మెజారిటీ హిందూ సమాజం తమ ఆచార వ్యవహారాలు, పూజలు కూడా మానుకున్నారు. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో నిర్వీర్యమవుతున్న సమాజంలో జవసత్వాలు నింపారు ఆ ముగ్గురు. సమాజాన్ని సమరోన్ముఖుల్ని చేశారు. నిజాం బానిస సంకెళ్ల నుండి తెలంగాణకు విముక్తి కలిగించిన వారిలో ఆ ముగ్గురి పాత్ర ఎంతో కీలకం. వారే– రాజా బహద్దూర్ వేంకటరామారెడ్డి, మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి.

ఈ ముగ్గురూ ప్రజాభ్యుదయానికి అవలంబించిన పంథాలు, అనుసరించిన మార్గాలు వేరైనా లక్ష్యం మాత్రం ఒకటే. అదే నిజాం విముక్తి. మాడపాటి హనుమంతరావు ప్రజల్లో రాజకీయ చైతన్య కలిగించి తెలుగన్నలను జాగృతం చేశారు. రాజా బహద్దూర్ ప్రభుత్వ కొత్వాల్‌గా మత కల్లోలాల్ని అరికట్టారు. హిందూ–మహమ్మదీయుల మధ్య సమైక్యత నెలకొల్పారు. విద్యాలయాలు నిర్మించి, వసతి గృహాలు నెలకొల్పి పేద విద్యార్థులకు ఉచిత విద్యనందించి విద్యాదాతగా రాణించారు. ఇక సురవరం ప్రతాపరెడ్డి పాత్రికేయుడిగా, సాహితీవేత్తగా మూగబోయిన తెలంగాణ సమాజానికి గొంతుకగా నిలిచారు. మహాత్మాగాంధీ సత్యాగ్రహోద్యమం, అహింసా సిద్ధాంతం, ఖద్దరు వస్త్రధారణ, మద్యపాన నిషేధం నాడు అబాల గోపాలాన్ని ఆకర్షించాయి. గాంధీజీ ఉద్యమాలకు సురవరం కూడా ఆకర్షితులయ్యారు. ఖద్దరు వస్త్రధారణ, నిరాడంబర జీవన విధానం, సత్యనిష్ఠ, స్వాతంత్ర్యేచ్ఛ ఆయన అణువణువులో జీర్ణించుకు పోయాయి. అంతేకాదు, ఈ ముగ్గురికి ఆంధ్ర సారస్వత పరిషత్తుతో గాఢమైన సంబంధముంది. పరిషత్తు స్థాపకులలో ఈ ముగ్గురూ కీలకం. సురవరం ప్రతాపరెడ్డి పరిషత్తు స్థాపకులేగాక రెండు సార్లు అధ్యక్షులుగా కూడా పనిచేశారు.



కాశింశెట్టి సత్యనారాయణ
విశ్రాంత ఆచార్యుడు

ఈ ముగ్గురు మూర్తులు తెలుగుతల్లి నోచుకున్న నోముల పంట. తెలుగు ప్రజల భాగ్యదాతలు. కారణ జన్ములు. వారు తెలంగాణకు చేసిన సేవ అగణితం, అనన్య సామాన్యం, అనితర సాధ్యం. ప్రతిఫలాపేక్ష రహితంగా, అవిశ్రాంతంగా ప్రజల సర్వతోముఖ వికాసానికి పాటుపడిన కర్మయోగులు.

**అంతా ఉర్దూలోనే**

నాటి హైదరాబాద్ రాష్ట్ర పరిస్థితులు ఆర్థికంగా, సాంఘికంగా, రాజకీయంగా, వైజ్ఞానికంగా పొరుగు రాష్ట్రాల స్థితిగతులతో పోల్చితే 'హస్తిమ శకాంతం' భేదముండేది. 1930–40 సంవత్సరాల మధ్య హైదరాబాద్ పౌరుల అక్షరాస్యత ఐదు శాతం కూడా లేదు. జిల్లా అంతటికి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఒకే ఉన్నత పాఠశాల ఉండేది. అది కూడా ఉర్దూ మీడియంలోనే. బల్తా ఖైదా (శిశు), అవ్వల్ (మొదటి తరగతి), ధువ్వం (రెండవ తరగతి), సువ్వల (మూడవ తరగతి) అని తరగతుల్ని పిలిచేవారు. ఆనాటి పాఠ్యపుస్తకాల అట్టల మీద నిజాం రాజు చిత్రం ఉండేది. నిజాం రాజు చల్లగా ఉండాలని ప్రతి రోజూ ఉదయం ప్రార్థన చేయించేవాళ్లు. ఫోఖానియా (ఉన్నత పాఠశాల)లో చారుం (నాల్గవ తరగతి), పంజుం (5వ తరగతి), చెస్సుం (6వ తరగతి), అఫ్ తుం (7వ తరగతి).. తరగతులు నిర్వహించేవారు. ప్రభుత్వ ఉద్యోగాలలో 95 శాతం ముస్లింలే ఉండేవాళ్లు. తురకం తప్ప మరొక భాష ద్వారా విద్యాలయాలు నెలకొల్పలేదు. రాజకీయ స్వాతంత్ర్యం మాట అటుంచి కనీసం వ్యక్తిగత స్వేచ్ఛ కూడా లేని చీకటి రోజులవి. నిజాం పాలనలో తెలుగుభాషను చాలా చులకనగా చూశారు. కరీంనగర్ జిల్లాలోని సిరిసిల్ల గ్రంథాలయాన్ని ఒక సందర్భంలో పర్యవేక్షించిన అక్కడి తహశీల్దారు 'సర్కారు దస్త్రాల్లో వ్యవహారమంతా ఉర్దూలో ఉండాలి. చచ్చిపోయిన తెలుగును బయటకు గుంజవలసిన పని లేదు' అన్నాడట.

**రెడ్డి హాస్టల్ కార్యదర్శిగా సురవరం**

అమరచింత సంస్థానాధీశుల బంగారం దొంగిలించాడని సురవరం ప్రతాపరెడ్డి బంధువు పెరూరు బసిరెడ్డిపై చౌర్య నేరం మోపారు. దీంతో తన చిన్నాన్న ఆదేశం ప్రకారం ప్రతాపరెడ్డి హైదరాబాద్ వెళ్లి కొత్వాల్ బహద్దూర్ వేంకట రామారెడ్డిని కలిసి నిజానిజాలు తెలియజేసి కేసును కొట్టివేయించాలని కోరారు. అయితే రాజా బహద్దూర్ ప్రతాపరెడ్డికి ఒక షరతు విధించారు. 'సరే, నువ్వు తెచ్చిన కేసును ఒక షరతుపై అంగీకరిస్తాను. కానీ నువ్వు రెడ్డి జనవసతి గృహానికి కార్యదర్శిగా ఉండాలి' అని ప్రతాపరెడ్డిని కోరారు. ఆ విధంగా ప్రతాపరెడ్డి రెడ్డి హాస్టల్ కార్యదర్శి అయ్యారు. అనేక కొత్త నిబంధనలు అమలు జరిపి హాస్టల్‌ను చక్కగా నిర్వహించారు. ఒక గ్రంథాలయాన్ని కూడా ఏర్పాటు చేశారు. పదకొండు వేల పుస్తకాలు అందులో ఉంచారు. ప్రతాపరెడ్డి నిజాం కాలేజీలో చదువుకునే రోజుల్లో 'రెడ్డి హాస్టల్'లోనే ఉండేవారు. హైదరాబాద్ విముక్తి పోరాటంలో పాల్గొన్న వారిలో ఎంతోమంది ఈ హాస్టల్ విద్యార్థులే.

ఒక చిన్న సంఘటన కారణంగా సురవరం తనకు తానుగా హాస్టల్ సెక్రటరీ పదవీ బాధ్యతల నుండి వైదొలగాల్సి వచ్చింది. వీరసావర్కర్ రాసిన 'The war of Independence' గ్రంథం ప్రతాపరెడ్డి.. హాస్టల్ కోసం కొన్న పాత పుస్తకాల కట్టలో దొరికింది. అప్పటికే ఈ పుస్తకాన్ని నిజాం ప్రభుత్వం బహిష్కరించడంతో ఈ వార్త రెసిడెన్సీ పోలీసులకు తెలిసింది. పోలీసులు విచారణలో ప్రతాపరెడ్డే ఆ పుస్తకాన్ని హాస్టల్‌కు తెప్పించారని తెలిసింది. రెడ్డి హాస్టల్ కార్య నిర్వాహక సభ్యులు కూడా ఈ విషయాన్ని బలపరిచారు. అధికారి ట్రెంచ్ దొర ప్రతాపరెడ్డిని హాస్టల్ విధుల నుండి బహిష్కరించాలని ఆదేశించారు. ఈ విషయం తెలిసి ఆయనే రాజీనామా చేశారు. ★

# ప్రమోషనెట్లొచ్చింది?

పట్నంల గదొాక కంపిని. యాద్గిరి గా కంపిని మేనేజర్. గాయిన గుండుకు గుండుంటడు. గాయినకు బొర్రున్నది. బుర్ర మీసాలున్నయి. ఎందుకో ఏమో గని గాయిన కండ్లు ఎప్పుడు ఎర్రగనే ఉంటయి. గాయిన మాట్లాడితే గదిరిచ్చినట్లుంటది. బెదిరిచ్చినట్లుంటది. గాయిన ముంగట్కి బోయేతందుక్కు కంపినీ జీతగాల్లు బుగులు బడుతుంటరు. ఒగాల్ల ఎవనికన్న గాయిన తాన్కి బోయేటి పని బడ్తె గాని పైంటు పచ్చిగైతది.

ఇస్తారి, సత్నారి; లచ్చినారి గా కంపిని జీతగాల్లు. జీతగాల్లే గాకుంట గాల్లు ముగ్గురు దోస్తులు. ఇస్తారి పొట్టిగుంటడు. దొడ్డుగుంటడు. గాన్కి జర్దపాన్ అల్వాటు. సత్నారి, లచ్చినారి పొడుగూతుంటరు. సత్నారి కండ్లద్దాలు బెడుతుంటడు. ఎప్పుడు ఇన్‌షర్ట్ ఏస్తడు. సిగిలేట్లు దాగుతుంటడు. లచ్చినారి బక్క గుంటడు. గీన్కి సుత సిగిలేట్లు తాగేటి అల్వాటున్నది. బట్ట తల్కాయున్నది. సత్నారి, లచ్చినారి ఒకే ఊరోల్లు. కంపినిల షరీకైనంక మాట ముచ్చటల గాల్లకు గా సంగతి ఎర్కైంది. సైమం దొర్కితే సాలు ముగ్గురు ఛాయ్ దాగెంతదుక్కు బోతుంటరు. ఛాయ్ దాగినంక పాన్ డబ్బ కాడ్కి బోతరు. ఇస్తారి పాన్ దింటె కద్మ ఇద్దరు సిగిలేట్లు ముట్టిస్తరు. సిగిలేట్లు దాక్కుంట ముచ్చట బెడుతుంటరు.

"మొన్న మన మేనేజర్ ఇంటికి బోయిన" అని పాన్ దినుకుంట ఇస్తారి అన్నాడు.

"కంపినిల తిట్లు సాలలేదని తిట్టిచ్చుకునెతందుక్కు గాయిన ఇంటికి గుడ్క బోయినవా?" అని సత్నారి అడిగిండు.

"తిట్టిచ్చుకునెతందుకు ఎవలు బోతరు. జెరూర్ పనిబడ్తె మేనేజర్ యింటికి బోయిన" అని ఇస్తారి అన్నాడు.

"గాయినేమన్నడు. నిన్ను తిట్టిండా? గదిరి చ్చిండా? బెదిరిచ్చిండా?"

"గాయినేం తిట్టలేదు. గదిరియ్యలేదు, బెదిరియ్య లేదు"

"చెవుల పూలు బెడ్తున్నవా? నువ్వు ఏం జెప్పినా నమ్మెతందుకు నన్ను అవులగాన్ననుకుంటున్నావా?"

"మేనేజర్ ఇంటికి బోయినగని గాయిన ముంగట్కి బోయే మోక నాకు దొర్కలేదు. దాంతోని నేను గాయినతోని మాట్లాడలేదు. గాని గాయినంటె ఏందో ఎర్కైంది."

"ఏ మెర్క అయ్యిందో జెర జెప్పు."

"నేను బోయినప్పుడు మేనేజర్ ఇంటి తల్పులు దగ్గరేసి ఉన్నయి. నేను చెయ్యితోని గిట్ల నూకంగనే ఒక తల్పు జెర దెర్సుకున్నది. మన మేనేజర్ పెండ్లాం గాయిన ముంగటనే గూసున్నది. కాయితం పెన్ను దీసుకున్నది. లిప్‌స్టిక్; ఐటెక్స్. ఒక పోడర్ డబ్బ. బాడిలోషన్ అని లిస్టు రాస్కుంట గివి గొనెతందుక్కు బజార్కు బోతున్న మీకేమన్న గావాల్నా అని మొగన్ని అడిగింది. అడిగితె మన మేనేజర్ ఏమన్నాడో ఎర్కేనా?"

"ఏమన్నాడు."

"బట్టల సబ్బులు కతమైనయి. మాసిన బట్టలుత్కు దామంటె ఒక్క బట్టల సబ్బు గుడ్క లేకుంటైంది. నాల్గు బట్టల సబ్బులు దీస్కరా. ఇల్లూకుదామంటే చీపిరి కట్ట చిన్నగైంది. ఒక చీపిరి కట్ట గొన్కరా. బాసండ్లు దోమె తందుక్కు ఐదు రూపాయలకు ఒక్క టిచ్చేటి నాల్గు విమ్‌బార్లు ఐదు దీస్కరా అని పెండ్లాంకు జెప్పిండు. గిదంత ఇన్నంక నేను గాయిన ముంగట్కి బోలేదు. గాయినతోని మాట్లాడకుంటనే ఇంటికిబోయిన" అని ఇస్తారి జెప్పిండు.

సత్నారి రొండు దినాలు తాతీల్ దీస్కుండు. తాతీలైనంక కంపినికి బోయిండు. గాని సీట్ల గూసొని పని జేస్కుంటున్నడు. అద్దగంటైనంక గాని తాన్కి చప్రాసి వొచ్చిండు.


"మేనేజర్ సాబ్ మిమ్ములను రమ్మంటున్నడు" అని జెప్పిండు. ఏం కొంప మునిగిందో అని అను కుంటూ సత్నారి మేనేజర్ తాన్కి బోయిండు. మేనేజర్ గాన్ని కిందికి మీదికి ఒక్క తీర్గ జూసిండు. గీడు గిట్లెందుకు జూస్తున్నడు. నా జీతం కోస్తడా లేకుంటె సస్పెండ్ గిన జేస్తడా అని మనసుల అనుకుంట.

"గుడ్ మార్నింగ్ సార్" అని సత్నారి అన్నడు.

"నక్క వినయాలు నా తాన నడ్వయి. నాకు జెప్పి నంకనే తాతీల్ దీస్కోవాలెనని నీ కెర్కలేదా? గీ సంగతి నీకు ఎన్నోసార్లు జెప్పిన. నేను జెప్పినంక గూడ గిట్లెందుకు జేసినవ్. నేనంటే నీ పానానికి ఏమనుకుంటున్నావ్" అన్కుంట మేనేజర్ కోపాని కొచ్చిండు.

"మీరు జెప్పిన సంగతి నాకు యాదికున్నది సార్. నా పెండ్లానికి జెరమొచ్చింది. జెరమే గాకుంట కడ్పు నొప్పి లేసింది. దాంతోని నాకు ఎటూ సుద్రాయించ లేదు. గంతేగాకుంట దినాం గామె జేసేటి పనులు నేనే జెయ్యక తప్పలేదు. యాలపొద్దుగాలే లేసి ఆకిలి ఊకిన. సాన్పుసల్లి ముగ్గేసిన. ఇల్లూకిన, బాసండ్లు తోమిన, బట్టలుత్కిన. వొంట గుడ్క జేసిన."

"నేను అడిగిందేంది, నువ్వు జెప్తున్నాదేంది? ఆడిదానిలెక్క ఇల్లూక్తవా? బాసండ్లు దోమ్తవా? బట్టలుత్కుతవా? వొంట గూడ జేస్తవా? నీకు సిగ్గు లేదా? శరం లేదా? సిగ్గు శరం లేకుంట గీ పనులన్ని జేస్తె జేసినవ్ గీ పనులన్ని అయినంక నాకు ఫోన్ ఎందుకు గొట్టలేదు. కమస్కం నేను ఇంట్ల ఉన్నప్పు డన్న ఫోన్ గొట్టి తాతీల్ గావాలని ఎందుకడ్గలేదు. నీ తోలుగిని దొడ్డుగైందా? నేనంటె నీకు బయం




లేకుంట బోయిందా?"

"నిన్న పొద్దుగాలే మీ ఇంటికి ఫోన్ గొట్టిన సార్. మీరు బాసండ్లు తోమ్తున్నారని పావుగంటైనంక ఫోన్ గొట్టుమని మేడం జెప్పింది. పావుగంటైనంక ఫోన్ జేస్తె మీరు బట్టలుత్కుతున్నరని అటెంకల ఫోన్ జెయ్యుమని మేడం జెప్పింది సార్" అని సత్నారి అన్నాడు.

గాడు గిట్ల అనంగనే మేనేజర్ మొకం గింతైంది.

"గీ సంగతి ఎవ్వరికి జెప్పకు" అని మేనేజర్ అన్నాడు.


మోకేకా ఫాయిదా ఉటానా ఆద్మీ కా ఫర్జ్ హై అనుకోని గీ మోక బోతె మల్లరాదని–

"నా ప్రమోషన్ సార్" అని సత్నారి అడిగిండు.

"ఇస్త. గాని నేను మా ఇంట్ల బాసండ్లు దోమిన సంగతి ఎవ్వరికి జెప్పకు."


"మీ తోడు, నా తోడు, మా అమ్మతోడు ఎవ్వరికి జెప్పను సార్" అని సత్నారి అన్నాడు.

గానికి ప్రమోషనొచ్చింది. ఎట్లొచ్చిందో గాడు ఎవ్వలికి జెప్పలేదు. ★



**తెలిదేవర భానుమూర్తి**
**సీనియర్ జర్నలిస్ట్, 9959150491**

నాలుగేళ్ల తర్వాత ఆ రెండు దేశాల మధ్య సయోధ్యకు బీజం పడింది. అధినేతలు ఇద్దరూ చేతులు కలుపుకున్నారు. గత ఏడాది నవంబరులో జీ 20 సదస్సు వేదికగా ఆవిష్కృతమయిన ఈ దృశ్యం రాజకీయంగా కొత్త సమీకరణాలకు దారి తీస్తుందని ప్రపంచం అంతా భావించింది. అంతలోనే 'బుడగ' పేలింది. ఆ రెండు దేశాల మధ్య అగ్గిరాజుకుంది. ఒక దేశం పేరు చెబితే రెండో దేశం భగ్గుమంటోంది. అమెరికా, చైనాల మధ్య దౌత్యసంబంధాలను దెబ్బతీసిన ఆ 'బెలూన్' కథేంటి? ఒక స్పైథ్రిల్లర్ కంటే ఉత్కంఠను కలిగించే సంఘటనలు, ఉద్వేగాన్ని పెంచే సన్నివేశాలు ఇందులో కోకొల్లలుగా ఉన్నాయి. ఇందులో కొన్ని బాహ్య ప్రపంచానికి ఇప్పుడిప్పుడే అర్థం అవుతున్నాయి. అగ్రరాజ్యాల ఆధిపత్య పోరాటాల వెనక ఇన్ని కుట్రలు, వ్యూహాలు ఉంటాయా అన్న ఆసక్తినీ రేకెత్తిస్తున్నాయి.



# అమెరికా, చైనా

చైనా ప్రయోగించిన నిఘా బెలూన్ ఒకటి తమ గగనతలంలోకి ప్రవేశించటాన్ని అమెరికా రక్షణ శాఖ అధికారులు గుర్తించారు. జనవరి 28న మొదటి సారి కనిపించిన ఈ బెలూన్ తర్వాత కెనడా వైపు మళ్లింది. మళ్లీ 31 నాటికి తిరిగి అమెరికాలోకి అడుగుపెట్టింది. అమెరికాలోని మోంటానా రాష్ట్రంలో అణుక్షిపణి స్థావరాలున్నాయి. రక్షణశాఖకు ఇది అత్యంత కీలక రాష్ట్రం కూడా. దాంతో మొదట వేచిచూసే ధోరణిని అవలంబించిన ప్రభుత్వం.. బెలూన్ కదలికలు అమెరికా రక్షణ కేంద్రాలు, క్షిపణి స్థావరాల మీదుగా సాగుతూండటంతో కఠిన వైఖరి అవలంబించాలని నిర్ణయించుకుంది. 'దాన్ని కూల్చి అవతలపారేయండి' అని ఆదేశించారు అమెరికా అధ్యక్షుడు బైడెన్. మూడు అమెరికా యుద్ధవిమానాలు బెలూన్‌ను చుట్టుముడితే, ఒక మిలటరీ జెట్ నుంచి ప్రయోగించిన క్షిపణి దానిని తుత్తునియలు చేసింది. అట్లాంటిక్ సముద్రంలో దాన్ని కూల్చేసింది. పేలిన భూభాగాలు, అందులోని పరికరాలను సముద్రంలో 11 కి.మీ మేర పడ్డాయి. వాటిని స్వాధీనం చేసుకోవటానికి భారీ క్రేన్ సహా అమెరికా నౌకా దళానికి చెందిన రెండు ఓడలు అక్కడకు వెళ్లాయి. బెలూన్ సముద్రంలో పడిపోతున్న దృశ్యాలు అమెరికా టీవీ ఛానళ్లలో ప్రసారం అయ్యాయి. చిన్నపాటి పేలుడు తర్వాత బెలూన్ సముద్రంలో పడిపోవటాన్ని అందరూ చూశారు.



డాక్టర్ పార్థసారథి చిరువోలు
సీనియర్ జర్నలిస్ట్

బెలూన్ బయట ఉన్నప్పుడు కూలిస్తే, దాని భాగాలు ప్రజల మీద పడే ప్రమాదం ఉందన్న కారణంగా సముద్ర ఉపరితలం మీదకు వచ్చే వరకూ నిరీక్షించి ఆ తర్వాత పేల్చివేశామని పెంటగాన్ అధికారులు ప్రకటించారు. కూల్చివేత సమయంలో దక్షిణ కరోలినా తీరానికి సమీపంలో మూడు విమానాశ్రయాల నుంచి రాకపోకలను మూడు గంటల పాటు నిలిపివేశారు. సముద్రంలో ఎవరూ లేకుండా, కోస్ట్‌గార్డ్‌లను కూడా ఖాళీ చేయించారు. ఆ తర్వాత ఫైటర్ జెట్‌లు రంగంలోకి దిగాయి. ఎఫ్-22 మిలటరీ జెట్ నుంచి ఏఐఎం-9 ఎక్స్ సైడ్ వెండర్ క్షిపణిని ప్రయోగించి ఈ బెలూన్‌ను కూల్చినట్టు అమెరికా రక్షణశాఖ అధికారులు మీడియాకు చెప్పారు. దక్షిణ కరోలినాలోని మిర్టిల్ బీచ్ నుంచి 6 నాటికల్ మైళ్ల దూరంలో 47 అడుగుల లోతున్న సముద్రంలో ఇది పడిందని ప్రకటించారు.

బెలూన్‌ను విజయవంతంగా కూల్చిన వైమానిక దళాన్ని అధ్యక్షుడు బైడెన్ అభినందించారు. అమెరికా చర్యపైన చైనా విదేశీ వ్యవహారాల శాఖ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేసింది. అది గూఢచర్య బెలూన్ కాదని, వాతావరణ పరిశోధనకు ఉద్దేశించిందని చెప్పుకొచ్చింది. 'తమ దేశానికి చెందిన ఎయిర్ షిప్ గతితప్పి ప్రమాదవశాత్తు అమెరికా గగనతలంలోకి ప్రవేశించిందని, దీనిని గుర్తించినప్పటి నుంచి అనేకమార్లు అమెరికాకు సమాచారం ఇచ్చాం' అని ప్రకటించింది. ఈ వ్యవహారం రెండు దేశాల మధ్య దౌత్యసంబంధాలపైన ప్రభావం చూపింది. అమెరికా విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి చైనా పర్యటనను రద్దు చేసుకున్నారు. అంతేకాదు, బెలూన్ శకలాలను చైనాకు అప్పగించేది లేదని అమెరికా తేల్చి చెప్పేస్తే.. తప్పుడు ఆరోపణలతో బెలూన్‌ను పేల్చివేసి ఆర్భాటంగా ప్రచారం చేసుకుంటున్న అమెరికా ఇంతకింతా అనుభవిస్తుందని చైనా హెచ్చరికలు చేసింది. 'మా సార్వభౌమత్వాన్ని సవాలు చేస్తే చూస్తూ ఊరుకుంటామా?' అని బైడెన్ ప్రతిస్పందించారు. చైనా బెలూన్‌ను కూల్చివేసిన అనంతరం, అమెరికా అధికారులు దీనికి సంబంధించిన వివరాలను భారత్ సహా అనేక మిత్ర దేశాలతో పంచుకున్నారు. 'ఇండియా, జపాన్ సహా పలు దేశాలను లక్ష్యంగా చేసుకుని చైనా గూఢచర్యం నడుపుతోంది' అని అమెరికా డిప్యూటీ సెక్రటరీ ఆఫ్ స్టేట్ వెండీషెర్మన్ వాషింగ్టన్‌లోని 40 ఎంబసీల అధికారులతో చెప్పారు. రాబోయే రోజుల్లో గానీ దీని ప్రభావం తెలియదు.

**గూఢచర్యంలో చైనాది అందె వేసిన చెయ్యి**

చైనా నిఘా బెలూన్లను ఎగరవేస్తూ గూఢచర్యం చేపట్టటం కొత్త విషయం కాదు. అది హైనన్ కేంద్రంగా దక్షిణతీరంలో వీటిని ఎగురవేసి భారత్, వియత్నాం, తైవాన్, ఫిలిప్పీన్స్ దేశాల్లో ఆయుధ

సంపత్తి, సైన్యం గుట్టుమట్లను రాబడుతోందంటూ 'వాషింగ్టన్ పోస్టు' అందించిన కథనం సంచలనం కలిగించింది. డిఫెన్సు, ఇంటెలిజెన్సు అధికారుల సమాచారం అందిస్తున్నట్టు స్పష్టంగా పేర్కొంది. హెయినన్‌లో పీఎల్ఏ కంట్రోల్ కేంద్రాలు ఉన్నాయి. జె-8 ఇంటర్ సెప్టర్ విమానాల ప్రధాన బేస్ కూడా ఇక్కడ ఉంది. ఇదంతా చైనా వాయుసేన ఆధీనంలో సాగుతోంది. నిఘా కార్యకలాపాల కోసం ఈ బెలూన్లను పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా (పీఆర్సీ) రూపొందించింది. ఇవి ఇతర దేశాల సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘించేలా సాగుతాయి. ట్రంప్ హయాంలో ఇలాంటి సంఘటనలు మూడు నాలుగు చోటుచేసుకున్నాగానీ, అవి చైనా గూఢచర్యానికి వాడే ఎయిర్ షిప్‌లనే విషయం ఇప్పుడే బయటకొచ్చింది. ఇటీవల కాలంలో హవాయి, ఫ్లోరిడా, టెక్సాస్, గువామ్‌లలో నాలుగు బెలూన్లను గుర్తించినట్టు పేర్కొన్నారు. మరో నిఘా బెలూన్ దక్షిణ అమెరికా దేశాల మీదుగా ప్రయాణిస్తున్నా అమెరికాతో సయోధ్య ఉన్న దేశాలు దానిని అంతగా పట్టించుకోవటం లేదు. వాతావరణ ప్రభావం వల్ల దాని దిశ మారిపోయిందని చైనా ప్రకటించింది.

అత్యాధునిక నిఘా ఉపగ్రహాలు పంపే దృశ్యాల కంటే ఈ స్పై బెలూన్లు అందించే సమాచారం

# అమీతుమీ

మరింత మెరుగ్గా ఉంటుందని ఈ రంగంలో నిపుణులు చెబుతున్నారు. అమెరికా కూడా ఇలాంటి బెలూన్లను ప్రయోగిస్తోంది. నాసా వాటిని తయారు చేస్తోంది కూడా. ఒక బెలూన్ని పరిశోధన కోసం ఉపయోగిస్తున్నారా, లేక గూఢచర్యం కోసమా అనేది తేల్చిచెప్పటం కష్టమైన పని. ఆయా దేశాలు తమ సాంకేతిక నైపుణ్యాలను అనుసరించి శత్రుదేశాల గుట్టుమట్లను లాగేస్తుంటారు. అమెరికా కూల్చిన మానవ రహిత చైనా బెలూన్ 200 అడుగుల పొడవు, వేలాది పౌండ్ల బరువు ఉంది. మోటారు, ప్రొపెల్లర్‌లతో పాటు కొన్ని అసాధారణమైన ఫీచర్లు ఉన్నట్టుగా కూడా చెబుతున్నారు. స్పై బెలూన్లు (సాంకేతికంగా చెప్పాలంటే ఎయిర్ షిప్పులు) వినియోగించటంలో కొన్ని సౌలభ్యాలు ఉన్నాయి. స్పై శాటిలైట్లు చేయలేని కొన్ని పనులను అవి చేయగలుగుతాయి. అవి శాటిలైట్లతో పోలిస్తే చాలా చవక. అవి అత్యంత ఎత్తుకు ఎగరగలుగుతాయి. ఎయిర్-టు-ఎయిర్, సర్ఫేస్-టు-ఎయిర్ మిస్సైల్ రేంజిని దాటి ప్రయాణించగలుగుతాయి. శత్రుదేశాల నౌకా విన్యాసాలను ఎక్కువ సమయం గమనించగల




కూలిపోతున్న బెలూన్

సామర్థ్యం, వెసులుబాటు వాటికి అధికంగా ఉంటాయి. వాటిని త్వరగా గుర్తించటం కష్టం. రాడార్ అబ్జార్బింగ్ మెటీరియల్ (ఆర్ఏఎమ్)తో అవి తయారవుతాయి. 1998లో బెలూన్ ఒకటి కెనడా మీదుగా అట్లాంటిక్ దాటి ఆర్కిటిక్ సముద్రంలో కుప్పకూలింది.

గగనతలంలోనే కాదు, సముద్రం అట్టడుగునా చైనా గూఢచర్యం చేస్తోంది. 2019, 2020లలో ఇండోనేసియాలో మత్స్యకారులు తమ ప్రాదేశిక సముద్రజలాల్లో అట్టడుగున పనిచేస్తున్న రెండు చైనా అండర్ వాటర్ వెహికల్స్ (యూయూవీ) స్వాధీనం చేసుకున్నారు. సముద్రలోతుల్లో రెండు నెలలపాటు ప్రయాణించి అవి సమాచారాన్ని సేకరిస్తాయి. అలాంటి సర్వే షిప్ ఒకటి 2019 ప్రాంతంలో భారత దేశానికి చెందిన అండమాన్ నికోబార్ దీవులలోని ఎక్స్‌క్లూజివ్ ఎకనమిక్ జోన్ (ఈఈజడ్)లోకి ప్రవేశించింది. దాన్ని వెనక్కితీసుకోవాలని మన దేశం కోరింది. ప్రాథమికంగా అలాంటి వాహకాలు ప్రమాద రహితమైన శాస్త్రీయ పరిశోధనలకు ఉపయోగ పడతాయి. కానీ సముద్ర తీరానికి సంబంధించిన వివరాలు, దాని లవణీయత ఉష్ణోగ్రతలు తదితర సమాచారం చైనా సబ్ మెరైన్ ఆపరేషన్లకు, యుద్ధ నైపుణ్యాన్ని పెంచుకోవటానికి ఉపకరిస్తాయి. చైనా సముద్రానికే పరిమితం కాలేదు. 2019లో రియూయూ ద్వీపకల్పంలో ప్రొపెల్లర్ ఉన్న వాహనాన్ని కనుగొన్నారు. దాని పైన గల అక్షరాలను బట్టి దానిని చైనాది అని గుర్తించగలిగారు. రెండు రకాలుగా ఉపయోగపడే యూయూవీలను ఒక్క చైనానే కాదు. 2016లో పిలిప్పైన్స్ సమీపంలో అమెరికా యూయూ వీని చైనా పీఎల్ఏ నేవీ సిబ్బంది కనుగొన్నారు. వాషింగ్టన్ నిరసన వ్యక్తం చేయుటంతో దానిని తిప్పి పంపించారు.

**భారత్‌కు ప్రయోజనం**


మారుతున్న సవాళ్ల నేపథ్యంలో, భారత్ కూడా తన నిఘా సామర్థ్యాలను పెంచుకోవలసి ఉంది. ప్రత్యేక జామర్లను రూపొందించుకోవటంతో పాటు, క్షిపణులు వంటి వాటితో కాకుండా చవకబారు డ్రోన్లను కూల్చివేయగల తక్కువ ఖర్చు గల సాధనాలను రూపొందించుకోవాలి. ఇప్పుడున్న పరిస్థితుల్లో దేశ సరిహద్దుల్లో నిఘా కార్యక్రమాలను మెరుగుపరుచుకోటానికి ఈ ఎయిర్ షిప్పులు ఉపయోగపడతాయి. సముద్ర తీరాల్లోనూ, సరిహద్దుల్లోనూ, స్మగ్లర్లను గుర్తించటంలోనూ, అవసరమైన సమయాల్లో ఫిషింగ్ బోట్లను కనుగొనటంలోనూ ఉపయోగపడతాయి. యుద్ధ సమయాల్లో గానీ, మరొకప్పుడు గానీ సముద్రయానంలో నిఘాకు అవసరమైన వెస్సల్స్ గుర్తించవచ్చు. మన దేశం 'సంధ్యక్' పేరుతో ఆరు సర్వే షిప్‌లను నిర్వహిస్తోంది. ఇప్పుడు తాజాగా మరో నాలుగు దానికి జత కూడుతున్నాయి. ఏది ఏమైనా అమెరికా.. చైనా బెలూన్‌ను కూల్చివేసిన సంఘటన అంతర్జాతీయంగా కొత్త చర్చకు దారితీసింది. ★



పరభాషా పదముల కర్థము తెలిసినంత మాత్రమునఁ బరభాషా పాండిత్యము లభించిన దని భ్రమపడకుఁడు. భాషలోని కళను బ్రాణమును తత్త్వము నాత్మను గనిపెట్టవలయును. అది మీ కసాధ్యము. తుద కిన్ని యీనాములనమ్మి – యమ్మమెడలోని పుస్తెపూసలమ్మి – వంట యింటి పాత్రల నమ్మి – దైన్యపడి– వారములు చేసికొని – ముష్టియెత్తి సంపాదించిన – యాంగ్లేయ భాషలోని పాండిత్యపుఁబన యీ రంగులోనికి దిగినది. ఈ విధముగా బ్రద్దలైనది. స్వభాష యిదివరకు మీ చేతఁ జావనే చచ్చినది. మీ గతి యెంత యుభయ భ్రష్టమైనదో చూచు కొంటిరా? మీరు వెచ్చించిన ధనములోఁ బడిన శ్రమములో వినియోగపఱచిన కాలములోఁ, బొందిన దైన్యములో, నేడ్చిన యేడ్పులలోఁ, బదునాఱవ వంతైన నక్కఱ లేకుండ మీరు దేశభాషా పండితులై యుందురు. స్వభాషను మీరు నేర్చుకొనుట కేమంత శ్రమమున్నది? అక్షరాభ్యాస దినమునుండియె మీరు స్వభాష నభ్యసించు చున్నారని యనుకొనవలదు. మీ తల్లి కడుపులో నున్నప్పుడే నేర్చుకొనుట మొదలు పెట్టినారు. ఆమె భుజించిన పదార్థముల రసమును నాభీనాళ ద్వారమున మీలోఁ బ్రవేశపెట్టుచున్నప్పుడే యాంధ్ర భాషా జ్ఞానమును గూడ దానితో జోడించినది. తరతరముల నుండి వంశాను క్రమముగా మీ రక్తములో జీర్ణమై, మీ మాంసమునకు మాంసమై, శల్యమునకు శల్యమై, మెదడుకి మెదడై, మీ తత్త్వముతో నైక్యమొందిన యాంధ్రభాషను, మీరిప్పుడు క్రొత్తగ నేర్చుకొను టయేమి? ఉపాధ్యాయుఁడైన నక్కఱ లేకుండ గ్రంథము లూరక చదువుకొనుచుఁబోయిన యెడల భాషా జ్ఞానసంపాదన మీ కెంతసేపు? నాకాంధ్రభాష రాదని మన యధ్యక్షుఁడు కంఠోక్తిగాఁ బలికినాఁడు. మా భాష మాకు రాదను నసభ్యవాక్య మాంధ్రుని నోట నుండి వెడలఁదగదు. ఏ జాతి వారి నోటి నుండియు నంతే–ఆంధ్రదేశమున పుట్టి యెంత కాలమైనదో, ఇట్టి యనుచిత వాక్యము నేఁడు బయలువెడలినది. అనుచిత మనుమాట నిస్సందేహము. పోనిండు దీనికేమి? అనుచితకు – నసందర్భతకు –నవకతవకకు ననేక సంవత్సర ముల నుండి యలవాటుపడియే యున్నాము. భాష మీకు రాదేమి? అబ్బా! మీరే ప్రయత్నము చేసినా రని రాదనుచున్నారు? భాష తనంత తాను మీకు వచ్చుననియే యనుకొనుచున్నారా? మహమ్మదుగారి యెద్దకుఁ గొండ రాకపోయినప్పుడు మహమ్మదు గారు కొండ యెద్దకు వెళ్లినారా లేదా? మీకు భాష రాకపోవుట భాష లోపమా? మీ లోపమా? భాషను గొంచెము దీక్షతోఁ బఠించిన యెడల నది రానివాఁ డుండునా? పఠింపకుండ భాష రావలయునన్న నది


# స్వభాష

పైపైన నున్నదా? భాష యందు మీకు నిర్లక్ష్యత యైనప్పుడు భాషకు మీ యందభిమానముండునా? భాషా గ్రంథము మీకుఁ దలక్రింద నెత్తునకైనఁ బనికిరానప్పుడు భాషా జ్ఞానము మీ తలలో నెట్లు దూరును? చదివినను భాష రానివాఁడెవ్వండు? ఎవ్వఁడో, వ్రేలు మడచి యొక్కని పేరెత్తి చెప్పుఁడు. భాషలోఁ బుట్టి భాష నేర్చుకొని భాషరాక భ్రష్టుఁడైన ప్రపంచాతీతపురుషుఁ డెవ్వఁడో చూతము. చూచి యథార్థముగ స్వభాషా జ్ఞానమున కర్హుఁడు కాని యదృ్భతాజ్ఞానతత్త్వమే యగునెడ– నన్నయ భట్టుకాలము నుండి యిప్పటి వఱకున్న భాషా గ్రంథములన్నియుఁ గట్టకట్టి బంగాళా ఖాతములోఁ బాఱవే యుదము. మనకు రానిభాషతో మనకేమి పని? అయ్యయ్యో? రవంత కష్టమైనఁ బడనక్కఱ లేదా? నోరు మెదపనైన నక్కఱలేదా? 'క్రిమినల్ ప్రాసీజర్కోడ్' చేతఁ బట్టకుండనే మన యధ్యక్ష శిరోమణికి శిక్షాశాస్త్ర సిద్ధి యయినదా? 'ట్రాన్స్ఫర్ ఆఫ్ ప్రాపర్టీ' ఆక్టు తలఁగొట్టుకొని వల్లెవేసిన వారే – తారాశశాంక విజయము రవంత చదువలేరా? సరదా తీరును. శబ్దజ్ఞానము వచ్చునే – ఊరకే రమ్మన్న నేదైన వచ్చునా? అట్లెవ్వనికైన వచ్చినదా? కడుపు నిండుటకు నోటిలోఁ బడినదానిని మ్రింగనైన వలదా? అమాత్రపు శ్రమమైనఁ బడనక్కఱ లేదా? 'మెయిన్సు పీనల్కోడ్' మడత వేయుటలో మెదడు చింపుకొన్న వాఁడవే– మనుచరిత్రమున నొక్క యాశ్వాసమును విలాసము కొఱకైనను జదువుటకు నీ కోపిక లేకపోయెనా? తీరిక లేకపోయెనా? శక్తి లేకపోయెనా? బుద్ధిలేకపోయెనా? చంద్రబుల్లి నామూలాగ్రముగ నెఱుఁగుదువుకాని చంద్రమతి పేరైన నెఱుఁగవే! 'కన్నింగ్హామ్సు ఎవిడెన్సు' ఆక్టు వలన నీకడుపే నిండునుగాని కంకంటి వారి రామాయణము వలన నీ మనస్సు నిండునే! 'జస్టిసు హోలోనే'గారి జడ్జిమెంటు నొప్పఁజెప్పఁగలవు కాని జనకచక్రవర్తి ప్రపంచమునకు బోధించిన నీతి నెఱుఁగవే? 'సివిల్ ప్రాసీజర్కోడు లేటెస్టు ఎడిషన్' కుఁ గర్త యెవ్వఁడో యెఱుఁగుదువుకాని సీతా రామాంజనేయ కవి యెవఁడో యెఱుఁగవే? భారత భాగవతములను బఠింపని నీవు బారిస్టరు వైననేమి – ప్రభూత్తముఁడ వైననేమి? ఆంధ్రుడవై యేల పుట్టితివోయి నాయనా! నీవాంధ్ర దేశయన కెందులకోయి నాయనా. నాకు బోధపడక యడుగు చున్నాను. క్షమింపుము. నీవే పుస్తకములను జదువనక్కఱలేదు. దినమున కొక్కసారి పావుగంట తెఱపిచేసికొని రాత్రి భోజనమైన తరువాత నిల్లాలిని బిల్లలను నీ చుట్టు కూరుచుండఁబెట్టుకొని తాంబూల చర్వణ మాచరించుచు నడుమ నడుమ నాన్కో ఆపరేషను ముచ్చటలఁజెప్పుకొనుచు నాంధ్రపత్రికను జదుపరాదా? నాలుగు మాసములట్లు చదువుము. నాకాంధ్ర భాషా జ్ఞానమెంత వృద్ధియగునో తెలుఁగుబాసలో నేదైనపస యున్నదని నీ కప్పటికిఁ దెలిసినయెడల భాషా గ్రంథములను జదువవచ్చును. అందఱు తెలుఁగు మాటలాడవలసిన యిందఱిలో నీ వొక్కఁడ నింగ్లీషుతో మాటలాడితివి! కావుకావు మని యనవలసిన కాకులన్నిటిలో నొక్క కాకి కొక్కొరకో యని యఱచినయెడల మిగిలిన కాకులు దానిని ముక్కుతోఁ బొడిచివేయక మానునా? మేము నీవంటి యనేక ప్రకృతుల కలవాటు పడినవారము కావున సరిపోయినది. కాని లేకున్న నేమి కాఁదగినది? ఆంగ్లేయభాష యేల చదువుకొంటివని నే నధిక్షేపింపను. ఇంతకన్న నధిక జ్ఞానమును గూడ నీ వాభాషలో సంపాదింపుము. నాకు మరింత యిష్టము కాని నీయాంగ్లేయభాషా జ్ఞాన మెందులకో నీ వెఱుఁగుదువా? ఆంగ్లేయభాషయే కాదు, ఇంక ననేక భాషలు కూడా నేర్చుకొనుము. నీవు సంపాదించిన పరభాషాజ్ఞానమంతయు నీ భాష నభివృద్ధి పఱచుటకే. నీ భాషను భాగ్యవత్తరమును జేయుటకే– నీ భాషను బరభాషాగ్రంథ ప్రశస్తాభి ప్రాయములతో వన్నెపెట్టుటకే – అంతకంటే వేరు కాదే. ఆంధ్రభాషలో అ ఆ లకంటే నవతలి యక్కఱము లెరుఁగని వాఁడవు కదా! ఆంధ్రుఁడవై యుండియు నాంధ్రభాషలో 'ఆ' యని నోరు



# చక్కెర ముక్కలతో చేదుగుళికలు

మహా ప్రవాహంలా సాగే ఉపన్యాసాల మాదిరిగా సాగుతాయి ఆ వ్యాసాలు. వందేళ్ల క్రితం రాసినవే అయినా నిన్నమొన్నటి సామాజిక, రాజకీయ పరిణామాలను కళ్లకు కట్టించేవిగా ఉంటాయవి. వాటి నిండా దట్టమైన వ్యంగ్యం. కానీ దేశీయత, స్థానీయతల కోసం ఆరాటం, మనవైన మూలాల కోసం అన్వేషణే ఆ వ్యంగ్యం నిండా ధ్వనిస్తూ ఉంటుంది. మాతృభాష పట్ల అకారణ వ్యతిరేకత, మనిషిలోని భేషజం, మూఢభక్తి... దురాచారాల మీద దండయాత్ర.. ఒకటేమిటి ఎన్నో అంశాలను ఆవిష్కరించిన అద్భుత రచయిత పానుగంటి లక్ష్మీనరసింహారావు. అపురూపమనిపించే ఈ తరహా వ్యాసంగానికి మూలమేమిటో కూడా బహిర్గతం చేసి, పానుగంటి తన నిజాయతీని నిరూపించుకున్న తీరు అద్భుతం. అలాగే సమాజ మానసిక వికృతుల పట్ల తనకున్న అపార ఆవేదనకు ఆయన అక్షరరూపం ఇచ్చిన తీరు మహాద్భుతం. నాటక రచయితగా, అధిక్షేపాత్మక 'సాక్షి' వ్యాసాల కర్తగా, నటులుగా, ఆధునిక సాహిత్య చరిత్రలో పానుగంటి లక్ష్మీనరసింహారావు చిరస్మరణీయులు.



నాటి రాజమండ్రి తాలుకా సీతానగరంలో పానుగంటి (ఫిబ్రవరి 11, 1865– జనవరి 1, 1940) జన్మించారు. తండ్రి వేంకట రమణయ్య ఆయుర్వేద వైద్యులు. లక్ష్మీనరసింహారావు రాజమండ్రి కళాశాల నుండి పట్టభద్రులయ్యారు. బీఏ ఇంగ్లిష్ సాహిత్యంతో ప్రతిష్ఠాత్మకమైన మెట్కాఫ్ స్వర్ణ పతకాన్ని పొందిన ప్రతిభావంతులు. విద్యార్థి దశలో షేక్స్పియర్ నాటకాలలో పాత్రలు ధరించి మెప్పించారు. కందుకూరి వీరేశలింగం 'అభిజ్ఞాన శాకుంతలం' అనువాద నాటక ప్రదర్శన బాధ్యతలు చేపట్టి ఎన్నోసార్లు ప్రదర్శించారు. ప్రసిద్ధ నటులు, దర్శకులు కూచి నరసింహం నటనా, దర్శకత్వ నైపుణ్యాలను గ్రహించి, కొన్ని నాటకాలకు పానుగంటి దర్శకత్వం వహించారు.

పెద్దాపురం ఉన్నత పాఠశాలలో కొద్దికాలం ఉపాధ్యాయునిగా పానుగంటి పనిచేశారు. కొంతకాలం కొత్తపల్లి జగ్గారాయణింగారి పిల్లలకు పాఠాలు చెప్పారు. తర్వాత లక్ష్మీనరసాపురం ఎస్టేట్ జమిందారిణి రావు చెల్లయ్యమ్మారావు దగ్గర దివానుగా చేరారు. 1905లో రావు కుమార మహీపతి సూర్యారావు బహద్దూర్ పిఠాపురం వచ్చినప్పటి నుండి ఆయన దగ్గరే ఉన్నారు. సూర్యారావు బహద్దూర్ వివాహ మహోత్సవ సమయంలో 'కోకిల' నాటకాన్ని రాసి ప్రదర్శించారు. 'విజయ రాఘవం' అనే నాటకాన్ని ఆయన పట్టాభిషేక సమయంలో రాసి ప్రదర్శించారు. దాదాపు 30 నాటకాలు రాసినా, వాటిలో 26 మాత్రమే అచ్చయ్యాయి. వాటిలో కొన్నింటిని పరిశీలిద్దాం.

చెల్లాయమ్మారావు ఎస్టేట్లో దివానుగా ఉన్నప్పుడే పానుగంటి 1902లో తొలి నాటకం 'నర్మదాపురుకుత్సీయం' రాసి, ఆమెకి అంకితమిచ్చారు. ఈ నాటకంలో పద్యశైలిని గూర్చి ఇలా చెప్పుకున్నారు.

**"ఒక్కచో తేనెలొలికించు నొక్క చక్క**
**చక్కెర ముక్కల నుంచు; నొక ప్రక్క**
**నాణెమగు సుధల జిలికించు నవ్య భవ్య**
**కావ్య రచనలనీ మహాకవి వరుండు"**

తన రచనలు తేనె, చక్కెరలు కలసిన మాధురీ భరితమైన అమృతాలని పానుగంటి చెప్పుకున్నారు. ఇందులో స్వర్గ, మర్త్య, పాతాళాల మధ్య ఇతివృత్తాన్ని నడిపించారు రచయిత.

---

మెదలుపలేనివాఁడవు కదా! నీ యాంగ్లేయ భాషా జ్ఞానమును దేశమున కెల్లు పచరింపఁ దలఁచితివో చెప్పుము. నాయనా! నిన్ను గ్రంథములు వ్రాయుమని కోరుచున్నా ననుకొంటివేమో? నీవు వ్రాయునదేమి? పార్టీలనెత్తిన పేఁడ–ఏ గ్రంథము నీవు వ్రాయవలదు. ఏ గ్రంథమును జదువవలదు. రేపటి నుండియే యాంధ్రపత్రిక నామూలాగ్రముగఁ జదువుచుండుము. తెలియలేదని సందేహించుచుంటివా? క్లబ్బులో గంటన్నర చీట్లాటకుఁ దెలియియుండుఁగా, టెన్నిసు కోర్టులో రెండు గంటలు లోకాభిరామాయణమునకుఁ దెలియియుండుఁగా, దేశభాషా పత్రికా రాజమును జూచుట కొక్క యఱగంట తెలియలేకుండునా? తెలియ లేకపోయినయెడలఁ జేసికో.

నాయనలారా! మన కింగ్లీషు మాటలతోఁ జెప్పినఁగాని యే యంశము కూడ మనస్సున కెక్కదు. అట్టి యభ్యాసము చిరకాలము నుండి యస్థిగత రోగమైయున్నది. ఆయుర్వేదవైద్యుఁడు వచ్చి "అయ్యా కరివేపాకు పొడుముతోఁబథ్యము పుచ్చుకొనుమని నీతోఁజెప్పఁగ నీ కామాట నచ్చదు. నానెన్నున్ను, కరివేపాకుపొడు మెందులకయ్యా యని నీ వా యాయుర్వేదవైద్యు నధిక్షేపింతువు. ధనియాలు 'డైజేషన్'కు మంచివి. మిరియాలు 'లివర్' మీద 'ఆక్టు' చేయును. కరివేపాకు 'గాల్ బ్లాడర్'కు సత్తువ నిచ్చునని యెనఁడో ఎల్.ఎం.పి. మనవాఁడే చెప్పిన యెడల నీ కది శ్రుతిప్రమా ణము. నాయనలారా! మనమెంత లక్షాధి పతులమైనను గోటీశ్వరులమైనను మన బ్రదుకులు ముష్టి బ్రదుకులు కాని మఱియొకటి కాదు. ఈ ముష్టిదేవులాటలో నింగ్లీషు మాటలు కూడా నెందులకు? ఆ యేడుపేదో మాతృభాషతోడనే యేడ్చిన మంచిది కాదా? మన యేడుపు సహజముగాను సాపుగాను స్వతంత్రముగా నుండునే. ఏడుపులోఁ గూడ మన కస్వతంత్రత యేమి కర్మము? అందుకు సర్వస్వతంత్రులము సంపూర్ణాధికారులమే కదా? ముష్టి బ్రాహ్మణుఁడు నీ యింటికి వచ్చి యాయావరపు బ్రాహ్మణుఁడి నయ్యాయని యనక "బాయ్ రూములోనున్న పాట్లో రైస్ యేమైన నున్నదేమో, కైన్ డ్లీగెటిట్ హియర్; థాంకు యూ ఇన్ ఆంటిసిపేషన్" అని నీతో సంభాషింపఁగ, వాతనికి ముష్టి వేయుదువా? మూఁతిమీఁద నీడ్చి యొక్కటి వేయుదువా? అలాగే మన ముష్టిలోని యీ ఇంగ్లీషు మాటలు కూడనంత గౌరవప్రదములే యని నిశ్చయముగా నమ్ముఁడు – నమ్ముఁడు.


**పానుగంటి లక్ష్మీనరసింహారావు 'సాక్షి' వ్యాసాలలోని 'స్వభాష'లో కొన్ని మెరుపులు**

ఈ నాటక సన్నివేశ చిత్రణలో పానుగంటి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. భవిష్యత్తులో ఆయన రాసిన నాటకాలన్నింటికీ ఈ నాటకమే చోదకశక్తిలా పనిచేసిందని విమర్శకుల అభిప్రాయం.

ఆయనకు ఎంతో ఖ్యాతి తెచ్చిన 'సారంగధర' నాటకాన్ని 1904లో ప్రచురించారు. ఈ నాటకాన్ని కూడా చెల్లయ్యమ్మారావుకే అంకితమిచ్చారు. ఇందులో రాజరాజనరేంద్రుడు, సారంగధరుడు ముఖ్యపాత్రలు. చిత్రాంగి మేడపై సారంగధరుని పావురం వాలింది. 'సుబుద్ధి' అక్కడకు వెళ్లొద్దని వారించినా, సారంగధరుని చిత్రాంగి మేడపైకి వెళ్లాడు. చిత్రాంగి సారంగధరునిపై వలపును ప్రకటించగా, అతడు తిరస్కరించాడు. చిత్రాంగి కోపంతో సారంగధరుడు తనను బలత్క రించాడని చెప్పిన మాటలు విని రాజు సారంగధరుడికి మరణ శిక్ష విధించాడు. చివరకు రాజు పశ్చాత్తాపచిత్తుడై రాజ్యాన్ని వీడి అరణ్యాలకు వెళ్లాడు. మానసనాథుడి ఔషధ ప్రభావంతో అతడు పునర్జీ వితుడైన విషయం తెలిసి రాజు తన కుమారుడు సారంగధరుని కలుసుకుంటాడు. చిత్రాంగిని క్షమించటంతో నాటకం సుఖాంతమవుతుంది. పానుగంటి ఇందులో అంతర్నాటక ప్రక్రియను ప్రవేశపెట్టడం ఔచిత్యంగా ఉంది. ఇది తెలుగునాట విశేష జనాదరణ పొందింది. తన నాటకాలన్నింటిలోను ఆయన అంతర్నాటక శైలిని ఉపయోగించుకున్నారు.

పానుగంటి మూడో నాటకం 'ప్రచండ చాణక్యం' 1909లో ప్రచురితమైన ఈ నాటకం విశేష ప్రజాదరణ పొందింది. అలాగే విమర్శలూ విరివిగానే వచ్చాయి. ఇది విశాఖదత్తుడి 'ముద్రారాక్షసం' నాటకానికి పూర్వగాథ. పానుగంటి ఔచిత్య దృష్టితో ఈ నాటకంలో చాలా మార్పులు చేశారు. అవసరాన్ని వివరిస్తూ 'ఇందులో కొన్ని అమానుష కృత్యాలున్నందున వర్తమానకాలానికి అవి ప్రేక్షకులకు రుచించవని భావించి కొత్తమార్గంగా ఈ నాటక కథను కల్పించవలసి వచ్చింద'ని చెప్పారు. ఇందులో చరిత్ర ప్రసిద్ధమైన చాణక్య పాత్రనూ, రాక్షస మంత్రి పాత్రనూ కొంత మార్చారు.

1909లో వెలువరించిన 'రాధాకృష్ణ' పానుగంటి నాటకాలన్నింటిలో ఉత్తమమైనదిగా పేర్గాంచింది. మధురభక్తి, రచనాశిల్పం ఇందులో ముఖ్యమైనవి.



**డా॥ పి.వి.సుబ్బారావు**
రిటైర్డ్ ప్రొఫెసర్

**వాల్మీకి రామాయణం ఆధారంగా పానుగంటి నాలుగు నాటకాలను రచించారు. అవి 1. పట్టభంగ రాఘవం 2. విజయ రాఘవం, 3. వనవాస రాఘవం, 4. కల్యాణ రాఘవం. ఇవి పానుగంటి వారి రామభక్తికి నిలువెత్తు నిదర్శనాలు. తెలుగు పౌరాణిక నాటక రంగంలో ఇదొక అరుదైన విశేషం. ఈ నాటకాల్లో సంభాషణా చాతుర్యం, పాత్ర పోషణ, నాటకీయత ఒక దానితో ఒకటి పోటీ పడి నాటకాలను రక్తి కట్టించాయి.**

నాయికగా రాధ పాత్రను చిత్రించటంలో పానుగంటి చూపిన సంయమనం, ఆధ్యాత్మికత, అంతరంగపు లోతులు ప్రేక్షకులను అలరిస్తాయి.

"నేనే రాధను, పూర్వజన్మముల రాధను, వర్తమానమున రాధను, భవిష్య జన్మలో రాధను, పునః సృష్టిలో రాధను, నా పతి శ్రీకృష్ణుడు-శ్రీకృష్ణుడు" – అంటూ పారవశ్యంలో ఉన్న రాధను దర్శింపచేసి పానుగంటి ప్రేక్షకులను ధన్యులను చేశారు.

వాల్మీకి రామాయణం ఆధారంగా పానుగంటి నాలుగు నాటకాలను రచించారు. అవి 1. పట్టభంగ రాఘవం 2. విజయ రాఘవం, 3. వనవాస రాఘవం, 4. కల్యాణ రాఘవం. ఇవి పానుగంటి వారి రామభక్తికి నిలువెత్తు నిదర్శనాలు. తెలుగు పౌరాణిక నాటక రంగంలో ఇదొక అరుదైన విశేషం. ఈ నాటకాల్లో సంభాషణా చాతుర్యం, పాత్ర పోషణ, నాటకీయత ఒక దానితో ఒకటి పోటీ పడి నాటకాలను రక్తి కట్టించాయి. ఈ నాలుగు నాటకాల్లో మూడింటిని 1909లో, మరొక దానిని 1915లో రచించారు. ఈ నాలుగు నాటకాల మధ్యలో 1909 నుండి 1915 మధ్య 'కోకిల', 'విప్రనారాయణ', 'బుద్ధ బోధసుధ' వంటి నాటకాలు రచించారు.

పానుగంటి రచనలలో 'కంఠాభరణం' హాస్య స్ఫోరకమైన విశేష నాటకం. దీనిని పిఠాపురాస్థాన ప్రభువు శ్రీ రాజా వెంకట కుమార మహీపతి సూర్యారావు బహద్దూర్ "మిగుల నవ్వువచ్చు నాటకమేదైనా రచింపువని కోరిన కోరిక మేరకు ఈ నాటకాన్ని 5 వారాల్లో (03-04-1917లో ప్రారంభించి 10-05-1917) రచించినట్లు పీఠికలో చెప్పారు. పానుగంటి వారు 'విచిత్ర వివాహం' అనే హాస్యరూపకంలో బాల్య వివాహాలను అధిక్షేపించారు. నాటకాల్లో చారిత్రక, పౌరాణిక, సాంఘిక ఇతివృత్తాలున్నాయి. వీటిలో భక్తి, వీర, అద్భుత, హాస్య రస ప్రధానాలున్నాయి. పానుగంటివారి నాటకాలపై పాశ్చాత్య నాటక ప్రభావం ప్రగాఢంగా ఉంది.

పానుగంటివారు కథానిక రచయితగా సువర్ణ లేఖ పత్రికలో చాలా కథలు ప్రచురించారు. ఆయన దృష్టి కథా రచనపై కన్నా నాటకాలపై, వ్యాసాలపైనే ఎక్కువ. రచయితలు పద్యకావ్యాలు రచించినంత ఎక్కువగా గద్యకావ్యాలు రాయడం లేదని బాధపడేవారు. గద్య రచయితలకు గౌరవం లేదని అధిక్షేపించారాయన. నాగరిక దేశాలన్నింటిలో వచన ప్రబంధాలు లక్షోపలక్షలుగా వస్తుంటే, మన దేశంలో అందుకు విరుద్ధంగా జరగడం శోచనీయమన్నారు.

1922లో పిఠాపురం సంస్థానంలో జరిగిన ఆంధ్ర సాహిత్య పరిషత్తు సభలకు పానుగంటి అధ్యక్షత వహించారు. నాటి అధ్యక్షోపన్యాసం చిరస్మరణీయమైంది. 1911 నుండి 1914 వరకు 'సువర్ణ లేఖ' పత్రికలో సాక్షి వ్యాసాలు, వచన ప్రహసనాలు, చిన్న కథలు ప్రచురించారు. 'సాక్షి వ్యాసాలు' మీద ఆంగ్ల రచయితలు ఎడిసన్, స్పెక్టేటర్ ప్రభావం ఉంది. సాక్షి వ్యాసాల మొదటి సంపుటిలో 31, రెండో సంపుటిలో 29 ఉన్నాయి. సాక్షి సంఘంలో ఐదుగురు సభ్యులున్నారు. వారే– సాక్షి, జంఘాల శాస్త్రి, కాలాచార్యుడు, వాణీదాసుడు, బొఱ్ఱయ్య శెట్టి. సత్యపురం తపాలా కచేరీకి ఎదురుగా ఉన్న అద్దె ఇంట్లో ప్రతిరాత్రి సమావేశం కావాలని వారి నియమం. అంతా రాగానే చక్రవర్తిగారికీ, వారి కుటుంబానికీ ఆయురారోగ్య ఐశ్వర్యాలు ఇమ్మని భగవంతుని ప్రార్థించాలి. రాజకీయ విషయాలు చర్చించకూడదు. తప్పులనూ, ఆ తప్పులకు లోనైన వ్యక్తులనూ నిందించకూడదు. వాదాలతో కలహాలు రా'కూడ'దు అనే నియమాలు సాక్షి సంఘం ఏర్పాటు చేసుకున్నది.

సాక్షి వ్యాసాలు ఆనాటి సాంఘిక స్థితికి అద్దం పట్టాయి. సంఘంలో స్త్రీల స్థానం, హక్కులు, విద్యా సాంస్కృతికాభివృద్ధి మొదలైన అంశాలతోపాటు స్త్రీల పాశ్చాత్య వ్యామోహాన్ని కూడా పానుగంటి నిశితంగానే విమర్శించారు. ఆయన ప్రకర్ణోపన్యాసాల్లో 'గ్రామ్యవాద ఖండనకొక విన్నపం' పంటివే కాక, 'స్వప్నకావ్యం' అనే ఏకాశ్వాస కావ్యం కూడా ఉంది. విమర్శాదర్శిని వంటి చిన్న పుస్తకాలు ప్రచురించారాయన. ప్రకీర్ణోపన్యాసాల్లో సాహిత్యం ధోరణులపై కొంత విమర్శ ఉంది.

పానుగంటి ఉపన్యాసాల్లో విశిష్టత ఉంది. విన్నవారికి తమరే మాట్లాడుతున్నట్లనిపిస్తుందట. జంఘాల శాస్త్రి ఉపన్యాసాలు ఆవేశపూరితంగా సాగుతాయి. చమత్కార రసస్ఫోరకాలుగా శ్రోతలను ఆకర్షిస్తాయి. 'సువర్ణలేఖ', 'భారతి'లో వచ్చిన కథలతో కలిపి 'కథావల్లరి' సంపుటిని ప్రచురించారు. పానుగంటివారిపై పాశ్చాత్య రచయితలు చార్లెస్ డికెన్స్, ఎడిసన్, స్విఫ్ట్ వంటివారి ప్రభావం ప్రగాఢంగా ఉంది. వారి ప్రభావంతో హాస్య రచనలు చేసి ఆధునిక సాహిత్య చరిత్రలో హాస్య వాఙ్మయ నిర్మాతగా ప్రసిద్ధులయ్యారు. ★



రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) శతాబ్ది సంవత్సరం వైపుగా అడుగులు వేస్తోంది. ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని ఆర్ఎస్ఎస్ ఏం చేయబోతోంది, ఎలాంటి ప్రణాళికలను సిద్ధంచేస్తోంది? అనే విషయంలో సహజంగానే సర్వత్రా ఆసక్తి వ్యక్తమవుతోంది. ఇక బురద చల్లేందుకు విమర్శకులు రాజకీయాలపై సంఘ్ ప్రభావం మొదలు, సంఘ్‌లో మహిళల ప్రాతినిధ్యం వరకు చాలా ప్రశ్నలు తరచూ అడుగుతూ ఉంటారు. అలాగే యువత ప్రాతినిధ్యం, టెక్నాలజీ, ఎల్జీబీటీ, పర్యావరణం, ఆర్థిక వ్యవస్థలపై సంఘ్ దృష్టికోణం తెలుసుకోవాలని ప్రజలు కోరుకుంటారు. సంఘ్ మార్గ నిర్దేశనం ఆశిస్తారు. ఈ అంశాలతో పాటుగా మరిన్ని అంశాలను సర్ సంఘచాలక్ డాక్టర్ మోహన్‌జీ భాగవత్ 'పాంచజన్య' సంపాదకులు హితేష్ శంకర్, 'ఆర్గనైజర్' పత్రిక సంపాదకులు ప్రఫుల్ల కేత్కర్‌తో జరిపిన ప్రత్యేక ఇంటర్వ్యూ (జనవరి 15 సంచిక)లో పంచుకున్నారు. ఆ వివరాలు జాగృతి పాఠకుల కోసం..

# మా బంధం జాతీయ విధానాలకు సంబంధించిన రాజకీయంతోనే!

**ఇది పాంచజన్య, ఆర్గనైజర్ ప్రతి సంవత్సరం నిర్వహించే ఇంటర్వ్యూ. పాఠకులు, వీక్షకులు ఎంతగానో ఎదురుచూసే అంశం. కొవిడ్ 19 మహమ్మారి కారణంగా వరసగా రెండు సంవత్సరాలు అంతరాయం ఏర్పడింది. ఈ రెండు సంవత్సరాల కాలంలో మనం, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలకు మరింత దగ్గరయ్యాం. ఏ సంస్థ అయినా వంద సంవత్సరాల ప్రయాణాన్ని పూర్తి చేసుకోవడం మాములు విషయం కాదు, అదొక సవాలు. సుదీర్ఘప్రయాణంలో ఒకరు దారి తప్పవచ్చు లేదా ప్రయాణమే ముగిసి పోవచ్చు. ఈ మహోన్నత మైలురాయిని చేరుకుంటున్న సమయంలో, ఈ సుదీర్ఘ ప్రయాణంలో సంఘ్ ఎదుర్కొన్న అతిపెద్ద సవాలు ఏమిటి, అది ఎప్పుడు ఎదుర్కొంది? వివరిస్తే తెలుసుకోవాలని ఉంది?**

సవాలు అనేది చాలా ఉన్నతమైన పదం. అవును, సంఘ్ ఎగుడు దిగుడు దారిలో, కష్టతరమైన మార్గంలో ప్రయాణం చేసింది. ప్రయాణ మార్గంలో అనేక అనూహ్య మలుపులు దాటి వచ్చింది. అలాగే, సంఘ్ ప్రయాణించిన మార్గంలో అనేక అవరోధాలు, అగాధాలు ఉన్నాయి. అయినా మా ముందు, ఒక లక్ష్యముంది. కర్తవ్యముంది. ఆ రెంటినీ సమన్వయ పరిచే కార్యాచరణ ఉంది. మేం మా ముందున్న లక్ష్యం మీదనే దృష్టి కేంద్రీకరించాం. సంక్లిష్ట ప్రయాణంలో కూడా మౌలిక లక్ష్యాన్ని, ఎంచుకున్న మార్గాన్ని వీడకుండా ముందుకు సాగడమే మేం ఎదుర్కొన్న అతి పెద్ద సవాలు.

మా ఈ ప్రయాణంలో చాలా బలమైన శక్తుల నుంచి గట్టి వ్యతిరేకతను ఎదుర్కొన్నాం. ఆ వ్యతిరేకతను మౌనంగా భరించవలసి వచ్చింది. అయినా.. వ్యతిరేకతను ఎదుర్కొని నిలబడ్డాం. అయినా, మేము మా వ్యతిరేకులకు విరోధులం కాదల్చుకోలేదు. ఎందుకంటే, అలా చేస్తే అది మరింత వ్యతిరేకతకు, నిరంతర సంగ్రామానికి దారితీస్తుంది. అందుకే మేం మా ప్రత్యర్థులను విరోధులుగా తీసుకోలేదు. కొన్ని సందర్భాలలో పరిస్థితుల ప్రభావంతో మనం మన మార్గాన్ని మార్చుకోవలసి వస్తుంది. అయితే, అలాంటి సందర్భాలలో మేం, కొత్త మార్గాలను కనుగొనే విధానాన్ని ఎంచుకున్నాం. మా ప్రయాణ మార్గంలో అనూహ్య మలుపు తీసుకుంటే తీసుకుని ఉండవచ్చు కానీ, లక్ష్యం నుంచి చూపును ఎప్పుడూ తిప్పుకోలేదు. అలా లక్ష్యం నుంచి చూపు తిప్పకుండా సాగినప్పుడే కొత్త దారులు, కొత్త మలుపులు ఆశించిన ప్రతిఫలాన్ని అందుకుంటాయి. కాదంటే, లక్ష్యం దారి తప్పుతుంది. ఈ గ్రహింపు, మా ప్రయాణం పొడుగునా మాకు చుక్కానిగా నిలిచింది. దారి చూపింది. మేం ప్రయాణించే మార్గం కంటకాకీర్ణ మార్గమని మాకు తెలుసు. ఇవన్నీ మేం ముందుగా ఊహించినవే.

ఆనాటి విద్వేషం, వ్యతిరేకత ఈరోజున (సంఘం పట్ల) లేవు. ఆ రోజులు వెళ్లిపోయాయి. ఈ రోజున సమాజం నుంచి అసమాన ప్రేమ, వాత్సల్యం పుష్కలంగా అందుతున్నాయి. మా ఆలోచనలకు కాలమాన పరిస్థితులు కూడా సానుకూలంగా ఉన్నాయి. నిజానికి, సమకాలీన ప్రపంచాలలోనూ సానుకూల మార్పులు అనివార్యమవుతున్నాయి. ఇంతవరకు అటూ ఇటూగా ఆలోచిస్తున్న వ్యక్తులు కూడా మా మార్గంలోకి, మా ఆలోచన ధోరణిలోకి వస్తున్నారు. కాలంతో పాటుగా ఈ భావన మరింతగా బలపడుతోంది. ఈ కారణంగా మా మార్గం కొంత సులభమైంది. దీనిని సాధించడమూ ఒక సవాలే.

ఇంతకు ముందు మా మార్గంలో గుచ్చుకున్న ముళ్లు ఇప్పుడు వాటి స్వభావాన్ని మార్చుకున్నాయి. గతంలో మేం వ్యతిరేకత, విద్వేషాలను ఎదుర్కోవలసి వచ్చేది. వాటి నుంచి తప్పిచుకునే వీలుండేది. కొన్ని సందర్భాలలో వాటిని అసలు పట్టించుకోలేదు. వదిలేశాం. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. కొత్తగా లభించిన విస్తృత ప్రజామోదం మాకు వనరులు చేకూర్చింది. వెసులుబాటు కలుగజేసింది. సంవృద్ధిని అందించింది. సామాజిక గౌరవ, మర్యాదలు, విశ్వాసం పెరిగాయి. సమాజం మా మీద విశ్వాసం ఉంచింది. అంచనాలు పెరిగాయి. సమాజం మా ద్వారా పరివర్తనను ఆశిస్తోంది. ఈ పరిస్థితులలో పెరిగిన ప్రజాదరణ, వనరులు అనుకోకుండా మాకు ముళ్లుగా మారాయి. ఇప్పుడు ఈ ముళ్లను ఎదుర్కోక తప్పని పరిస్థితి. ఉదాహరణకు, చాలా వాటిపై మీడియా ముందుకు వెళ్లడం మాకు ఇష్టం ఉండదు. కానీ తప్పించుకోలేం. మీడియాకు దూరంగా ఉంటే, అది ప్రతికూల ప్రభావం చూపవచ్చు. మేం నీడల మాటున ఎందుకు దాక్కుంటున్నామని వారు ఆశ్చర్యపోవచ్చు. కాబట్టి

మేం మీడియా ముందుకు రాక తప్పదు. మేం బయటకు వచ్చినప్పుడు పత్రికలు మా గురించి రాస్తాయి. ఫొటోలు ముద్రిస్తాయి. మాకు ప్రచారం అవసరం లేదు. ఈరోజు మావద్ద ఉన్న సాధనాలు, వనరులు పనికి అవసరమైనవిగానే చూడాలి. వనరులను మనం నియంత్రిచాలే కానీ, వనరులు మనలను నియంత్రిచరాదు. మనం వాటికి అలవాటు పడరాదు. కష్టాలను ఎదుర్కొనే మన పాత అలవాట్లు ఎప్పటికీ మనతోనే ఉండాలి. ప్రస్తుత కాలం అనుకూలంగా ఉన్నా కానీ, అది అహంకారానికి దారి తీయరాదు. సానుకూల వాతావరణం, ప్రాచుర్యంతో పాటుగా, మరికొన్ని అంశాలు తోడవుతాయి. మనకు స్వాగతం పలికేందుకు రైల్వేస్టేషన్‌కు గుంపులు గుంపులుగా జనం వచ్చినప్పుడు ఆ అనుభూతి బాగుంటుంది. అయితే అలాంటి భావనలకు ఆధారభూతమైన అంశాలు ఎటు దారితీస్తాయి అనేది గమనంలో ఉండాలి. అదే సమయంలో, ఆ భావాలను అర్థంచేసుకునేందుకు మనం జాగరూకతతో మెలగవలసి ఉంటుంది. ఆ భావనలు ఎక్కడికి తీసుకుపోతున్నాయో కూడా మన నిరంతర గమనంలో ఉండాలి. ఈ గ్రహింపు కలిగి ఉండడం, నిరంతర జాగరూకత మా ముందున్న అసలు సవాలు.

వాస్తవ దృక్పథంతో పనిచేస్తున్న క్రమంలో మా కార్యం ముందుకు సాగుతోంది. కాలక్రమంలో అందరూ వాస్తవాలను గ్రహిస్తారు. మా మార్గంలోకి వస్తారు. ఈ వాస్తవ పునాదులపైనే మా భవిష్యత్, ఈ దేశ భవిష్యత్ రూపుదిద్దుకుంటుంది. ఈ విషయంలో మాకు ఎలాంటి అనుమానం లేదు. ఆందోళన లేదు. అయితే, ఇక్కడితో ప్రస్థానం ముగిసిందనే భావనతో, మా ఆలోచనలు పక్కదారి పట్టకుండా, గమ్యం చేరే వరకు మూలాధార బిందువును (స్వత్వ) పట్టుకుని ముందుకు సాగవలసి ఉంటుంది. ప్రస్తుతమున్న సానుకూల వాతావరణంలో ఈ లక్ష్యాలను చేరుకోవడం, మా ముందున్న పెద్ద కష్టంగా అనిపిస్తుంది. మేం ఈ దశను దాటి రావాలి. ఇదే మా ముందున్న సవాలు.

**ఒకప్పుడు సంఘ్ 'సంస్థ కోసం సంస్థ' (ఆర్గనైజేషన్ ఫర్ ఆర్గనైజేషన్) అనే ఆలోచన ధోరణి, కార్యపద్ధతిని అనుసరించింది. ఇప్పుడు మీరు సామాజిక పరివర్తన, విస్తృతస్థాయిలో మానవత్వం కోసం సంఘ్ పనిచేయాలని అంటున్నారు. ఈ నేపథ్యంలో సంఘ్ కార్యపద్ధతిలో, ఆలోచనలలో ఎలాంటి మార్పును చూస్తున్నారు?**

ఇది మార్పు కాదు. ఇందులో మార్పు లేదు. ఇది పురోగతి. మొగ్గ విచ్చుకునే క్రమంలో.. అన్ని రెక్కలు ఒకేలా విచ్చుకోవు. ఒకటిగా విచ్చుకోవు. కొన్ని రెక్కలు త్వరగా విచ్చుకుంటాయి. కొన్ని కొంచెం ఆలస్యంగా విచ్చుకుంటాయి. అలాగే, మా సంస్థలో



సామాజిక పరివర్తన కార్యం నిర్వహించేందుకు మాకు స్వయంసేవకులున్నారు. వ్యవస్థలు మార్చేందుకు మాకు స్వయంసేవకులున్నారు. విభిన్న కార్యక్షేత్రాలలో పనిచేసేందుకు, పరివర్తన తెచ్చేందుకు మాకు స్వయంసేవకులున్నారు. సంఘ్ నిర్వహణ మాత్రమే చూస్తుంది. అంతకు మించి ఇంకేమీ చేయదు. స్వయం సేవకులు ఏ ఒక్క క్షేత్రాన్ని వదిలి పెట్టరు. అన్ని రంగాలలో, అన్ని క్షేత్రాలలో పనిచేస్తారు. చేస్తూనే ఉంటారు. ఇది మేం ఎప్పటి నుంచో చెపుతున్నదే. ఇప్పుడు కళ్ల ముందు కనిపిస్తోంది.

మార్పు లేదు. కార్యపద్ధతిలోనూ మార్పు లేదు. అప్పుడు ఉన్నదే ఇప్పుడూ ఉంది. మేం ఇప్పటికీ సంస్థ కోసమే సంస్థ.. అనే విశ్వాసంతో, అదే పద్ధతిలో, అదే విధానంలోనే పనిచేస్తున్నాం. లేదంటే మాలో ఆత్మతృప్తి ఏర్పడుతుంది. నిత్యశాఖలు నిర్వహించకపోయినా ప్రజలు మనతోనే ఉంటారు అనే ఆత్మతృప్తి భావన ఏర్పడుతుంది.

మేం సమాజంలో ఉన్న మేధస్సును ప్రోది చేసేందుకు ప్రాధాన్యం ఇస్తాం. సంఘ్ సభ్యుల్లో చాలా వరకు కుటుంబ సంబంధాల కారణంగా పుట్టుకతోనే మాలో ఒకరిగా వస్తారు. అయినా, నిత్యశాఖను నిర్లక్ష్యం చేయం. నిర్వహిస్తూనే ఉంటాం. సమాజ పరివర్తన బాధ్యతను తీసుకోవడం వలన మా పని భారం పెరుగుతుంది. అదే సమయంలో, సమాజ పరివర్తన కోసం పనిచేయడం వలన ఏమొస్తుంది, ఎలాంటి ప్రయోజనం చేకూరుతుంది? అనే ప్రశ్న ప్రశ్నగానే ఉండిపోతుంది. మనం ఆరోగ్యంగా ఉండాలని ఎందుకు కోరుకుంటాం? ఎందుకంటే మనం ఆరోగ్యంగా ఉంటే మనం చేసే పనులన్నీ కూడా ఆరోగ్యంగా ఉంటాయి. వయసు మీద పడిన తర్వాత మనం రిటైర్ అవుతాం. పని ఉండదు. అయినా మనం ఆరోగ్యంగా ఉండాలనే కోరుకుంటాం. అలాగే, బాల్యంలో బాధ్యతలు ఉండవు. చేసే పనీ పెద్దగా ఉండదు. అయినా ఆరోగ్యంగా ఉండాలనే కోరుకుంటాం. ఇక మనం పని చేస్తున్నపుడు ఆరోగ్యం మన మొదటి ప్రాధాన్యం అవుతుంది. అందుకే, సంస్థ కోసం క్రమశిక్షణ అనే సూత్రం మా సంస్థ మూల స్తంభం.

ఇక సామాజిక సేవకు సంబంధించి, సామాజిక పరివర్తన కార్యం నిర్వహించేందుకు మాకు స్వయంసేవకులున్నారు. వ్యవస్థలు మార్చేందుకు మాకు స్వయంసేవకులున్నారు. విభిన్న కార్యక్షేత్రాలలో పనిచేసేందుకు, పరివర్తన తెచ్చేందుకు మాకు స్వయంసేవకులున్నారు. సంఘ్ నిర్వహణ మాత్రమే చూస్తుంది. అంతకుమించి ఇంకేమీ చేయదు. స్వయంసేవకులు ఏ ఒక్క క్షేత్రాన్ని వదిలి పెట్టరు. అన్ని రంగాలలో, అన్ని క్షేత్రాలలో పనిచేస్తారు. చేస్తూనే ఉంటారు. ఇది మేం ఎప్పటి నుంచో చెపుతున్నదే. ఇప్పుడు కళ్ల ముందు కనిపిస్తోంది. ఇది పురోగతి.. సంఘ్ సాధించిన ప్రగతి. ఇప్పుడు కాదు, అప్పుడు కూడా సంఘ్ కోసమే సంఘ్ నిర్మాణ కార్యక్రమాలు ఉంటాయనే వారున్నారు. అవును, అందులో దాపరికం ఏం లేదు. సంఘ్ కోసమే సంఘ్ కార్యక్రమాలు.

**ఇక ఇప్పుడు అందరికీ ఆసక్తి కగించే విషయంలోకి వద్దాం. ఇప్పుడు సంఘ్‌ను రాజకీయ దృక్కోణంలో చూసే ధోరణి బలంగా ఉంది. మీడియా అయితే రాజకీయ పరిణామాలపై సంఘ్ దృక్పథం తెలుసుకోవాలని ఆరాట పడుతుంది. రాజకీయాలతో సంఘ్ సంబంధాలను మీరు ఎలా చూస్తారు?**

కారణాలు ఏవైనా మన సమాజంలో ప్రతి పరిణామాన్ని రాజకీయంగా చూసే దృక్పథం బలంగా వేళ్లూనుకొంది. అందుకే, ఇప్పుడు ఒక్క సంఘ్ కార్యకలాపాలను మాత్రమే కాదు, ప్రతి విషయాన్ని రాజకీయ దృక్కోణంలో చూడడం జరుగుతోంది. సహజంగా సమాజంలో ఇతర రంగాలలో జరిగే మంచి చెడుల గురించి మనం అంతగా పట్టించుకోం. ప్రతిదీ రాజకీయాల చుట్టూనే తిరుగుతూ ఉంటుంది. అయితే సంఘ్ ఆవిర్భావం నుంచి కూడా ఉద్దేశ పూర్వకంగానే రోజువారీ రాజకీయ కార్యకలాపాలకు దూరంగా ఉంటోంది. ఓట్ల రాజకీయాలతో, ఎన్నికల రాజకీయాలతో సంఘ్‌కు సంబంధం లేదు. ఒకరినొకరు అవహేళన చేసుకునే, అవమాన పరచుకునే రోజువారీ రాజకీయాలతో సంఘ్‌కు ఎలాంటి సంబంధం లేదు. అయితే, రాజకీయాలలో మన జాతీయ విధానాలను, జాతీయ ప్రయోజనా లను, హిందూ ప్రయోజనాలను దెబ్బతీసే మరో కోణం ఉంది. రాజకీయ సమగ్ర దృక్పథం ఈ అంశాలకు అనుకూలంగా ఉందా లేదా

అనే విషయంలో సంఘ్, డాక్టర్జీ (ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకులు డాక్టర్ హెడ్గేవార్) రోజుల నుంచి ఎప్పుడూ అప్రమత్తంగా ఉంటోంది. రాజకీయాలు తప్పుడు మార్గం పట్టి సామాజిక జాగృతిపై వ్యతిరేక ప్రభావం చూపితే, మేం సహజంగానే స్పందిస్తాం. జాతీయ విధానాల విషయంలో మేం చాల స్పష్టంగా ఉన్నాం. స్పష్టంగా చెపుతున్నాం. అందుకు అనుగుణంగా రాజకీయాలు సరైన మార్గంలో సాగేందుకు మేం మా శక్తి మేరకు ప్రయత్నిస్తాం. ఈ విషయంలో ఎలాంటి మీమాంస అవసరం లేదు. మేం బహిరంగంగా పనిచేస్తాం. ఇందులో ఎలాంటి దాపరికం, రహస్యం లేదు. ఇప్పుడు కూడా అదే పద్ధతి పాటిస్తున్నాం. రోజువారీ రాజకీయాలతో మాకు సంబంధం లేదు. కానీ, దేశం నీతి–జాతీయ విధానాలకు సంబంధించిన రాజకీయ అంశాలు, పరిణామాలతో మాకు కచ్చితంగా సంబంధం ఉంది. అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడు ఇదే మా విధానం. ఇప్పుడు మేం, మాకున్న సంస్థాగత నిర్మాణం ద్వారా, మా బలాన్ని తగినంతగా పెంచుకున్నాం. ఆ బలాన్ని జాతీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటున్నాం. ఇందులో ఎలాంటి అనుమానం లేదు. మేం కచ్చితంగా మా బలాన్ని జాతి ప్రయోజనాల కోసం వినియోగించుకుంటాం.

గతంలో మా స్వయంసేవకులు అధికార పదవుల్లో లేరు. ఇప్పుడున్నారు. అప్పటికీ ఇప్పటికీ అదొక్కటే వ్యత్యాసం. అయితే కొందరు వ్యక్తులు ఒక విషయం మరిచిపోతున్నారు. ఇప్పుడు కొందరు స్వయంసేవకులు, ఒక రాజకీయపార్టీ ద్వారా రాజకీయ పదవులను అధిష్టించారు. అయినా సంఘ్ సమాజం కోసం వ్యక్తి నిర్మాణ కార్యక్రమాన్ని కొన సాగిస్తూనే ఉంటుంది. అయితే స్వయంసేవకులు రాజకీయాల్లో చేసే పనులకు సంఘ్ బాధ్యత వహించవలసి వస్తుంది. నిజానికి, ఎవరూ మమ్మల్ని నేరుగా బాధ్యులను చేయరు కానీ, స్వయంసేవకులు శిక్షణ పొందేది సంఘ్‌లోనే కాబట్టి మాపై కచ్చితంగా కొంత బాధ్యత ఉంటుంది. కాబట్టి రాజకీయాలతో మా సంబంధాలు ఎలా ఉండాలి, మనం (జాతీయ ప్రయోజనాల దృష్ట్యా) ఏ ఏ అంశాల పరిష్కారంపై శ్రద్ధ పెట్టాలి అనే విషయంలో ఆలోచించవలసి వస్తుంది. ఉదాహరణకు, సంఘ్ కార్యక్రమాలను వివరించేందుకు ఇటీవల వ్యాపారులతో సమావేశం జరిగింది. సమావేశం చివర్లో ప్రశ్నోత్తరాలకు సమయం కేటాయించారు. సమావేశంలో పాల్గొన్న వారు సంఘ్ కార్యక్రమాల వివరాలను చక్కగా విన్నారు. చక్కగా అర్థం చేసుకున్నారు. కానీ, చివర్లో ప్రశ్నోత్తరాల సమయంలో ఆదాయ పన్ను గురించి, జీఎస్టీ గురించి, సులభ వ్యాపార పద్ధతుల గురించి ప్రశ్నించారు. ప్రభుత్వం, ప్రభుత్వ విధానాలు, వ్యాపారం, వాణిజ్యాలకు సంబంధించిన ప్రశ్నలే అడిగారు. అలా వారు అడిగినప్పుడల్లా అది మా పని కాదని చెపుతూ వచ్చాను. అందుకే నేను ఇది ఒక పక్క విధానానికి సంబంధించిన విషయం, మరోవైపు విధానాలను రూపొందించి అమలుచేసే వారి ఆలోచన ధోరణి (మైండ్‌సెట్)కు సంబంధించిన విషయమని పదే పదే చెప్పాను. అయినా వారు అవే ప్రశ్నలు మళ్లీ మళ్లీ అడిగారు. దీంతో మీ సమస్యలను సంబంధిత వ్యక్తుల దృష్టికి తీసుకు వెళ్తామని చెప్పక తప్పని పరిస్థితి వచ్చింది. రాజకీయ పరిణామాల గురించి మేం చెప్పేది ఒక్కటే. ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను మా దృష్టికి తీసుకువస్తే మేం అ సమస్యను సంబంధిత వ్యక్తుల దృష్టికి తీసుకు వెళతాం. గతంలో స్వయంసేవకులు అధికార పదవుల్లో లేని సందర్భాలలోనూ ఇతరుల సలహాలు తీసుకునేవారు ఉన్నారు. భవిష్యత్‌లో కూడా అలాంటి వారుంటారు. ప్రజా సమస్యలతో మేం అలాంటి వారిని కలుస్తూనే ఉంటాం. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రణబ్ ముఖర్జీ ఆర్థికమంత్రిగా ఉన్నారు. నేపాల్ వ్యవహారాలను కూడా వారే చూస్తున్నారు. ఆ సందర్భంలో మేం మా ఆలోచనలు, ఆందోళనను వారి దృష్టికి తీసుకు వెళ్లినప్పుడు, వారు మా మాట విన్నారు. మేం చేసేది అదే. క్రియాశీల రాజకీయాలలో అంతకుమించి మా ప్రమేయం, పాత్ర ఉండదు.

మా ప్రయాణంలో ఎక్కడా మా గమ్యం పక్కదారి పట్టిపోకుండా, గమ్యం చేరేవరకు మూలధాతువు (సారం) నిలుపుకుంటామనే భరోసా/విశ్వాసం ఇవ్వవలసి ఉంటుంది. ఈ లక్ష్యాల దృక్కోణంలో చూసినప్పుడు, సంపూర్ణ సానుకూల పరిస్థితులున్న ప్రస్తుత కాలం చాలా కష్ట కాలం. మేం ఈ పరిస్థితిని వేగంగా దాటవలసి ఉంటుంది. ఇదీ మా ముందున్న సవాలు.

**గత కొన్ని సంవత్సరాలుగా హిందూ సమాజం గళం గట్టిగా వినిపిస్తోంది. హిందూ విశ్వాసాలు, విలువలు, ఆదర్శాలు, చిహ్నాల గురించి హిందూ సమాజం గట్టిగా మాట్లాడుతోంది. కొన్ని సందర్భాలలో దూకుడు చూపుతోంది. మరోవైపు సంఘ్ వెనకటి దూకుడును వదిలేసిందా? అన్న అనుమానాలు సోషల్ మీడియాలో తరచూ వినిపిస్తున్నాయి. మీరు ఈ మార్పును ఎలా చూస్తారు? ఈ మార్పుకు సంఘ్‌లో వచ్చిన పరివర్తన కారణమా, లేక సమాజంలో వచ్చిన మార్పు దృష్ట్యా సంఘ్ తన పాత్రను వ్యూహాత్మకంగా మార్చుకుందా?**

చూడండి. హిందూ సమాజం వెయ్యేళ్లుగా విదేశీ దురాక్రమణలకు వ్యతిరేకంగా, విదేశీ భావజాల ప్రభావాలకు వ్యతిరేకంగా, విదేశీ కుట్రలకు వ్యతిరేకంగా పోరాటం సాగిస్తోంది. సంఘ్ ఈ పోరాటానికి మద్దతు తెలిపింది. అలాగే కొన్ని సంస్థల దాడులు, కుట్రల గురించి చాలా మంది చాలా మాట్లాడారు. ఈ అన్నిటి కారణంగా హిందూ సమాజం మేల్కొంది. యుద్ధభూమిలో ఉన్నవారు దూకుడుగా ఉండడం సహజం. 'యుధ్యస్వ విగతా–జ్వరః' (భగవద్గీత) శ్లోకంలో చెప్పినట్టుగా కోరికలు, స్వార్థం వదులుకుని, వ్యక్తిగత మానసిక క్షోభను పక్కనపెట్టి పోరాడడం అందరికీ సాధ్యం కాదు. అయినా, సంఘ్ ద్వారా కొందరు వ్యక్తులు సామాజిక చైతన్యం కోసం పనిచేస్తున్నారు. సేవాకార్యక్రమాలను చేపట్టారు. సామాజిక చైతన్య ప్రస్థాన సంప్రదాయం చాలా పురాతనమైనది. మనదేశంపై దండెత్తిన మొట్టమొదటి దురాక్రమణదారు అలెగ్జాండర్ దేశ సరిహద్దుల్లో కాలుపెట్టిన నాడే సామాజిక చైతన్యమనే సంప్రదాయం మొదటి అడుగు వేసింది.

సంప్రదాయ మార్గంలో సామాజిక చైతన్య కార్యాన్ని ఎంచుకున్న వారంతా మరో యుద్ధం గురించి హిందూ సమాజాన్ని హెచ్చరించారని మీరనవచ్చు. దురదృష్టవశాత్తు పొంచి ఉన్న ముప్పు గురించి ఈ వాస్తవం మనలను పూర్తి స్థాయిలో హెచ్చరించలేదు. సన్నద్ధం చేయలేదు. ఈ యుద్ధం బయటి శత్రువు మీద కాదు. మనలో ఉన్న శత్రువుతో చేస్తున్నది. హిందూ సమాజం, ధర్మం, సంస్కృతి పరిరక్షణ కోసం చేస్తున్న యుద్ధం. విదేశీ దురక్రమణ దారులు ఇప్పుడు లేరు. కానీ, విదేశీ ప్రభావం, విదేశీ కుట్రలు ఉన్నాయి. ఇది యుద్ధం. కాబట్టి, కొందరు అత్యుత్సాహం చూపితే చూపవచ్చు. అది అభిలషణీయం కాకపోయినా, కొన్ని సందర్భాలలో ఉద్రేకపూరిత, రెచ్చగొట్టే ప్రకటనలు రావచ్చు. అయితే అదే సమయంలో మాకు సంబంధించిన

**గతంలో మా స్వయంసేవకులు అధికార పదవుల్లో లేరు. ఇప్పుడున్నారు. అప్పటికీ ఇప్పటికీ అదొక్కటే వ్యత్యాసం. అయితే కొందరు వ్యక్తులు ఒక విషయం మరిచిపోతున్నారు. ఇప్పుడు కొందరు స్వయంసేవకులు, ఒక రాజకీయ పార్టీ ద్వారా రాజకీయ పదవులను అధిష్టించారు. అయినా సంఘ్ సమాజం కోసం వ్యక్తి నిర్మాణ కార్యక్రమాన్ని కొన సాగుస్తూనే ఉంటుంది.**



అంతర్గత సమస్యలు కొన్ని ఉన్నాయి. శ్రీరాముడు మన గౌరవానికి ప్రతీక. శ్రీరాముని ఆలయాన్ని తప్పక నిర్మించాలనే లక్ష్యంతో ఆలయ నిర్మాణానికి ఉద్యమం నడిచింది. ఉద్యమంలో ఉన్నవారు జై 'శ్రీరామ్' అని నినదించారు. అలాంటి నినాదాలు సహజంగా ఉత్సాహాన్ని నింపుతాయి. శక్తినిస్తాయి. శ్రీరాముడు జాతి, కులాలకు అతీతంగా అందరినీ ఏకం చేశాడు. అయినా నేటికీ మన దేశంలో కులవ్యవస్థ కొరడా ఝుళిపిస్తూనే ఉంది. ఇది మారదా? హిందూ సమాజాన్ని చైతన్య పరచడమనే సంప్రదాయాన్ని కొనసాగించిన ప్రతి ఒక్కరూ ఈ విషయంపై దృష్టి నిలిపారు. మాట్లాడారు. హిందూ సమాజం నినాదాన్ని స్వాగతించింది, మెచ్చుకుంది. కానీ ఆత్మశుద్ధి సందేశాన్ని మాత్రం స్వాగతించలేదు. హిందూ సమాజం ఇంకా నిజాన్ని, పూర్తిగా ఆకళింపు చేసుకోలేదు. మేల్కొనలేదు. ఇప్పుడు అది జరగాలి, జరుగుతుంది. మనం (ఎవరో ఒకరిపై) ఎప్పుడూ యుద్ధం గురించి మాట్లాడుతూనే ఉంటాం. కానీ, మన పరిస్థితి ఏమిటి? యుద్ధంలో మనం శత్రువు గురించి ఆలోచించాలి, అర్థం చేసుకోవాలి. అలాగే మనం ఎప్పుడు, ఏం చేయాలో కూడా నిర్ణయించుకోవలసి ఉంటుంది.

మీరు ఒక్కసారి చరిత్రను గుర్తు చేసుకుంటే మొగల్ దండయాత్ర తర్వాత, ఛత్రపతి శివాజీ మహరాజ్ చేసిన ప్రయోగమే చిట్టచివరి ప్రయోగం. ఇక అక్కడి నుంచి అదే ప్రయోగం కొనసాగింది. ఆ వ్యూహాన్నే ఇతరులు అనుసరించారు. శివాజీ మహరాజ్ విధానం ఏమిటి? ఆయనకు శత్రువు గురించి తెలుసు, అదే సమయంలో ఆత్మరక్షణ గురించిన జాగ్రత్తలు తీసుకున్నారు. ఆయనకు ఎప్పుడు పోరాడాలో మాత్రమే కాదు ఎప్పుడు వెనకడుగు వేయాలో కూడా తెలుసు. పట్టాభిషేకం తర్వాత, శివాజీ ఇరుగు పొరుగున ఉన్న ముస్లిం రాజవంశాలకు స్నేహ హస్తం అందించారు. శివాజీ గోల్కొండ వెళ్లారు. గోల్కొండ పాలకులు కుతుబ్‌షాహీలతో స్నేహ సంబంధాలు నెలకొల్పారు. అయితే, అందుకు కుతుబ్‌షా మంత్రివర్గంలో ఇద్దరు హిందువులకు స్థానం కల్పించాలని, హిందువులపై జరుగుతున్న దౌర్జన్యాలను తక్షణం ఆపాలనే షరతు విధించారు. కుతుబ్ షా ఆ రెండు షరతులను అంగీకరించారు. అయితే శివాజీ మహరాజ్ మరణం తర్వాత పరిస్థితి మారిపోయింది. అది వేరే కథ. కుతుబ్ షాహీలలోని ఛాందసవాదులు.. హిందూ మంత్రులు ఇద్దరినీ హత్య చేశారు. అయితే, అధికార హోదాలో ఉండి తలపెట్టిన మంచిపనులకు అందరికీ ఆమోదయోగ్యం అవుతాయని శివాజీకి తెలుసు. అందుకే ఆయన ఆ ప్రయోగం చేశారు.

ఇక్కడ మరో విషయం ఏమంటే, హిందూ సమాజం తనను తాను అర్థం చేసుకుంటే సమాజానికి ఎదురవుతున్న సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. కరుడుగట్టిన క్రైస్తవులు ప్రపంచం మొత్తాన్ని క్రైస్తవంలోకి కన్వర్ట్ చేస్తామని అంటారు. మత మార్పిడికి అంగీకరించని వారు బతికితే తమ దయాదాక్షిణ్యాలపై ఆధారపడి బతకాలి లేదా నశిస్తారని అంటారు. స్వేచ్ఛను ఎంతమాత్రం సహించని, అబ్రహమిక్ ఐడియాలజీని ఆచరించే ఛాందసవాద ముస్లింలు, విశ్వాసకులు, కమ్యూనిస్టులు, నల్ల పెట్టుబడిదారీ విధానాన్ని ఆచరించే అందరిదీ ఇదే ధోరణి. ఇతరులు అందరూ మరో మార్గం ఏదీ లేదన్నట్లుగా తమ మార్గంలోకే రావాలని అంటారు. మీరు కాదన్నారంటే, మా దయా దాక్షిణ్యాలపై బతకడమా? చావడమా అనేది మీరే తేల్చుకోవలసి ఉంటుంది. మేము నిన్ను నాశనం చేస్తాం. అంటారు.

మరి హిందూ దృక్పథం ఏమిటి? ఏ హిందువు అయినా ప్రతి ఒక్కరు తమ విశ్వాసాలనే ఆమోదించాలని ఎప్పుడైనా అన్నారా? అంటారా? అది మన ఆలోచన విధానం కాదు. మనం ఇతరులకు చూపేందుకు ఒక ఉదాహరణ ఉంచుతాం. అందరితో చర్చ జరగాలని కోరుకుంటాం. పురోగతి సాధించాలనుకునేవారు మన ఉదాహరణ పాటిస్తారు. కాదనుకున్నా మనం వారికి హాని తలపెట్టం. కానీ అదే సమయంలో ఇతరులు మనకు హాని తలపెట్టకుండా మన జాగ్రత్తలో మనం ఉండాలి. ఈ యుద్ధాలలో మనం తగినంత శక్తిని పుంజుకున్నాం. ఇక వారు మనకు హాని తలపెట్టరు. మన రాజకీయ స్వాతంత్ర్యాన్ని భగ్నం చేయగల సామర్థ్యం ఎవరికీ లేదు. ఇది విస్పష్టం. హిందువులు ఈ దేశంలోనే ఉంటారు. మరో దేశంలో ఆశ్రయం కోరే అవసరం లేదు. ఇప్పుడు ఈ దేశంలో హిందువులు చాలా అప్రమత్తంగా ఉన్నారు.

ఈ అవకాశాన్ని వినియోగించుకుని మనం మన అంతర్గత విభేదాలను పరిష్కరించుకోవడంతో పాటుగా, ఇతరుల సమస్యలకు పరిష్కారాలు చూపేందుకు కూడా ఇప్పుడు అవకాశం ఏర్పడింది. ఇప్పుడు మనం ఒక బలమైన శక్తిగా ఉన్నాం, కాబట్టి మనం తప్పక మన శక్తిని సద్వినియోగం చేసుకోవలసి ఉంటుంది. ఇప్పుడు కాకుంటే, రానున్న 50 సంవత్సరాలలో లక్ష్యాన్ని సాధించేందుకు ఇప్పుడే, ఈరోజే మొదలవ్వాలి. చైనా ప్రస్తుత ప్రాధాన్యతకు 1948లో తొలి అడుగు పడింది. ప్రణాళిక అప్పుడే సిద్ధమైంది. అప్పటి నుంచి వారు అదే మార్గంలో ప్రయాణిస్తున్నారు. మనం తగినంత శక్తిని కూడదీసుకున్నప్పుడు మన భవిష్యత్ ప్రాధాన్యతల విషయంలో మనకు స్పష్టత ఏర్పడుతుంది. నిత్యం పోరాట భావన వలన మనకు ఎలాంటి ప్రయోజనం చేకూరదు. దేశం విషయంలో అలా కాదు. అలా జరగదు. అలాగే, పోరాడితే అన్నీ సాధిస్తారని అనుకోవడం కూడా పొరపాటే అవుతుంది. ఇటలీ పోరాటానికి గారిబాల్డి సారథ్యం వహించారు. కానీ, యుద్ధం ఆగిపోయిన తర్వాత ఆయన సారథ్య బాధ్యతలు ఇతరులు తీసుకోవాలని కోరుకున్నారు. చివరకు చక్రవర్తిని ఎన్నుకోవలసిన సమయం వచ్చినప్పుడు, గారిబాల్డి బాధ్యతలు తీసుకునేందుకు నిరాకరించారు. ఆ బాధ్యతను వేరొకరు తీసుకోవాలని అన్నారు. ఇటలీ ప్రగతి ప్రస్థానంలో ముగ్గురు వ్యక్తులు ప్రముఖంగా కనిపిస్తారు. గారిబాల్డి యుద్ధభూమిలో సారథ్యం వహించారు. అయితే, చివరకు ఆయన అది (పరిపాలన) తన పనికాదని తప్పుకున్నారు. అదేవిధంగా మనం కూడా పరిస్థితులను బట్టి లక్ష్యం మారకుండా, భాష, భావన, పద్ధతులను మార్చుకోవలసి ఉంటుంది. హిందుస్తాన్, హిందూరాష్ట్రం. శక్తివంతమైన హిందూ సమాజం–హిందూ రాష్ట్ర–భారత్ కీర్తి శిఖరాలను చేరుకుంటుంది. ప్రపంచానికి నాయకత్వం వహిస్తుంది. ఈ లక్ష్యం చేరుకోవడంలో ఎక్కువ తక్కువలు, లోపాలు ఉంటే, వాటిని అధిగమించడం ఎలా? అవసరం అయితే, మనకు మనంగా యుద్ధాన్ని ఎంచుకుంటాం. అంతేకానీ, ఎవరో సవాలు చేశారని మనం మన వ్యూహాలను మార్చుకోరాదు. మనం యుద్ధాలను మన పద్ధతిలో, మన ప్రణాళిక ప్రకారం చేస్తాం. హిందూ సమాజం ఈ విధంగా ఆలోచించాలి.

**ప్రజలు సంఘ్‌ను ఒక సాంస్కృతిక సంస్థ**




**హిందూ సమాజం తనను తాను అర్థం చేసుకుంటే సమాజానికి ఎదురవుతున్న సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. కరుడుగట్టిన క్రైస్తవులు ప్రపంచం మొత్తాన్ని క్రైస్తవంలోకి కన్వర్ట్ చేస్తామని అంటారు. మత మార్పిడికి అంగీకరించని వారు బతికితే తమ దయాదాక్షిణ్యాలపై ఆధారపడి బతకాలి లేదా నశిస్తారని అంటారు. స్వేచ్ఛను ఎంతమాత్రం సహించని, అబ్రహమిక్ ఐడియాలజీని ఆచరించే ఛాందసవాద ముస్లింలు, విశ్వాసకులు, కమ్యూనిస్టులు, నల్ల పెట్టుబడిదారీ విధానాన్ని ఆచరించే అందరిదీ ఇదే ధోరణి.**

**అంటారు. సుదీర్ఘప్రయాణం చేయాలనుకునే వారు, తమ ప్రాధాన్యతలను సక్రమంగా నిర్దేశించుకోవాలని, రోడ్ మ్యాప్ రూపొందించుకోవాలని మీరంటున్నారు. సంఘ్ సాంస్కృతిక సంస్థ కాబట్టి, సాంకేతిక విజ్ఞానం (టెక్నాలజీ), పర్యావరణం, లింగ (జెండర్) సంబంధ సమస్యల వంటి సమకాలీన చర్చనీయాంశాలపై మీ స్పందన ఏమిటి? ఈ అంశాల విషయంలో సంఘ్ ఆలోచన ఏమిటి?**

ఇంతవరకు ప్రపంచం పాశ్చాత్య దేశాల ఆధిపత్యంలో ఉంది. కాబట్టి, అనేక విషయాల్లో వారు ముందున్నారు. వారే నాయకత్వం అందిస్తున్నారు. చర్చను వారే నిర్దేశిస్తున్నారు. పరిష్కారాలు కనుగొంటున్నారు. అందరూ అదే ఆచరించాలని చెపుతున్నారు. మనతో సహా ప్రపంచం అంతా వారినే అనుసరిస్తోంది. అయితే ఇప్పుడున్న పరిస్థితి ఏమిటి? ఆ దేశాల నాయకత్వం విఫలమైంది. మనల్ని విఫలం చేసింది. ఆ దేశాలు వారి వైఫల్యాలను అంగీకరించి, ఆలోచించి పరిష్కారాల కోసం ఎక్కడికి చేరారు? పర్యావరణం విషయాన్నే తీసుకుంటే ప్రపంచం భారతీయ ఆలోచనల వైపు, హిందూ ఆలోచనల వైపు చూస్తోంది. అలాగే లింగ, మహిళల సమస్య విషయానికి వస్తే చాలా కాలంగా మహిళా విముక్తి, మహిళల సాధికారిత మొదలైన నినాదాలు వినిపిస్తున్నాయి. అయితే ముందడుగు వేసిన పాశ్చాత్య మహిళలు ఇప్పుడు కుటుంబ జీవితం అవసరాన్ని గుర్తించి, లింగ సమానత్వం దగ్గరకు తిరిగొస్తున్నారు. మరోలా చెప్పాలంటే హిందూ భావనకు దగ్గరవుతున్నారు. అలాగే టెక్నాలజీ, టెక్నాలజీ రహిత, నైతిక విలువలతో కూడిన టెక్నాలజీ, నియంత్రిత రహిత టెక్నాలజీ, మానవ వైఖరితో టెక్నాలజీ.. ఇలా టెక్నాలజీ చుట్టూ చాల చర్చ జరుగుతోంది. అయితే టెక్నాలజీనే సర్వస్వం కాదు. ఇలాంటి సాంకేతిక ఆవిష్కరణలు అనేకం వస్తూనే ఉంటాయి. ప్రపంచం ముందుకు సాగుతూనే ఉంటుంది. జీవితాన్ని సమూలంగా అర్థం చేసుకున్నవారు మాత్రమే ఈ ప్రశ్నలకు సమాధానం ఇవ్వగలరు. భారతీయ జీవన విధానం జీవితాన్ని సంపూర్ణంగా, సమూలంగా, సమగ్రంగా అర్థం చేసుకుంటుంది. వ్యక్తులను ఎవరికి వారు, ప్రత్యేక కుటుంబంగా చూసే పాశ్చాత్య ఆలోచన ధోరణిలోని కొన్ని లింగ సంబంధ అంశాలకు కూడా భారతీయ ఆలోచన విధానం పరిష్కారం చూపింది. పాశ్చాత్య ఆలోచన ధోరణి దేనికదిగా, విడివిడిగా, ముక్కలు ముక్కలుగా అతుకుల బొంతలా సాగుతుందని భారత్‌కు తెలుసు. అలాగే, ఆ అతుకులను ఎలా కలపాలో కూడా భారత్‌కు తెలుసు.

ఈరోజు సాధారణ చర్చలో మార్పు చోటు చేసుకుంటోంది. భారతీయ ఆలోచనలకు దగ్గరవుతోంది. భారతీయ ఆలోచనలకు ప్రపంచ ఆమోదం



**ఈ రోజు సాధారణ చర్చలో మార్పు చోటు చేసుకుంటోంది. భారతీయ ఆలోచనలకు దగ్గరవు తోంది. భారతీయ ఆలోచనలకు ప్రపంచ ఆమోదం లభించకముందు నుంచీ కూడా మేం భారతీయ ఆలోచనలు, భారతీయ చర్చకు ప్రాధాన్యం ఇస్తున్నాం. టాగూర్, గాంధీజీ, వివేకానంద, దయానంద సరస్వతి వారి నుంచి స్ఫూర్తిని పొంది, వారి అలోచనల వెంట మేం ముందుకు సాగుతున్నాం. ఆధునిక పాశ్చాత్య ఆలోచనలో కూడా ఇదే తరహా ఆలోచనలు కొనసాగుతున్నాయి.**

లభించకముందు నుంచీ కూడా మేం భారతీయ ఆలోచనలు, భారతీయ చర్చకు ప్రాధాన్యం ఇస్తున్నాం. టాగూర్, గాంధీజీ, వివేకానంద, దయానంద సరస్వతి వారి నుంచి స్ఫూర్తిని పొంది, వారి అలోచనల వెంట మేం ముందుకు సాగుతున్నాం. ఆధునిక పాశ్చాత్య ఆలోచనలో కూడా ఇదే తరహా ఆలోచనలు కొనసాగుతున్నాయి. మనం వాటిని కూడా అధ్యయనం చేయవలసిన అవసరం ఉంది. సంఘ్‌కు ఈ విషయంలో ఎలాంటి భిన్నాభిప్రాయం లేదు. టెక్నాలజీకి సంబంధించినంత వరకు అది మానవాళికి సేవ చేయాలి. అదే సంఘ్ భావన. ఉదాహరణకు ఇప్పుడు మనకు కృత్రిమ మేధస్సు అందుబాటులో ఉంది. అయితే, నియంత్రణ లేకపోతే యంత్రాలు మనపై స్వారీచేసే రోజులు వస్తాయని ప్రజలు అనుమానిస్తున్నారు. ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంలో సంఘ్‌కు వేరే అభిప్రాయం లేదు. ఈ ప్రశ్నలకు హిందూ (ఆలోచన) సంప్రదాయాలు ఇప్పటికే స్పందించాయి. అలాగే ఎల్జీబీటీ, ట్రాన్స్‌జెండర్ (హిజ్రాల) అంశాలకు సంబంధించి చాలా తరచుగా ఒక చిన్న ప్రశ్న వినిపిస్తుంది. నయా వామపక్ష మేధావులు భుజానికి ఎత్తుకున్న విషయం కావడంతో ఆ చిన్న ప్రశ్న పరిధిని దాటి ప్రకంపనలు సృష్టిస్తుంది. అయితే ఇవేవీ కొత్తగా ఇప్పుడే పుట్టుకొచ్చిన సమస్యలు కాదు. ఎప్పుడూ ఉన్నవే. ట్రాన్స్‌జెండర్‌కు కూడా అందరిలానే జీవించే హక్కుంది. పెద్దగా గందరగోళం లేకుండా మానవీయ కోణంలో ఆలోచించి వారూ మనుషులే. వారికీ జీవించే హక్కుందనే భావాన్ని మనసులో నిలుపుకుని, వారికి సామాజిక ఆమోదం తెలిపే పరిష్కారాన్ని కనుగొన్నాం. ట్రాన్స్‌జెండర్ సమాజం ఉంది. మేం దీనిని సమస్యగా చూడడం లేదు. వారికి వారి దేవీ దేవతలున్నారు. ఇప్పుడు వారికి ప్రత్యేకంగా మహామండలేశ్వర్ ఉంది. కుంభ మేళ సమయంలో వారికి ప్రత్యేక స్థానం కల్పిస్తారు. వారు మన నిత్య జీవితంలో భాగం. మన ఇంట్లో పిల్లో పాపో పుట్టినప్పుడు, వారు మనింటికొచ్చి పాటలు పాడుతారు. వారికి ప్రత్యేక జీవన స్థావరం ఉన్నా ప్రధాన స్రవంతిలో వారూ భాగస్వాములే. మేం ఈ ఏర్పాటు గురించి ఎప్పుడు గొప్పగా చెప్పుకోలేదు. అంతర్జాతీయ స్థాయి చర్చగా మార్చలేదు.

ఎల్జీబీటీ సమస్య కూడా అంతే. జరాసంధునికి ఇద్దరు సైన్యాధికారులు (జనరల్స్) ఉన్నారు. హంస, డింభక. డింభకుడు మరణించాడని కృష్ణుడు ప్రచారం చేయడంతో హంస ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ విధంగా శ్రీకృష్ణుడు ఇద్దరు సైన్యాధికారులను తొలిగించారు. ఆలోచిస్తే ఈ కథ ఇచ్చే సందేశం ఏమిటి? ఆ ఇద్దరు సైన్యాధికారులకు ఆ విధమైన సంబంధం ఉంది. అంటే, ఇలాంటి వారు మన దేశంలో ముందు లేరని అనుకోవడం తప్పు. ఉన్నారు. మానవాళి ఉన్నంత వరకు అలాంటి లక్షణాలున్న వారు ఉంటారు. ఒక పశు వైద్యునిగా నాకు తెలుసు. మనుషుల్లోనే కాదు, పశువుల్లోను అలాంటి లక్షణాలు ఉన్న పశువులు ఉంటాయి. ఇదొక జీవ సంబంధమైన విషయం. ఒక జీవిత విధానం. అందుకే వారికి ప్రత్యేక స్థానం అవసరం. అలాగే, వారిలో తాము కూడా ఈ సమాజంలో భాగమనే భావన అవసరం. ఇది చాలా చిన్న విషయం. ఈ సమస్య పరిష్కారం కోసం ఇంతవరకు జరిగిన ప్రయత్నాలు ఏవీ ఫలించలేదు. అందుకే, ఈ ఆలోచనకు ప్రాచుర్యం కల్పించవలసిన అవసరం ఉంది. అందుకే ఇలాంటి విషయాల్లో సంఘ్ సంప్రదాయాల విజ్ఞతపై ఆధారపడుతుంది.

**(మిగతా వచ్చేవారం)**

**అను: రాజనాల బాలకృష్ణ**

కథ

గొప్ప ప్రారంభోత్సవం!

కనీవినీ ఎరుగని రీతిలో ప్రఖ్యాత సినీతారలు, గొప్ప నాయకులూ విచ్చేస్తున్నారట! మరో రెండ్రోజుల్లోనే అంగరంగ వైభవంగా ప్రారంభోత్సవం జరుగుతుందట!!

ఎక్కడ చూసినా, ఎవరి నోట విన్నా ఇదే మాట. చిలవలు పలవలుగా ఆ నోటా ఈనోటా ఈ వార్త ఊరంతా పాకింది. శుభ ఘడియ కోసం అందరూ ఆతృతతో ఎదురు చూస్తున్నారు. తమ తమ అభిమాన తారలతో కలసి ఫొటోలు దిగాలన్న ఉద్దేశ్యాన్ని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.

ఇంతకూ ప్రారంభోత్సవం దేనికంటే… అదొక మల్టీప్లెక్స్!

గొప్ప సినీతారలూ, ప్రముఖ రాజకీయ నాయకులూ, మంత్రివర్యులందరికీ ఆహ్వాన పత్రిక లందాయట. ఐతే మల్టిప్లెక్స్‌కు ప్రారంభోత్సవం చేసేదెవరన్నది తెలియరాలేదు.

అనుకున్న తేదీకి భవన సముదాయం సర్వాంగ సుందరంగా తయారైంది. భవనం ముఖద్వారానికి రిబ్బన్ కట్టి సిద్ధంగా ఉంచారు.

లోపలికి వెళ్తే అదొక బహుళ అంతస్తుల సముదాయం. అనేక దుకాణాల సమాహారం. అనేకరకాల వస్తువులు ఒకే గొడుగు కింద విక్రయానికి దొరుకుతాయి. గుండుసూది మొదలుకొని కాసులపేరు వరకూ, కర్చీఫ్ నుంచి కంచిపట్టు చీర వరకూ, కరివేపాకు నుంచి గుమ్మడికాయ వరకూ, కిలోల్లెక్కన చిత్తు కాగితాలు మొదలుకొని అపురూపమైన సుప్రసిద్ధ గ్రంథాల వరకూ, కొండపల్లి బొమ్మ నుంచి కోట్లు ఖరీదు చేసే శిల్పాల వరకూ…! ఇలా చెప్పుకుంటూ పోతే ఆ చిట్టాకు అంతే ఉండదు.

వీటన్నింటికీ తోడు ఆ ప్రాంగణంలోనే రెండు సినిమా థియేటర్లున్నాయి. ఒకటి మినీ, మరొకటి మాక్సీ (అంటే పెద్దదన్నమాట, ఐమాక్స్ తరహాలో అనుకోండి).

ఆ భవనం లోపలి దుకాణాలన్నీ ఆయా సామాన్లతో నిండి ఉన్నాయి. థియేటర్లు కూడా కొత్తగా రిలీజైన సినిమాలతో సిద్ధంగా ఉన్నాయి.

ఎప్పటిలాగే ఆ రెండ్రోజుల ముందుగానే ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తూ, వచ్చేపోయే వారి తిట్లు శాపనార్థాలను ఆశీర్వాదాలుగా భావిస్తూ, భవనానికి బయటే రోడ్డంతా కవర్ చేస్తూ పెద్ద షామియానా వేశారు. చెవులు చిల్లులు పడేలా మైక్ సెట్టొకటి కట్టి ఫుల్ వాల్యూమ్‌లో ఈ తరం గానాబజానా పాటలు మోత మోగిస్తున్నారు. అక్కడి వాతావరణం పల్లెటూరు తిరునాళ్లలా ఉంది.

భవన సముదాయానికి స్వంతదారు పదహారణాల తెలుగుతనం ఉట్టిపడేలా పంచెకట్టులో హుందాగా ముఖద్వార వద్ద వీఐపీలను స్వాగతించేందుకు సిద్ధంగా ఉన్నాడు.

అతని ముఖంలో ఏదో ఇబ్బంది గోచరిస్తున్నా సంతోషాన్ని పులుముకుని హుందాతనాన్ని అరువు తెచ్చుకున్నట్లు కనిపిస్తోంది. అతని తమ్ముడు కాబోలు, అడ్డదిడ్డంగా పరుగులు తీస్తూ అందరినీ అదిలిస్తూ పనివాళ్లను పరుగులు తీయిస్తు న్నాడు. యజమాని తన తమ్ముడి వైపు అప్పుడప్పుడూ ఓరకంటితో చూస్తూ అంతలోనే కొద్దిగా నొసలు చిట్లిస్తూ, పెదాలు కదిలిస్తూ నానా ఇబ్బంది పడుతున్నాడు.

ఇంతలో బయట కలకలం! కారణం… కుర్ర సినీ హీరోహీరోయిన్‌లు విచ్చేశారు. వాళ్లేదో సినిమాలో మొదటిసారి హీరో హీరోయిన్లుగా పరిచయమ య్యారుట.

వెంటనే తమ్ముడి అనుచరగణం ఒక్క గెంతులో వాళ్లను చేరుకుని వారి కోసం ప్రత్యేకించిన సీట్ల వద్దకు తోడ్కొని వెళ్లి కూర్చోబెట్టారు. ఆ వెంటనే అక్కడ యూనిఫామ్‌లో ఉన్న పని కుర్రాళ్లు చిరుతిళ్లు, కూల్ డ్రింకులు హాట్ డ్రింకులతో తుఫానులా దూసుకొచ్చి వాళ్లముందు నిలబడి ఒకళ్లను మించి మరొకరు 'అతిథి మర్యాదలకు పూనుకొన్నారు.

'మీరు ఇబ్బంది పడితే నాకేంటి నష్టం' అన్నట్టుగా దాదాపుగా హీరో హీరోయిన్ల మీద పడిపోయారు. తమ చేతిలో ఉన్న కేకును దాదాపుగా నోట్లో కుక్కేసినంతగా, కూల్ డ్రింక్స్, కాఫీలను చిన్నపిల్లలను కాళ్లమీద అడ్డంగా పడేసుకుని ఆముదం తాగించినట్టు నోరు పగలదీసి పోసేందుకే సిద్ధమై పోయారు.

ఉన్నంతలో హీరో పరిస్థితి కాస్త నయం. అది సహజమే. ఎందుకంటే హీరో కన్నా హీరోయిన్ కే క్రేజ్ ఎక్కువ. తేనె పట్టును ముసురుకున్న తేనెటీగల్లా, చెరుకు పిప్పిని ముసురుకున్న ఈగల్లా, చక్కెరపాకం చుట్టూ చేరిన గండు చీమల్లా, కొత్త సినిమా రిలీజ్ రోజున థియేటర్ ముందు గుమిగూడిన జనంలా, ఉదయం తొమ్మిది గంటలకు వెళ్లే సిటీ బస్సులోని తలుపు వద్ద వేలాడే ప్రయాణికుల్లా, ఉదయం ఆఫీసు సమయాల్లో ట్రాఫిక్ సిగ్నల్ వద్ద వాహనాల గుంపులా… ఇలా అనేక విధాలుగా వర్ణించవచ్చు ఆమె పరిస్థితిని. కుర్ర హీరోహీరోయిన్లు కావడాన కుర్రకారు క్రేజ్!

ఇంతలో మళ్లీ కలకలం! బడా హీరో ఎవరో వచ్చారట!

సుమారుగానే పాపులారిటీ ఉన్న హీరో కావడంతో క్షణాల మీద కొత్తవాళ్లను వదిలేసి అటువైపు లంఘించారు అందరూ. అన్ని కెమెరాలూ అటువైపు మళ్లాయి.

కొత్త హీరోహీరోయిన్ల పరిస్థితి థియేటర్లో ఫ్లాప్ సినిమా ఆఖరి ఆటలా, క్రికెట్ మ్యాచ్ ముగిసి తరువాత స్టేడియంలా అయింది.

అక్కడికి వచ్చిన ఆ ఓ మోస్తరు బడా హీరో పరిస్థితి కూడా దాదాపుగా తేనె తుట్టిలాగే ఉంది. ప్రస్తుతానికి పరిచారకులు తమకు చేతనైనంతలో చేతనైన అన్ని విధాలా ఇబ్బంది పెట్టేస్తున్నారు. నవ్వలేక, ఏడవలేక, వద్దనలేక, వారించలేక,








కూర్చోలేక, నిలబడలేక ఇలా అనేక ‘లేక’లతో సతమతమయ్యాడు హీరో. ఈ ‘లేక’లన్నీ భరించలేక పోతే ఈనాడు అతను ఈ స్థితిలో ఉండేవాడు కాడేమో!

ఇంకాస్సేపటికి మరో కల్లోలం! ఎందుకంటే ప్రముఖ హీరోయిన్ వచ్చేసింది.

వేసవి కాలంలో ఒకచోటి నుంచి మరోచోటికి, ఖండాంతరాలకు వలసపోయే పక్షుల గుంపులా, పక్షితీర్థంలో వచ్చివాలే పక్షుల్లా, మొత్తంగా ఆమె వైపు మళ్లారు జనమంతా. ఈ మధ్యన సేవకుల, పరిచార కుల అవస్థ వర్ణనాతీతం. పద్మవ్యూహం లోనికి జొరబడే అభిమన్యుడిలా తమ చేతిలోని ట్రేలు డాలుగా భావించి జనాన్ని ఛేదించుకుని లోపలికి జొరబడుతున్నారు.

ప్రముఖ హీరోయిన్ తెలుగమ్మాయే ఐనా తెలుగు

# ప్రారంభోత్సవం

## ఎస్. ఘటికాచలరావు



మాట్లాడేందుకు తెగులు పట్టి “యూ నో, ఐ డోనో టెల్గూ దట్ మచ్. కొంతకొంత మాట్లాడుతను” అంటూ కొంకర్లు పోయింది.

ఈలోగా మళ్లీ మరో కలకలం. మరో పే...ద్ద హీరోహీరోయిన్ ఒకేసారి జంటగానే వచ్చేశారు. అదేదో సినిమాలో జంటగానే నటిస్తున్నారట మరి!

దాంతో పెద్దపెద్ద హీరోయిన్‌ను వదిలి పే...ద్ద హీరోయిన్ వద్ద వాలిపోయారందరూ పుష్కరిణిలో బొరుగులు, పేలాలూ, తినుబండారాలు చల్లితే ముసురుకునే చేపపిల్లల్లా!

భవన సముదాయం యజమాని కాస్త కాకుండా చాలా ఇబ్బందిగా చూస్తున్నాడు. అతని పేరు గజపతి. మాటిమాటికీ చేతి గడియారం వంక చూసుకుంటూ ఇబ్బందిగా కదులుతున్నాడు. ముహూర్తం మించి పోతుందన్న ఆందోళన అతన్ని స్థిమితంగా ఉండనివ్వడం లేదు.

ఇలా సినీజన ప్రహసనం ముగుస్తూండగా మరికాస్సేపటికి హఠాత్తుగా “పేదలపాలిటి పెన్నిధి పెద్దన్న గారికి జిందాబాద్” అంటూ అరిచారు. ఎవరో లోకల్ నాయకుడి ఆగమనం! అదీ ఆ సంబరం!

ఓమూలగా పిట్ట గోడమీద కూర్చుని ఈ తతంగాన్నంతా చోద్యంగా చూస్తున్నాడో ఆర్కే లక్ష్మణ్ కార్టూన్ లోని సామాన్యుడిలాంటి సామాన్యుడు. ‘పేదల పెన్నిధా? పెరట్లో గుప్తనిధా? ఎవడికి తెలుసు లోగుట్టు?’ అది ఆ సామాన్యుడి సణుగుడు!

హఠాత్తుగా అక్కడి రంగుల వాతావరణం రాజకీయరంగు పులుముకుంది. ఆ షామియానా కింద అంత క్రితం కాస్త పులుముకున్న రాజకీయ రంగు ఇప్పుడు పూర్తిగా అలుముకుంది. మరి కాస్సేపటికి స్టేట్ లెవెల్ నాయకుడొకరు విచ్చేశారు. ఆ వ్యక్తి పెద్ద హీరోలకు బాగా పరిచయం. దాంతో సినిమారంగు రాజకీయరంగు పాలు నీళ్ళల్లా కలిసిపోయాయి.

గజపతికి సహనం అంతకంతకూ చచ్చి పోతూంది. ఇందరు వస్తున్నా అసలు రావల్సిన వ్యక్తి ఇంకా రాలేదు. సరిగ్గా ఇక అరగంటే ఉంది ముహూర్తానికి. అతను వచ్చిన తరువాత పూజా



కార్యక్రమాలకు ఎరేంజ్మెంట్స్ పేరిట ఎంతలేదన్నా ఓ పావుగంట మింగేస్తాడు పురోహితుడు. అసలింత వరకూ ఆ పురోహితుడే పత్తాలేదు.

ప్రారంభోత్సవానికి వచ్చే ముఖ్య అతిథి స్థానికంగానే కాక ఢిల్లీ లెవెల్లో మంచి పలుకుబడి ఉన్న వ్యక్తిట. అందుకే అతని తమ్ముడి భవిష్యత్తు దృష్టిలో ఉంచుకుని అతని సిఫార్సు మేరకే నాయకుణ్ణి పిలిపిద్దామని ఎరేంజ్ చేశాడు. ఆ విషయం అక్కడెవరికీ ఇంకా తెలియదు. రాజకీయంగా ఎదగాలని తెగ ఉబలాట పడిపోతున్న తమ్ముడికి ఆసరాగా ఉంటుందిలే అన్న ఒక సాఫ్ట్ కార్నర్ వల్ల ఒప్పుకోవాల్సి వచ్చింది.

ప్రారంభోత్సవం చేసే వ్యక్తి ఓ ప్రముఖ నాయకుడన్న వార్త హఠాత్తుగా బయటికి పొక్కింది. ‘అతను మంత్రి కాదూ, సినీ తారా కాదు. స్థానికం గానే కాక ఢిల్లీ లెవెల్లో బలమున్న నేతట!’ అంటూ గుసగుసలాడారు.

సరిగ్గా పదోనిముషంలో ఆ వ్యక్తి వచ్చాడు. విశేషమేమిటంటే పురోహితుడు కూడా అతనితో బాటే కార్లోంచి దిగాడు. మళ్లీ ఎప్పటిలాగే అంతకు ముందున్న వాళ్లందరినీ వదిలి ఇతని చుట్టూ మూగారు ఫోటోగ్రాఫర్లు.

గజపతి కొద్దిగా అసహనంతో ఉన్నాడన్నది గ్రహించిన అతని తమ్ముడు అతన్ని శాంతించమని ముక్కూ మూతీ మెలేసుకున్నాడు.

ఎట్టకేలకు పురోహితుడు పూజా కార్యక్రమం ప్రారంభించాడు.

“శుభాభ్యాం, శుభే శోభన ముహూర్తే...” అంటూ గట్టిగా ప్రారంభించాడు. అక్కడ గుంపులో ఎవరికో సందేహం “శోభన ముహూర్తమంటాడే? ముహూర్తం పెట్టింది శోభనానికా, ప్రారంభోత్సవానికా? ఇక్కడ శోభనం జరుపుతారా? ఎవరికి?”

“నాక్కూడా తెలీదు నేనిప్పుడే వచ్చా. ఎవరికైతేనేం చూసేందుకేగా వచ్చాం” మరొకరి సర్దుబాటు వచనాలు. ఎట్టకేలకు రిబ్బను కత్తిరించే సమయం ఆసన్నమైంది.

గజపతి కత్తెర చేతిలోనికి తీసుకుని అందరివైపూ ఓమారు విజయగర్వంతో చూసి అడుగు ముందు కేశాడు రిబ్బన్ వైపు. హఠాత్తుగా అక్కడున్న వాళ్లందరికీ ‘ఇదేమిటి? నాయకుడు కాదా రిబ్బన్ కత్తిరించేది?’ అన్న సందేహం కలిగింది.

‘‘అదేంటన్నయ్యా? అయ్యగారికివ్వు’’ అన్నాడు తమ్ముడు ఆతృతగా.

‘మరేం ఫర్వాలేదు. నువ్వు సైలెంట్‌గా ఉండు’ అన్నట్టుగా చెయ్యి చూపించి అడుగు ముందుకేసి రిబ్బన్ ముందు నిల్చున్నాడు గజపతి.

‘అన్నయ్యా, నా ఎమ్మెల్యే సీటు...” అంటూ గుసగుసలాడాడు గజపతి చెవిలో.

"అదేమన్నా ఎల్‌కేజీ సీటనుకున్నావా. అమాంతంగా ఇచ్చెయ్యడానికి? నీబోటివాళ్లు వెయ్యిమంది ప్రయత్నిస్తుంటారు. కార్యక్రమం ముగిసిం తరువాత మిగతా విషయాలు మాట్లాడుదాం. నువ్వు నువ్వు డిస్టర్బ్ చెయ్యొద్దు" అంటూ రిబ్బను కత్తిరించేందుకు ఉపక్రమించాడు గజపతి.

ముహూర్తం దాటిపోతూందన్న ఆతృతతో ఒక్కసారిగా కిందామీద పడుతూ ఒకళ్ల నొకరు తోసుకుంటూ ముఖద్వారానికి కట్టి ఉన్న రిబ్బను కిందనుంచి దూరి లోపలికెళ్లబోయారు కొంతమంది ఫోటోగ్రాఫర్లు.

కత్తెరతో సిద్ధంగా నిలబడున్న గజపతి అలా లోపలికి దూరేందుకు ప్రయత్నించే ఇద్దరు ఫొటోగ్రాఫర్లను అమాంతంగా కాలర్ పుచ్చుకుని ఇవతలికి ఈడ్చి పారేశాడు.

ఈ హఠాత్పరిణామానికి అందరూ నివ్వెర పోయారు.

"ముందు రిబ్బను కత్తిరించిన తరువాతే ఎవరైనా లోపలికి అడుగు పెట్టాలి. రిబ్బన్ కట్టిందందుకే. అర్థమైందా? అదే నిజమైన ప్రారంభోత్సవం" అన్నాడు గజపతి స్థిరంగా.

"అదేంటి సార్ అలా ఈడ్చేశారు? లోపల నిలబడి ఫొటో తీస్తేనే రిబ్బను కత్తిరించే వాళ్ళ ముఖం బాగా కవర్ చెయ్యగలం. లేకపోతే లేదు" అన్నాడు ఆ ఫొటోగ్రాఫర్.

"కవర్ కాకపోతే కొంపలేమీ మునిగిపోవు. ప్రారంభోత్సవం అని ముహూర్తం పెట్టింది పద్ధతిగా ఆ సమయానికి రిబ్బన్ కట్ చేసి తరువాతే లోపలికి ప్రవేశించాలని, పాదం మోపాలని. అంతకు ముందే రిబ్బను కిందనించి లోపలికి దూరి పబ్లిసిటీ కోసం ఫొటోలు తీయించుకోడానిక్కాదు కాదు. మీకిష్టముంటే, ఇలాగే కవర్ చేయడం చేతనైతే, పక్కనే నిలబడి ఫొటోలు తీసుకోండి. లేకుంటే అసలు ఫొటోలూ, వీడియోలే అక్కర్లేదు"

ఫొటోలకు ఫోజులివ్వడమే నిజమైన ప్రారంభో త్సవం అని అనుకునే వాళ్లకూ, అదే ఆనవాయితీగా ఇన్నాళ్లు కవరేజ్ చేస్తున్న వాళ్లకూ నిజమైన ప్రారంభోత్సవం అంటే ఏమిటో అర్థమైంది. ఐనా జరిగింది జీర్ణించుకోలేక తమ ఫొటోగ్రఫీ, వీడియో గ్రఫీ సామర్థ్యతను నిరూపించుకునే అవకాశాన్ని కోల్పోయినట్టు పరమ ఇబ్బందిగా ముఖాలు పెట్టుకుని ఫొటోలు తీసుకున్నారు.

ముఖ్యఅతిథిగా వచ్చిన స్థానిక నాయకుడు ఆ మాటలకు చిద్విలాసంగా నవ్వాడు.

"పెద్దవారు క్షమించాలి. మా తమ్ముడికి మీదగ్గరున్న చనువుతో ప్రారంభో త్సవానికి మిమ్మల్ని పిలుస్తానంటే కాదనలేకపోయాను. ముందుగా మీ చేతనే ఈ ప్రారంభోత్సవం కానిద్దామనుకున్నాను. కానీ ఇదుగో, ఇలాంటిదేదో జరుగు తుందని ఊహించే మీకు ఫోన్లో విషయాన్ని విన్నవించాను. సహృదయతో మీరర్థం చేసుకున్నారు. కానీవ వీళ్లు మాత్రం మాటలతో కాక చేతలతోనే, ప్రాక్టికల్ గానే అర్థం చేసుకుంటారన్న విషయం నాకు ముందే తెలుసు. వ్యాపారం పది కాలాలపాటు చల్లగా సాగాలని మంచి ముహూర్తం పెట్టి రిబ్బను కట్టి ప్రారంభోత్సవం చేస్తాం. అంతేకానీ మనం ఫొటోకు ఫోజులివ్వడం కోసమైతే పెట్టిన ముహూర్తానికీ, కట్టిన రిబ్బనుకూ ఏముంది విలువ? సంప్రదాయాలకు విలువనివ్వడం మన కర్తవ్యం. ప్రారంభోత్సవ సమయంలో ఇవన్నీ ఇంతగా విడమర్చి చెప్పలేను గనుకనే ముందుగానే విన్నవించుకున్నాను. మీరు అంతకన్నా హుందాగా నన్నర్థం చేసుకుని నా ఆహ్వానాన్ని మన్నించారు. ఇక కత్తిరించ మంటారా?" అన్నాడు గజపతి.

"మీ సెంటిమెంట్, ప్రారంభోత్సవం గురించిన అసలు విషయం ఇక్కడ అందరికీ అర్థమైందిగా. ఇప్పుడు మీరంగీకరిస్తే నేను కూడా మనస్ఫూర్తిగానే కత్తిరించగలను. నాకెటువంటి ఈగోలూ లేవు" అన్నాడు ముఖ్యఅతిథి గజపతి భుజం తడుతూ.

సంతోషంగా కత్తెరను ముఖ్య అతిథికి అందించాడు గజపతి.

అక్కడ ఫొటోగ్రాఫర్లందరికీ ఇదొక ఎదురు చూడని అనుభవం. సాధారణంగా ఎక్కడ ప్రారంభోత్సవం జరిగినా ఆ ప్రారంభానికి ముందే రిబ్బను కిందనుంచి లోపలికి దూరి ఎదుటి వైపునుంచి ఫొటోలు తీసి ఆర్భాటం చేయడం ఇప్పటి ఆనవాయితీగా మారింది. ముహూర్తాన్ని మూలకు నెట్టి పబ్లిసిటీకి పెద్దపీట వెయ్యడమే ఈనాటి ప్రారంభోత్సవాలకు ఆనవాయితీ మారింది.

అలా కుదరదని గజపతి కుండబద్దలు కొట్టినట్టు చెప్పడంతో అందరూ ఒక్కసారిగా బిక్కచచ్చి పోయారు.

ఫొటోలకు ఫోజులివ్వడమే నిజమైన ప్రారంభోత్సవం అని అనుకునే వాళ్లకూ, అదే ఆనవాయితీగా ఇన్నాళ్లు కవరేజ్ చేస్తున్న వాళ్లకూ నిజమైన ప్రారంభోత్సవం అంటే ఏమిటో అర్థమైంది. ఐనా జరిగింది జీర్ణించుకోలేక తమ ఫొటోగ్రఫీ, వీడియో గ్రఫీ సామర్థ్యతను నిరూపించుకునే అవకాశాన్ని కోల్పోయినట్టు పరమ ఇబ్బందిగా ముఖాలు పెట్టుకుని ఫొటోలు తీసుకున్నారు.

కేవలం ఇలాంటి ప్రారంభోత్సవాలే కాదు. రెండు జీవితాలను ఒకటి చేసి కలకాలం చల్లగా ఉండాలని పదిమందీ మనసారా దీవించే పెళ్లిళ్లలో కూడా ముహూర్తాన్ని మూలకు నెట్టి, కేవలం ఫొటోలకూ వీడియోలకే ప్రాముఖ్యత నిస్తున్నారన్నదే అక్షరసత్యం. పైగా చేసినదాన్నే మళ్లీ మళ్లీ చేయించి రకరకాల యాంగిల్స్‌లో ఫొటోలు తీస్తారు.

అందరు ఫొటోగ్రాఫర్లకూ, ప్రారంభోత్సవం చేసిన ముఖ్యఅతిథి, పక్కనున్న గజపతుల వీపులే ఫొటోల్లో కనిపించాయి కవరయ్యాయి. ముందు నిలబడ్డ ఇద్దరు ముగ్గురు ఫొటోగ్రాఫర్లు మాత్రమే ఓ మోస్తరు సైడ్ వ్యూ తీయగలిగారు. గజపతి రిబ్బన్ కత్తిరించగానే అందరూ గట్టిగా చప్పట్లు కొచ్చారు.

పిట్ట గోడమీద కూర్చున్న సామాన్యుడు మాత్రం ఆనందం పట్టలేక మరింత గట్టిగా చప్పట్లు చరిచి కేరింతలు కొట్టాడు. అందరి చప్పట్లు ఆగిపోయినా అతనింకా కొడుతూనే ఉన్నాడు. మనస్ఫూర్తిగా, ఆహ్లాదకరంగా నవ్వుకున్నాడు. చాన్నాళ్ళకు అతనికి నిజమైన ప్రారంభోత్సవం చూసిన ఆనందం, తృప్తి కలిగాయి. ★



క్రికెట్‌ను లాభసాటి వ్యాపారంగా మార్చి అంబానీ, అదానీ, విజయ్ మాల్యా, శ్రీనివాసన్ లాంటి బిజినెస్ మాగ్నెట్లను భాగస్వాములుగా చేసుకొని.. ప్రతిభావంతులైన క్రికెటర్లను కుబేరులుగా తీర్చిదిద్దటంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి తర్వాతే ఏదైనా. గత 15 సీజన్లుగా పురుషుల ఐపీఎల్‌తో వేల కోట్ల రూపాయలు వెనకేసుకొన్న బీసీసీఐ ఇప్పుడు మహిళా క్రికెట్‌తోనూ వ్యాపారానికి తెరతీసింది. మార్చి 4 నుంచి ముంబై వేదికగా జరిగే ప్రారంభ మహిళా ఐపీఎల్‌తో వివిధ రూపాలలో ఆరు వేల కోట్ల రూపాయలకు పైగా ఆర్జించింది. అంతేకాదు, మొత్తం ఐదు ఫ్రాంచైజీల జట్ల కోసం నిర్వహించిన వేలం ద్వారా పలువురు జాతీయ, అంతర్జాతీయ క్రికెటర్లను కోట్లకు పడగలెత్తేలా చేసింది.

ముగించాయి. చివరకు బెంగళూరు ఫ్రాంచైజీ స్మృతి మందనను సొంతం చేసుకోగలిగింది. భారత యువ బ్యాటర్ జెమీమా రోడ్రిగేజ్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ 2 కోట్ల 20 లక్షల రూపాయలకు వేలం ద్వారా దక్కించుకోగలిగింది. డాషింగ్ ఓపెనర్ షెఫాలీవర్మ సైతం 2 కోట్ల రూపాయల ధరకు ఢిల్లీ ఫ్రాంచైజీలో చేరింది.

ఐపీఎల్ నిబంధనల ప్రకారం ఒక్కో జట్టు వేలం ద్వారా ఆరుగురు విదేశీ క్రికెటర్లను సొంతం చేసుకొనే అవకాశం ఉంది. వేలం ద్వారా 20 మంది సభ్యుల జట్టును సమకూర్చుకోడానికి ఒక్కో ఫ్రాంచైజీకి 12 కోట్ల రూపాయల మొత్తాన్ని మాత్రమే అనుమతించారు. గౌతం అదానీ యజమానిగా ఉన్న గుజరాత్ టైటాన్స్ జట్టు ఆస్ట్రేలియాకు చెందిన స్పిన్ ఆల్ రౌండర్ యాష్లీగా గార్డ్నర్‌కు 3 కోట్ల 20 లక్షల రూపాయల రికార్డు ధర చెల్లించి మరీ దక్కించుకొంది. ...

దక్కలేదు. వేలంలో ఈ ప్లేయర్‌లెవరూ అమ్ముడుపోకుండా మిగిలిపోయారు.

దేశవిదేశాలకు చెందిన మొత్తం 409 మంది ప్లేయర్ల జాబితాతో వేలం కార్యక్రమాన్ని నిర్వహించారు. వీరిలో 246 మంది భారత క్రికెటర్లు, మిగిలిన 163 మంది వివిధ దేశాలకు చెందిన ప్లేయర్లు. 202 మంది అంతర్జాతీయ క్రికెటర్లు కాగా.. మిగిలిన 199 మంది అంతర్జాతీయ అనుభవం లేని ప్లేయర్లుగా ఉన్నారు. మొత్తం ఐదు జట్లలో 90 స్థానాలు ఖాళీగా ఉన్నాయి. కనీస వేలం ధర రూ.50 లక్షల విభాగంలో 24 మంది ప్లేయర్లు, 40 లక్షల విభాగంలో 30 మంది ఉన్నారు. మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) వేలం కార్యక్రమాన్ని ఓ మహిళే (మల్లికా సాగర్) నిర్వహించడం ద్వారా చరిత్ర సృష్టించారు.




**డబ్బే డబ్బు!**

ఐపీఎల్ వేలం పుణ్యమా అంటూ గ్రౌండ్‌లోకి దిగకుండానే భారత కెప్టెన్ హర్మన్ ప్రీత్‌కౌర్, వైస్ కెప్టెన్ స్మృతి మందన, ఆస్ట్రేలియా స్పిన్ ఆల్ రౌండర్ యాష్లీగా గార్డ్నర్, భారత స్పిన్ ఆల్ రౌండర్ దీప్తి శర్మ, షెఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగేజ్ కోటీశ్వరులుగా మారిపోయారు. భారత డాషింగ్ ఓపెనర్ స్మృతి మందనకు అత్యధికంగా 3 కోట్ల 40 లక్షల రూపాయల ధర పలికింది. 50 లక్షల రూపాయల కనీసధరతో ప్రారంభమైన వేలంలో స్మృతి కోసం ముంబై, బెంగళూరు ఫ్రాంచైజీలు హోరాహోరీగా పోటీ పడి 3 కోట్ల 40 లక్షల రూపాయల వద్ద



క్రీడా కృష్ణ, 84668 64969
సీనియర్ జర్నలిస్ట్

కొంది. భారత స్పిన్ ఆల్ రౌండర్ దీప్తి శర్మను యూపీ వారియర్స్ జట్టు 2 కోట్ల 60 లక్షల రూపాయల ధరకు ఖాయం చేసుకుంది.

ఇక భారత కెప్టెన్ హర్మన్ ప్రీత్‌కౌర్‌ను ముంబై ఫ్రాంచైజీ కోటీ 80 లక్షల రూపాయల ధరకు సొంతం చేసుకోగలిగింది. ఆస్ట్రేలియా స్టార్ ఆల్ రౌండర్ ఎల్పీ పెర్రీని కేవలం కోటీ 70 లక్షల రూపాయల ధరకే బెంగళూరు జట్టు దక్కించుకోగలిగింది. న్యూజిలాండ్ కెప్టెన్ సోఫీ డేవిస్‌ను కారుచౌక ధరకే బెంగళూరు ఫ్రాంచైజీ గెలుచుకోగలిగింది. మొత్తం 12 కోట్ల నుంచి కేవలం ముగ్గురు స్టార్ ప్లేయర్ల కోసమే బెంగళూరు యాజమాన్యం 5 కోట్ల 60 లక్షల రూపాయలు ఖర్చు చేసింది. మిగిలిన 6 కోట్ల 40 లక్షల రూపాయలతో 17 మంది సభ్యులను సమకూర్చుకోవాల్సి ఉంది. ఇంగ్లండ్ లెఫ్టామ్ స్పిన్నర్ సోఫియా ఈకెల్ స్టోన్‌ను కోటీ 80 లక్షల రూపాయల ధరకు యూపీ వారియర్స్ సొంతం చేసుకోగలిగింది. న్యూజిలాండ్ స్టార్ ప్లేయర్ సుజీ బేట్స్, హీథర్ నైట్, టామీ బ్యూమోంట్, అన్నాబెల్ సదర్లాండ్, సునీ లూస్, డానీ వెయిట్, దేవేంద్ర డోటిన్ లాంటి అంతర్జాతీయ స్టార్ ప్లేయర్లకు కనీస ధర సైతం

**మార్చి 4 నుంచి షురూ..**

ముంబై వేదికగా మార్చి 4న ప్రారంభ మహిళా ప్రీమియర్ లీగ్ మొదలు కానుంది. ఐదు జట్లు మొత్తం 22 మ్యాచ్‌లు ఆడనున్నాయి. మార్చి 22న ఫైనల్ మ్యాచ్ నిర్వహిస్తారు. లీగ్ బరిలో నిలిచే జట్లలో ముంబై ఇండియన్స్, ఢిల్లీ క్యాపిటల్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ జెయింట్స్, యూపీ వారియర్స్ ఉన్నాయి. ఐపీఎల్ మొదటి మూడు సీజన్లు (2023 నుంచి 2025 వరకూ) సీజన్‌కు 22 మ్యాచ్‌లు చొప్పున నిర్వహిస్తారు. లీగ్ దశలో ఒక్కో జట్టు మిగిలిన ప్రత్యర్థి జట్లతో రెండేసి మార్లు తలపడనుంది. లీగ్ దశలో టేబుల్ టాపర్‌గా నిలిచిన జట్టు నేరుగా ఫైనల్ చేరుకుంటుంది. రెండు, మూడు స్థానాలలో నిలిచిన జట్లు ఎలిమినేటర్ రౌండ్లో తలపడనున్నాయి. ప్రతి ఏడాది మార్చిలో మాత్రమే మహిళా ఐపీఎల్ టోర్నీని నిర్వహిస్తారు. 2026 సీజన్ నుంచి మ్యాచ్‌ల సంఖ్య 33 లేదా 34 వరకూ ఉండే అవకాశం ఉందని బీసీసీఐ వర్గాలు అంటున్నాయి. పురుషుల ఐపీఎల్ జరిగినంత పట్టుగా, ఉత్కంఠభరితంగా మహిళా ఐపీఎల్ జరుగుతుందా? వేచిచూడాల్సిందే! ★

# ఉత్సాహ భరితంగా శ్రీ సరస్వతీ విద్యాపీఠం స్వర్ణజయంతి వేడుకలు

**హైదరాబాద్:** శ్రీ సరస్వతీ విద్యాపీఠం ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా స్వర్ణ జయంతి వేడుకలు ఉత్సాహభరితంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ సేవలు అందిస్తున్న ప్రధాన అధ్యాపకులు, ఉప ప్రధాన అధ్యాపకుల శిబిరం ఫిబ్రవరి 11 నుంచి 13 వరకు హైదరాబాద్ శారదాధామంలోని శిక్షణ కేంద్రంలో కార్యక్రమం నిర్వహించారు.






ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విద్యాభారతి అఖిల భారత అధ్యక్షులు దూసి రామకృష్ణ, సంఘటన కార్యదర్శి గోవింద్ మహంతో, దక్షిణ మధ్యక్షేత్ర అధ్యక్షులు డా.చామర్తి ఉమామహేశ్వరరావు, కార్యదర్శి అయాచితుల లక్ష్మణరావు, సంఘటన కార్యదర్శి లింగం సుధాకర్ రెడ్డి మార్గ దర్శనం చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ 400కు పైగా పాఠశాలలను శ్రీ సరస్వతి విద్యాపీఠం నిర్వహిస్తున్నది. విలువలు కల విద్యను అందించేందుకు 50 సంవత్సరాలుగా కృషి చేస్తున్నది.


ప్రధాన అధ్యాపకుల శిబిరంలో శ్రీ సరస్వతీ విద్యాపీఠం ప్రగతిని చర్చించారు. శిశు మందిర్ పాఠశాలల నిర్వహణలో కీలక పాత్ర వహిస్తున్న ఆచార్యులతో భవిష్యత్తు ప్రణాళికమీద చర్చ జరిపారు. ఈ సందర్భంగా ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రఅధ్యక్షులు ప్రొ. తిరుపతిరావు, కార్యదర్శి ముక్కాల సీతారాములు, క్షేత్ర శైక్షణిక్ ప్రముఖ్ రావుల సూర్యనారాయణ ప్రసంగించారు.

శిబిరం సందర్భంగా శ్రీ సరస్వతీ విద్యాపీఠం అభ్యున్నతికి కృషిచేసిన సంఘటన కార్యదర్శులు కాశీపతి, లింగం సుధాకర్ రెడ్డి, వీఆర్ జగదీష్, పతకమూరి శ్రీనివాస్, కన్నా భాస్కర్‌తోబాటు విద్యాపీఠం రాష్ట్ర ఉపాధ్యక్షులు పసర్తి మల్లయ్య, కరస్పాండెంట్ విద్యాన్‌రెడ్డి, జ్యేష్ఠ ప్రచారక్ కె.వి. సత్యనారాయణ, నివృత్త ప్రధానాచార్యులు కోటం రాజులను సన్మానించారు. తెలుగు నాట విలువలతో కూడిన విద్యను, సామాజిక నైపుణ్యాలను అన్ని వర్గాల విద్యార్థులకు సేవా భావంతో శ్రీసరస్వతీ విద్యాపీఠం అందిస్తున్నది. ఈ ప్రస్థానంలో ముఖ్య పాత్ర పోషించిన నాయకత్వ శ్రేణులు, టీచింగ్, నాన్ టీచింగ్‌స్టాఫ్‌ను అభినందించారు. ఈ శిబిరం నిర్వహణ ద్వారా సిబ్బందిలో మరింత ఉత్తేజం కల్పించారు.

**– రమా విశ్వనాథన్, ప్రాంత ప్రచారప్రముఖ్**
**శ్రీ సరస్వతీ విద్యాపీఠం, తెలంగాణ**


# బాలికల సాధికారత కోసం పరుగు

**హైదరాబాద్:** బాలికల విద్య, తద్వారా మహిళల సాధికారత కోసం సేవాభారతి 2023 ఫిబ్రవరి 12న 21కె, 10కె, 5కె పరుగు మూడు రకాలుగా హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఉదయం 5.30, 6.00, 6.30 గం. నిర్వహించారు. ఈ మూడు రకాల పరుగును ప్రముఖ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనా జస్వాల్, మాదాపూర్ డిజిపి శిల్పవల్లి, చంచలగూడ జైల్ ఎస్.పి. శివకుమార్ గౌడ్, రాష్ట్రీయ సేవాభారతి ప్రధాన కార్యదర్శి రేణుపాఠక్, ఆర్.ఎస్.ఎస్. దక్షిణ మధ్య క్షేత్ర సేవాప్రముఖ్ ఎక్కాచంద్రశేఖర్, సేవాభారతి తెలంగాణ ప్రాంత ఉపాధ్యక్షులు రామచంద్రారెడ్డి, డా॥సుమలత, కార్యదర్శి ప్రభల రామ్మూర్తి, సహకార్యదర్శి జయప్రద, కిశోరివికాస్ ప్రాంత అధ్యక్షులు కిరణ్మయి, ఆర్.ఎస్.ఎస్ తెలంగాణ ప్రాంత సహ సంఘచాలక్ సుందర్‌రెడ్డి, వివిధ కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు జెండా వూపి రన్‌ను ప్రారంభించారు. 21 కె– 400మంది, 10కె –1600, 5 కె– 5200 మంది మొత్తం 7200 మంది పరుగులో పాల్గొన్నారు. ఇవేకాక భాగ్యనగర్ వివిధ ప్రదేశాలలో 16 కమ్యూనిటీలలో 2600 మంది పరుగులో పాల్గొన్నారు. 30 కార్పొరేట్ సంస్థల నుండి 60మంది ప్రతినిధులు పాల్గొన్నారు. 21కె,10కె విభాగాలలో మొదటి, రెండవ స్థానంలో వచ్చినవారికి బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో 1000 మంది వాలంటీర్లు పనిచేశారు.






# నిబద్ధతకు మారుపేరు యూఏఎన్ మాష్టారు



రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ నిర్మించిన వ్యక్తిత్వం ఆయన సొంతం.. క్రమశిక్షణ, సమయ పాలన, మానవీయ విలువలు, సహకార భావన, దేశభక్తి.. వంటి అనేక అంశాలు ఒంటబట్టించుకున్న స్వయంసేవక్ ఆయన.. స్వార్థ భావనలకు దూరంగా, సామరస్యపూరిత సమాజం కోసం అడుగులు వేసిన నాయకునిగానూ నిలిచారు. ఆయనే ఉలిమిరి అప్పల నరసింహం. యూఏఎన్ (UAN-unity, ability, nobility) మాష్టారుగా పేర్గాంచిన ఆయన విద్యార్థులు, ఉపాధ్యాయుల సమస్యలపై అనేక పోరాటాలు చేశారు.

నరసింహం చిన్నతనం నుంచే 'సంఘ' పయనం ప్రారంభించారు. ముఖ్యశిక్షక్‌గా ఎదిగారు. విజయ నగరంనుంచి ఆర్ఎస్ఎస్ ప్రధాన కేంద్రమైన నాగపూర్‌లో తృతీయవర్ష శిక్షావర్గకు శిక్షక్‌గా వెళ్లడం సాధారణ విషయం కాదు. కానీ ఆయనకు సాధ్యపడింది. ఇది తన అంకితభావం, నిబద్ధతకు నిదర్శనం. ఆర్ఎస్ఎస్‌పై నిషేధం విధించినప్పుడు నరసింహం అరెస్టు అయ్యారు. పరమ పూజనీయ గురూజీ ఒక సందర్భంలో విశాఖ వచ్చినప్పుడు అక్కడ జరిగిన ఉత్సవానికి నరసింహం ముఖ్యశిక్షక్‌గా వ్యవహరించి గురూజీతోపాటు పలువురి అభినందనలు అందుకున్నారు.



రాష్ట్రపతి జైల్‌సింగ్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటూ..

అధ్యాపక వృత్తిలో రాణించి దేశ ప్రథమ పౌరుని నుంచి ఉత్తమ అవార్డు కూడా అందుకున్నారు. సంఘ్ చూపించిన సంస్కారాన్ని ఆయన తుదిశ్వాస వరకు వీడలేదు. శాఖ చూపించిన మార్గం ఆయనకు గురువులకే గురువుగా పేరు తెచ్చిపెట్టింది. సమాజంలోనూ యూఏఎన్ మాస్టర్ అంటే ఓ గౌరవభావాన్ని ప్రోది గొల్పింది.

విశాఖ జిల్లాలోని ప్రముఖ నారసింహ క్షేత్రం సింహాచలంలో 1932లో ఉలిమిరి అప్పల నర సింహం జన్మించారు. తల్లిదండ్రులు లక్ష్మీనరసమ్మ, గౌరీశంకరం. ఈయన బాల్యమంతా విజయనగరంలోనే సాగింది. కరెడ్ల సత్యనారాయణ విజయనగరంలో ప్రచారక్‌గా ఉన్నప్పుడు నరసింహం స్వయంసేవక్‌గా సంఘ పయనం ప్రారంభించారు. రాణాప్రతాప్ శాఖకు ముఖ్యశిక్షక్‌గా ఉండేవారు. ఈయన మహారాజా కళాశాలలో బీఎస్సీ చదివారు. మహారాజా విద్యా కళాశాలలో బీఈడీ పూర్తిచేసి గణితశాస్త్ర ఉపాధ్యాయునిగా తన ఉద్యోగ జీవితం ప్రారంభించారు. ప్రధాన ఉపాధ్యాయునిగా విద్యారంగానికి తనదైన రీతిలో సేవలందించారు. ఆర్ఎస్ఎస్ ప్రాథమిక సూత్రాలైన క్రమశిక్షణ, సమయ పాలన వంటి లక్షణాలను తన ఉపాధ్యాయ జీవితంలోనూ ఆచరించారు, తన సహచరులు, విద్యార్థులు ఆచరించేలా చేశారు. ఎందరో విద్యార్థుల్ని ఉన్నతులుగా తీర్చిదిద్దారు.

**ఉపాధ్యాయ సంఘం నాయకునిగా..**

నాడు ఉపాధ్యాయుల పరిస్థితులు అంతగా ఏం బాగాలేవు. అందుకే 'బతకలేక బడిపంతులు' అనే వారు. అనేకానేక సమస్యలతో కొట్టుమిట్టాడుతూ ప్రభుత్వ చిరుద్యోగులుగా మిగిలిన ఉపాధ్యాయుల హక్కుల కోసం నరసింహం పోరాట శంఖం పూరించారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం వ్యవ స్థాపకుల్లో ఈయన ముఖ్యులు. ఈ సంఘానికి అధ్యక్షులుగానూ వ్యవహరించి, గొప్ప నాయకునిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై అనేకసార్లు నిరాహార దీక్షలు చేశారు. ఉపాధ్యాయ వర్గాల్లోనూ భిన్నస్వరాలు వినిపించినా, ఎదుటి వ్యక్తి ఎలాంటి వారైనా ప్రేమగా, ఆప్యాయంగా పలక రించే వారు. ఈ లక్షణమే తన మాటను అందరూ గౌర వించేలా చేసిందని చెప్పాలి. ఉపాధ్యాయుల సేవలకు చిరునామాగా నిలవాలనే ఆకాంక్షతో తన నివాసానికి చేరువగా విజయనగరం దాసన్నపేట ఉత్తరగట్టు చివరన 'ఉపాధ్యాయ భవన్'ను అందరి సహకారంతో నిర్మింపజేశారు. సమస్య వచ్చిందని ఏ ఉపాధ్యాయు డైనా మాస్టరు దగ్గరికి వస్తే ఆ సమస్యకు కచ్చితంగా పరిష్కారం లభిస్తుందన్న నమ్మకాన్ని వారిలో కలిగించే వారు.

**ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఖ్యాతి..**

నరసింహం నక్కపల్లి, నెల్లిమర్ల, శృంగవరపు కోట, పూసపాటి రేగ, వియ్యంపేట, ఎ. కోడూరు, రామతీర్థం, పెదతాడివాడ, భోగాపురంలలోని పాఠశాలల్లో పనిచేశారు. విద్యాలయాల అభివృద్ధిలో విద్యార్థుల తల్లిదండ్రులను, సామాన్య ప్రజలను కూడా భాగస్వాముల్ని చేశారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి, విద్యాప్రమాణాల మెరుగుకు కృషిచేశారు. ఆయన సేవలకు గుర్తింపుగా 1975లో జిల్లా స్థాయిలో, 1983లో రాష్ట్ర స్థాయిలో, 1984లో జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు. భారత రాష్ట్రపతి జ్ఞానీ జైల్‌సింగ్ నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు విజయనగరంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించి నిర్వాహకులు 'ఉపాధ్యాయ శిరోమణి' బిరుదును ప్రదానం చేశారు.

నరసింహం ఏ పనిచేసినా నిస్వార్థం, నిజాయితీ, ప్రతిఫలాపేక్ష లేకుండా చేశారు. ఉపాధ్యాయులకు గృహ వసతి ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో విశాఖ జిల్లా మధురవాడలో అతితక్కువ ధరకే ఇళ్ల స్థలాలు అందేలా చూశారు. సుమారు ఐదు దశాబ్దాల పాటు ఉపాధ్యాయుల అభ్యున్నతికి అవిశ్రాంత సేవచేసిన మహనీయుడాయన. (ఉలిమిరి అప్పల నరసింహం జనవరి 14న విజయనగరంలో తుదిశ్వాస విడిచారు.) ★



# బాల జాగృతి

## తెలుసుకుందాం

# గంగా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి ఆలయం



ఆంధ్రప్రదేశ్‌లోని ఉమ్మడి గుంటూరు జిల్లా చేబ్రోలు గ్రామంలో ఈ దేవాలయం కొలువుదీరింది. ఇక్కడ గంగా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి కొలువై ఉన్నారు. దీనిని చాళుక్యులు నిర్మించినట్లుగా చారిత్రక ఆధారాలు తెలుపుతున్నాయి. చోళభీముడు యుద్ధానికెళ్లిన ప్రతిసారి ఈ ఆలయంలో పూజలు నిర్వహించి విజయాలు సాధించేవాడని తెలుస్తోంది. కొంతకాలం తరువాత ఈ ప్రాంతం అమరావతి సంస్థానాధీశులు జమీందారు రాజా వీరవెంకట బహదూర్ పరిపాలనలోకి వచ్చింది.


## కథ | యజమాని-గుమాస్తా

ఒక జమీందారు సాయంకాలం వేళ తన కోట ఆవరణలోని పండ్లతోటలో తిరుగుతూండగా, దివాణం గుమాస్తా ఏదో పని పడి అక్కడికి వచ్చాడు.

జమీందారు అతనితో మాట్లాడుతూ తాను కొత్తగా చేయించి, వేలికి పెట్టుకున్న వజ్రపుటుంగరాన్ని చూపించాడు. 'దీన్ని తయారుచేసినవాడు మంచి పనిమంతుడు. వజ్రం కూడా చాలా విలువైనది. ఎలా మెరుస్తుందో చూడు! ఇంతకీ ఈ ఉంగరం ఎలా ఉందంటావ్?' అని అడిగాడు.

గుమాస్తా జవాబేమీ ఇవ్వలేదు. జమీందారు కొంచెంసేపు ఆగి 'ఉంగరం గురించి నీ అభిప్రాయం చెప్పవేం?' అని మళ్లీ అడిగాడు.

దానికి గుమాస్తా "ప్రభువులు, క్షమించాలి. తమరు ఉంగరం ఎలా ఉందని అడిగితే తప్పక నా అభిప్రాయం చెప్పేవాడిని. అలాకాక,



## పద్యం



కనగ సొమ్ము లెన్నో కనకంబదొక్కటె
పసుల వన్నె లెన్నొ పాలొకటియె
పుష్పజాతులెన్నొ పూజయొక్కటె సుమీ
విశ్వదాభిరామ! వినుర వేమ!

**భావం :** ఆభరణములు వేరైనా బంగారం ఒక్కటే. పశువుల రంగులు వేరైనా పాలు ఒక్కటే. సుగంధభరిత పుష్ప జాతులు వేరైనా చేసే పూజ మాత్రం ఒక్కటే. అలాగే శాస్త్ర పరిజ్ఞానం గల పండితులు వేరైనా జ్ఞానం మాత్రం ఒక్కటే.

## సూక్తిరత్నం



సంతోషో నందనం వనమ్
క్రోధో వైవస్వతో రాజా
తృష్ణా వైతరణీనదీ
విద్యా కామదుఘా ధేనుః
సంతోషో నందనం వనమ్

**భావం :** కోపం ఆయుష్షును తగ్గిస్తుంది. కోరికల పరంపర వైతరణి నది లాంటిది. విద్య కోరిన కోరికలుతీర్చే కామధేనువు. సంతోషంగా జీవించడం స్వర్గంతో సమానం.

## జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| కవి | మొక్క |
| గ్రహము | దరి |
| చోద్యం | కయి |
| తీరము | సోదెము |
| మూలిక | గాము |

జవాబులు : కవి–కయి, గ్రహము–గాము, చోద్యం–సోదెము, తీరము–దరి, మూలిక–మొక్క.

## భారత స్వాతంత్ర్య సమరయోధులు

### నరహరి ద్వారకాదాస్ పారిఖ్



ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు. గుజరాత్‌కు చెందిన రచయిత, సంఘసంస్కర్త. అక్టోబర్ 17, 1891న అహ్మదాబాద్‌లో జన్మించారు. 1916లో మహాత్మాగాంధీతో కలిసి అనేక సామాజిక సంస్కరణ ఉద్యమాల్లో, స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు. అస్పృశ్యత, మద్యపానం, నిరక్షరాస్యతకు వ్యతిరేకంగా ప్రచారం చేశారు. 1935లో హరిజన్ ఆశ్రమాన్ని కూడా నిర్వహించారు. కొంతకాలం గాంధీజీ వద్ద కార్యదర్శిగా సేవలందించారు. జూలై 15, 1957న తుదిశ్వాస విడిచారు.

## జనరల్ నాలెడ్జ్

1. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇటీవలి బడ్జెట్‌లో పేర్కొన్న 'శ్రీఅన్న' పథకం దేనికి సంబంధించినది?
2. అమెరికాలోని జాన్స్ హాప్కిన్స్ యూనివర్సిటీకి చెందిన సెంటర్ ఫర్ టాలెంటెడ్ యూత్ (సీటీవై) ఇటీవల నిర్వహించిన పరీక్షలో ప్రపంచంలోనే అత్యంత తెలివైన విద్యార్థినిగా ఎవరు ఘనత సాధించారు?
3. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఎప్పుడు జరుపుకుంటారు?

జవాబులు : 1. చిరుధాన్యాలు; 2. నటాషా పెరియనాయగం (13 ఏళ్లు); 3. ఫిబ్రవరి 21.



తమరే ఉంగరాన్ని అంతగా మెచ్చుకుంటూ చెప్పిన తరువాత, కాదని ఖండించే సాహసం చెయ్యలేను కదా! ఒకవేళ, మీ అభిప్రాయంతో ఏకీభవించినా అది అంతగా మీకు సంతృప్తిగా అనిపించకపోవచ్చు. అందుకే మౌనం వహించాను' అన్నాడు.

యజమాని అయినవాడు కొన్ని కొన్ని సందర్భాలలో తన వద్ద పనిచేసే వ్యక్తులతో ఎలా సంభాషించాలో గుమాస్తా సూక్ష్మంగా, చమత్కారంగా చెప్పినందుకు జమీందారు అతన్ని మెచ్చుకొని ఉంగరాన్ని అతనికి బహుమతిగా ఇచ్చేశాడు. ★

## మెదడుకు మేత



అరచేతికి అరవై రంధ్రాలు?

జవాబు : జల్లెడ

## మంచిమాట



**శ్రమ నీ ఆయుధమైతే.. విజయం నీ బానిస అవుతుంది!**




# వారఫలాలు

## 20-26 ఫిబ్రవరి 2023




సింహంభట్ల సుబ్బారావు

6300674054


**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

పలుకుబడి, హోదాలు కలిగిన వ్యక్తుల పరిచయం. ఆదాయం ఆశాజనకంగా. సన్నిహితులతో వివాదాలు సర్దుబాటు చేసుకుంటారు. ప్రత్యర్థులను సైతం ఆకట్టుకుంటారు. స్థిరాస్తి కొనుగోలు యత్నాలు సఫలం. వ్యాపారులకు తగినంత లాభాలు. పారిశ్రామిక, కళాకారులకు అనూహ్యమైన అవకాశాలు. 23,24 తేదీలలో వృథా ఖర్చులు. శారీరక రుగ్మతలు. శ్రీ రామరక్షా స్తోత్రం పఠించండి.

**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

రాబడి కొంత నిరాశపర్చినా అవసరాలు తీరతాయి. కొన్ని కార్యక్రమాలు సకాలంలో పూర్తిచేస్తారు. కొన్ని సమస్యలు నేర్పుగా అధిగమిస్తారు. ముఖ్య నిర్ణయాలు తీసుకుంటారు. ఇంటినిర్మాణాలు, కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. విద్యార్థులు సత్తా చాటుకుంటారు. ఉద్యోగస్తులకు విధి నిర్వహణలో ఒత్తిడులు తొలగుతాయి. 20,21 తేదీల్లో శారీరక రుగ్మతలు. ఆకస్మిక ప్రయాణాలు. గణేశ్ స్తోత్రం పఠించండి.

**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

ఆదాయం క్రమేపీ అనుకూలిస్తుంది. ఆరోగ్యం మెరుగుపడి ఊరట లభిస్తుంది. ముఖ్య కార్యక్రమాలను పట్టుదలతో పూర్తి చేస్తారు. విద్యార్థులకు విదేశీ విద్యావకాశాలు లభించవచ్చు. ఆస్తి వ్యవహారాలలో ఒప్పందాలు. వ్యాపారులకు క్రమేపీ లాభాలు అందుతాయి. పారిశ్రామికవేత్తలు, కళాకారులు, రచయితలకు అనుకున్న అవకాశాలు దక్కుతాయి. 21,22 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. శారీరక రుగ్మతలు. ఆదిత్య హృదయం పఠించండి.

**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

ఇంతకాలం పడిన కష్టం ఫలిస్తుంది. చేపట్టిన కార్యక్రమాలు సజావుగా సాగుతాయి. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. వాహనాలు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. ఆదాయం గతం కంటే మెరుగ్గా ఉంటుంది. సన్నిహితులు సహాయసహకారాలు అందిస్తారు. రాజకీయవేత్తలు, కళాకారులు, రచయితలకు ఆకస్మిక విదేశీ పర్యటనలు. 23,24 తేదీల్లో వృథాఖర్చులు. ఆరోగ్యసమస్యలు. హయగ్రీవ స్తోత్రం పఠించండి.

**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

కుటుంబంలో ఒత్తిడుల నుంచి విముక్తి. నూతన విద్యావకాశాలు లభిస్తాయి. శుభకార్యాలు నిర్వహిస్తారు. ఓర్పుతో కొన్ని సమస్యలను అధిగమిస్తారు. రాబడి మరింత ఉత్సాహాన్నిస్తుంది. స్వల్ప శారీరక రుగ్మతలు. రావలసిన బాకీలు అందుతాయి. కోర్టు వ్యవహారాలలో ఊరట. ఉద్యోగస్తులకు కొత్త బాధ్యతలు దక్కే అవకాశం. 25,26 తేదీల్లో ఖర్చులు. ఆకస్మిక ప్రయాణాలు. పంచాక్షరి పఠించండి.

**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

కొన్ని కార్యక్రమాలను అనుకున్న సమయానికి పూర్తి చేస్తారు. సమాజంలో ప్రత్యేక గౌరవం పొందుతారు. దీర్ఘకాలిక సమస్యలు తీరి ఊరట చెందుతారు. వివాహయత్నాలు కలసివస్తాయి. ఆదాయం ఆశించినంతగా ఉంటుంది భూములు, వాహనాలు కొనుగోలు చేసే వీలుంది. 22,23 తేదీల్లో బంధువిరోధాలు. ఆరోగ్య సమస్యలు. అంగారక స్తోత్రం పఠించండి.

**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

శుభవార్తలు అందుతాయి. రాబడి కొంత పెరిగి అవసరాలు తీరతాయి. శుభకార్యాలరీత్యా ఖర్చులు పెరుగుతాయి. చేపట్టిన కార్యక్రమాలు సజావుగా పూర్తి చేస్తారు. ఆత్మీయుల నుంచి ఆహ్వానాలు అందుకుంటారు. వ్యాపారులు మరింత లాభదాయకంగా ఉంటాయి. ఉద్యోగస్తులకు ఒక సమాచారం ఊరటనిస్తుంది. 21,22 తేదీల్లో శారీరక రుగ్మతలు. ఆకస్మిక ప్రయాణాలు. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.

**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

అనుకున్న కార్యక్రమాలు విజయవంతంగా పూర్తి చేస్తారు. కొన్ని వివాదాలు పరిష్కరించుకుంటారు. ఆత్మీయులు, బంధువులతో సత్సంబంధాలు నెలకొంటాయి. రావలసిన బాకీలు సకాలంలో అందుతాయి. ఉద్యోగులకు ఉన్నత హెూదాలురావచ్చు. పారిశ్రామికవేత్తలు, కళాకారులు, రచయితలకు గందరగోళం తొలగుతుంది. 23,24 తేదీల్లో దుబారా వ్యయం. శివాష్టకం పఠించండి.

**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

ఆదాయం కంటే ఖర్చులు అధికంగా ఉంటాయి. సన్నిహితులతో విభేదాలు నెలకొనే అవకాశం. నిరుద్యోగులకు అవకాశాలు నిరాశ పరుస్తాయి. చేపట్టిన కార్యక్రమాలు కొన్ని వాయిదా వేస్తారు. ఆలోచనలు స్థిరంగా సాగవు. తీర్థ యాత్రలు చేస్తారు. వ్యాపారులు ఆచితూచి సాగాలి. ఉద్యోగు లకు అదనపు బాధ్యతలు మీద పడవచ్చు. 24,25 తేదీల్లో శుభవార్తలు. దత్తాత్రేయ స్తోత్రాలు పఠించండి.

**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

ప్రతికూల పరిస్థితులను సైతం అనుకూలంగా మార్చుకుంటారు. ముఖ్య కార్యక్రమాలలో విజయం సాధిస్తారు. సమాజంలో గౌరవం పొందుతారు. ఆశించినంత ఆదాయం సమకూరి అవసరాలు తీరతాయి. వాహనాలు, గృహం కొనుగోలు. ఉద్యోగస్తులకు అనుకూల మార్పులు. పారిశ్రామిక వేత్తలు, క్రీడాకారులకు నూతన నోత్సాహం. 25,26 తేదీల్లో మానసిక ఆందోళన. గాయత్రీ ధ్యానం చేయండి.

**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

విద్యార్థులకు ప్రతిభాపాటవాలు వెలుగులోకి వస్తాయి. చేపట్టిన కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేస్తారు. కొన్ని సమస్యలు తీరి ఊరట చెందుతారు. ఆస్తుల వ్యవహారాలలో చికాకులు తొలగుతాయి. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. రాజకీయ వేత్తలు, కళాకారులు, రచయితల యత్నాలు సఫలం. 20,21తేదీల్లో వ్యయప్రయాసలు. బంధు విరోధాలు. శారీరక రుగ్మతలు. ఆంజనేయ దండకం పఠించండి.

**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

పనులు సకాలంలో పూర్తి అవుతాయి. పట్టుదల, నేర్పుతో వివాదాలను పరిష్కరించుకుంటారు. స్థిరాస్తి విషయంలో కొత్త అగ్రిమెంట్లు చేసుకుంటారు. నిరుద్యోగులు అవకాశాలు దక్కుతాయి. వ్యాపారులకు పెట్టుబడులు ఊరటనిస్తాయి. ఉద్యోగస్తులకు విధుల్లో ప్రతిబంధకాలు తొలగుతాయి. పారిశ్రామిక వేత్తలు, కళాకారులు, పరిశోధకులకు ఆశలు చిగురిస్తాయి. 24,25ల్లో దుబారా ఖర్చులు. శారీరకరుగ్మతలు బాధిస్తాయి. దుర్గామాతకు కుంకుమార్చన చేయండి. ★

# పదరసం-404

## ఆధారాలు

**అడ్డం**

1. ఈ పరమహంస వివేకానందుల గురువు (4)
3. వివేకానందుల గురుపత్ని (4)
6. వద్దు, కాదనడానికి సంకేత పదం (2)
8. కుల్య, నీరుపారు మార్గము (3)
9. ఆడుకుక్క (3)
11. మాసము (2)
12. కారు దున్నపోతు (4)
13. బుద్ధి (2)
14. ముకుళించు, మోడ్చు (3)
16. సరస్వతి (2)
19. బంగారం (2)
21. అటుగా దున్నుటకు తగినంత వాన, వాడియయినది (3)
22. సైన్యము (2)
24. పరిచర్య (2)
25. శరీరము (2)
26. ముష్టి ఎత్తుట (3)
27. మోదుగుచెట్టు ఆకు (3)
29. ఆభరణము (2)
31. పిడికిలితో పొడుచుట (3)
30. న్యాయపతి ఇంటి పేరిట వీరు బాలానందం రేడియో అన్నయ్యగా ప్రసిద్ధులు (5)

**నిలువు :**

1. రోజూ ఒకటిన్నర గంటలు వుండే కాలం. ఈ సమయంలో ముఖ్యమైన కార్యక్రమాలు చాలామంది ప్రారంభించరు (5)
2. రైతు (5)
4. అల్లరి, గొడవ (3)
5. కానుక (4)
7. పారిపోవుట,... చిత్తగించడం (4)
10. మణితో స్త్రీ (3)
15. శిష్యుడికి గురువు ఇచ్చేది (6)
16. చురుకు, ఉపయోగించి (2)
17. కరుణ, కనికరము (4)
18. పూర్వపువారు భార్యలను ఇలానే సంబోధించేవారు (2)
20. చింతించువాడు, ఆలోచించువాడు (3)
23. ప్రపంచ ప్రసిద్ధ జలపాతం (4)
28. నిక్కరు (2)
30. కొన్ని పంక్తుల సముదాయము వ్యవహారంలో (2)

మా చిరునామా : పదరసం, జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-27

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ✠ | 1 | | 2 | | ✠ | 3 | 4 | | 5 |
| 6 | | ✠ | | ✠ | 7 | ✠ | | ✠ | |
| ✠ | 8 | | | ✠ | | ✠ | 9 | 10 | |
| 11 | | ✠ | 12 | | | | ✠ | 13 | |
| ✠ | 14 | 15 | | ✠ | | ✠ | 16 | | ✠ |
| 17 | ✠ | | ✠ | 18 | ✠ | 19 | | ✠ | 20 |
| 21 | | | ✠ | 22 | 23 | ✠ | ✠ | 24 | |
| | ✠ | 25 | | ✠ | 26 | | | ✠ | |
| 27 | 28 | | ✠ | 29 | | ✠ | ✠ | 30 | ✠ |
| ✠ | 31 | | | ✠ | 32 | | | | |

**పదరసం – 404**

పేరు : ..........................................................................................

చిరునామా:..........................................................................................

..........................................................................................

పిన్‌కోడ్ : .................. మొబైల్ : ..................................................

**సమాధానాలను** పైగడులలో పూరించి, కత్తిరించి కవర్‌పై పదరసం నెం. వేసి 2023 మార్చి 06 లోగా జాగృతికి పంపండి. సరైన సమాధానాలు రాసిన వారిని విజేతలుగా ప్రకటిస్తాం. ఒకరిని లాటరీ ద్వారా ఎంపికచేసి నగదు బహుమతి అందచేస్తాం. తుది నిర్ణయం జాగృతి యాజమాన్యందే.

## పదరసం - 400 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ✠ | 1 గ | ణ | 2 తం | త్ర | 3 ది | న | 4 ము | ✠ | 5 క |
| 6 త్ర | జ | ✠ | గే | ✠ | బ్బ | ✠ | 7 గ | 8 త | ము |
| 9 య | ము | 10 లో | డు | ✠ | ✠ | 11 రా | జ | గు | రు |
| త్నం | ✠ | పా | ✠ | 12 నే | 13 తా | జీ | ✠ | వు | ✠ |
| ✠ | 14 చ | ము | రు | ✠ | త | ✠ | 15 బ | ✠ | 16 ని |
| 17 బే | ✠ | ద్ర | ✠ | 18 పా | ✠ | 19 అ | సం | గ | తం |
| 20 టీ | క | ✠ | 21 మ | న్ | కీ | బా | త్ | ✠ | బం |
| బ | ✠ | 22 మ | నీ | షా | ✠ | ల | ✠ | 23 అ | ✠ |
| 24 దా | రె | డు | ✠ | 25 ప్ | 26 యా | ✠ | 27 సా | మె | 28 త |
| వో | ✠ | 29 గు | డి | ✠ | 30 ది | వ | ము | ✠ | మి |

**విజేతలు:** వి.ఆర్.రావు, కుసుమ రాజని, పులికంటి రాజేశ్వర రావు, ఎ.ప్రదీప్‌కుమార్, శ్రీపాదవిష్ణు – హైదరాబాద్, సిహెచ్ జ్యోతి, మేడ్చల్, రామలింగాచారి, ఋషపాక భాగ్యలక్ష్మి, కళ్లెం సంపత్, గుండు జ్యోతి– యాదాద్రి భువనగిరి, ఏ. గాయత్రీ, వి. విక్రమ్‌చారి, వికారాబాద్, అంజనీదేవి, విజయవాడ, మంత్రి ప్రగడా శ్రీహరిరావు, ఏలూరు, కె. జాహ్నవి, ఒంగోలు, డా. బి.ధన్వంతరి, మచిలీపట్నం, గుత్తిన వెంకటరమణ మోహన్, కోనసీమ, యస్.రాజు, కర్నూల్, పి. శాంతకుమారి, విశాఖ పట్నం, ఆర్.కౌముది, తెనాలి, కె.స్వప్న, ఒంగోలు. రాయవరపు శేషు, పిఠాపురం, ఉదాలి భాస్కరయ్య , చెన్నై,

**బహుమతి పొందిన విజేత : కె.ఎన్.స్వామి, భువనేశ్వర్**

సి ని మా

అరుణ

జయాపజయాలు అనేవి చిత్రసీమలో సర్వసాధారణం. ఓ వ్యక్తి ప్రతిభకు అవి ఎంతమాత్రం తార్కాణం కావు. కానీ వృత్తిపరమైన ఎదుగుదలకు మాత్రం విజయాలనేవి అవసరం. చాలా కాలం తర్వాత 'బింబిసార' చిత్రంతో విజయపథంలోకి అడుగుపెట్టిన నందమూరి కల్యాణ్ రామ్ తాజాగా మరోసారి 'అమిగోస్' మూవీతో తన అదృష్టాన్ని పరీక్షించుకున్నాడు. అమిగోస్ అంటే స్పానిష్ భాషలో మిత్రులు అని అర్థం కానీ చిత్రంగా ఈ సినిమా ప్రేక్షకుల పాలిట శత్రువు అయ్యింది. కథాబలం లేని 'అమిగోస్' వీక్షకులను ఆకట్టుకోవడంలో విఫలమైంది. జనవరిలో 'వీర సింహారెడ్డి', 'వాల్తేరు వీరయ్య' వంటి విజయవంతమైన చిత్రాలను నిర్మించిన మైత్రీ మూవీ మేకర్స్‌కు చేదు అనుభవాన్ని మిగిల్చింది.




# 'అమిగోస్' మిత్రులు కాదు.. శత్రువు!

కథ విషయానికి వస్తే సింపుల్. సిద్ధార్థ్ (కల్యాణ్ రామ్) హైదరాబాద్‌లో తండ్రి వ్యాపార వ్యవహారాలు చూస్తుంటాడు. అతను ఇషికా (ఆషికా రంగనాథ్) అనే ఆర్.జె.తో ప్రేమలో పడతాడు. కానీ అది సక్సెస్ కాకుండా అవరోధాలు ఎదురవుతాయి. అదే సమయంలో అతనికి డోపెల్ గాంగర్స్ అనే వెబ్‌సైట్ గురించి తెలుస్తుంది. తనని పోలిన మనుషులు ఈ ప్రపంచంలో ఇంకా ఎవరెవరు? ఎక్కడెక్కడ ఉన్నారా? అని సెర్చ్ చేయడం మొదలు పెడతాడు. అలా బెంగళూర్‌లో ఉండే మంజునాథ్ హెగ్డే (కల్యాణ్‌రామ్), కోల్‌కత్తాలో ఉండే మైఖేల్ (కల్యాణ్ రామ్) టచ్‌లోకి వస్తారు. ముగ్గురూ కలిసి గోవాలో సరదాగా గడిపేస్తారు. సిద్ధార్థ్ ప్రేమ విషయంలో సహాయం చేయడానికి వాళ్లిద్దరు కూడా హైదరాబాద్ వస్తారు.

అయితే... అక్కడే ఓ చిన్న ట్విస్ట్. అప్పటికే మైఖేల్ కోసం ఎన్.ఐ.ఎ. అధికారులు వెదుకుతూ ఉంటారు. హైదరాబాద్‌లో మైఖేల్ అనుకుని, మంజునాథ్‌ను అదుపులోకి తీసుకుంటారు. బిపిన్ రాయ్ అనే మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ మైఖేల్‌గా ఎందుకు మారాడు? ఎన్.ఐ.ఎ. అధికారుల చేతికి చిక్కిన అమాయకుడైన మంజునాథ్ తిరిగి బయటకు వచ్చాడా? అమాయకంగా మైఖేల్ గేమ్‌లో భాగస్వామి అయిపోయిన సిద్ధార్థ్ అతనికి ఎలా చెక్ పెట్టాడు? అనేది మిగతా కథ.

మనుషులను పోలిన మనుషులు ఉండటం అనేది సర్వసాధారణం. అలాంటి వారి మీద వివిధ భాషల్లో చాలానే సినిమాలు వచ్చాయి. అయితే మన సినిమాల్లో తండ్రీ కొడుకులుగానో, అన్న దమ్ములుగానో వాళ్ల పాత్రలను రచయితలు రాశారు. అలానే పూర్తిగా సంబంధం లేని లుక్ ఎ లైక్ పాత్రలతోనూ కొన్ని సినిమాలు వచ్చాయి. అయితే అలాంటి వ్యక్తులను కలుసుకోవడం కోసం ఉన్న వెబ్‌సైట్ గురించి వివరాలను ఈ సినిమాలో చూపించడం, దాని ఆధారంగా ముగ్గురు అపరిచితులు ఒకచోటకు చేరుకోవడం, అందులో ఒకరు విలన్ కావడం ఈ సినిమాలోని ప్రత్యేకత. అయితే కథా నేపథ్యం ఇది కాకపోయినా ఇదే తరహా క్యారెక్టరైజేషన్స్‌తో జూనియర్ ఎన్టీయార్ ఆ మధ్య 'జై లవకుశ' అనే సినిమా చేశాడు. దానికి కల్యాణ్‌రామే నిర్మాత. ఇప్పుడు అదే తరహా చిత్రం అతనే చేశాడు. దీనికి మాత్రం మైత్రీ మూవీ మేకర్స్ అధినేతలు నవీన్ ఎర్నేని, రవిశంకర్ నిర్మాతలు. దర్శకుడు రాజేంద్ర రెడ్డి రాసుకున్న కథలోని పాయింట్ కొత్తదే అయినా... దానిని విస్తరించిన తీరు, కథనం ఆసక్తికరంగా లేవు. రొటీన్ పంథాలో మూవీ సాగిపోవడంతో ఏ స్థాయిలోనూ దీని మీద ఆసక్తి అనేది ప్రేక్షకులకు కలగదు. పైగా కల్యాణ్ రామ్‌కు ప్రతినాయకుడి పాత్రలు పోషించడం కొత్తేమి కాదు. మొన్న వచ్చిన 'బింబిసార'లోనూ అలాంటి నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రను చేశాడు. ఇందులోనూ మైఖేల్ పాత్రలో అదే తరహా హావభావాలను ప్రదర్శించాడు. పైగా మూవీ అంతా కల్యాణ్ రామే కనిపించడంతో చూసే ప్రేక్షకుడికి కాస్తంత మొనాటనీ అనిపిస్తుంది. ఊహకందని ట్విస్టులు, ఆకట్టుకునే సన్నివేశాలు ఉంటే అది వేరే సంగతి. అలా కూడా లేదు. మూవీ మొత్తం చాలా ఫ్లాట్‌గా సాగిపోయింది.

నటీనటుల విషయానికి వస్తే కల్యాణ్ రామ్‌లో ఎందుకో అంత ఛామ్ కనిపించలేదు. గోవాలోని పాటలో తప్పితే... పెద్దంత అందంగా ఎక్కడా లేదు. మైఖేల్ క్యారెక్టర్, బాడీ లాంగ్వేజ్ కాస్తంత బెటర్. ఆషికా రంగనాథ్ ఓకే. అయితే ఆమెకు స్కోప్ తక్కువ ఉంది. ఇందులోని ఇతర ప్రధాన పాత్రలను జయ ప్రకాశ్, కల్యాణి నటరాజన్, బ్రహ్మాజీ, రవిప్రకాశ్, సప్తగిరి తదితరులు పోషించారు. జిబ్రాన్ నేపథ్య సంగీతం, పాటల బాణీలు ఏమంత చెప్పుకోదగ్గవిగా లేవు. బాలకృష్ణ సినిమాలోని 'ఎన్నో రాత్రులొస్తాయి కానీ' పాటను రీమిక్స్ చేశారు. కానీ దాని పిక్చరైజేషన్ ఏమంత గొప్పగా లేదు.

పబ్లిసిటీకి, సినిమా మీద అంచనాలు పెంచడానికి మాత్రమే అది ఉపయోగ పడింది. కె. సౌందర్ రాజన్ సినిమాటోగ్రఫీ బాగానే ఉంది. 'అమిగోస్' టైటిల్, ట్రైలర్‌తో ఓ వైవిధ్యమైన చిత్రాన్ని చూడబోతున్నాం అనే భావనతో థియేటర్‌కు వచ్చినవారికి నిరాశే మిగులుతుంది. టైమ్ పాస్ కోసం అయితే థియేటర్‌కు పనిగట్టుకుని వెళ్లి చూడాల్సిన అవసరం లేదు. ఓటీటీలో ప్రసారం అయినప్పుడు కూడా చూడొచ్చు. ఏదేమైనా.. కల్యాణ్ రామ్ కొత్త దర్శకులను ప్రోత్సహించడం మంచిదే అయినా... కథ, కథనాల విషయంలోనూ కొంత ఇన్వాల్వ్ కాకతప్పదు. లేకపోతే అతన్ని నమ్ముకుని సినిమాలు తీసే నిర్మాతలకు, ప్రేక్షకులకు అన్యాయం చేసినట్టు అవుతుంది.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్









# అద్భుతం కదా!

పుష్ప, ఫల ప్రదర్శన కార్యక్రమాన్ని ఇటీవల పుణే మున్సిపల్ కార్పొరేషన్ నిర్వహించింది. ఇది 41వ ప్రదర్శన. ఛత్రపతి శంభాజీ రాజే ఉద్యాన్, జంగ్లి మహరాజ్ రోడ్‌లోను ఈ పోటీలు జరిగాయి. మనిషి జీవితంలో చెట్లు, అవి ఇచ్చే పళ్లు, నిత్య జీవితంలో అవసరమయ్యే కూరగాయల ప్రాధాన్యం చెప్పడానికి ఈ పోటీ ఏర్పాటు చేస్తారు. పళ్లు, పూలు, కూరగాయలు అన్నీ కలిపి దాదాపు 218 రకాలను ఇక్కడ ప్రదర్శించారు. బోన్సాయ్ వృక్షాలు, వెదురుతో చేసిన కళాఖండాలను, చెత్తను పునర్ వినియోగించే పద్ధతులు కూడా ఇందులో ప్రదర్శించారు.







From: **JAGRITI Telugu Weekly**
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2021-2023; RNI Regd. No. 3270/57.
Volume : 75 Issue : 18


# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు



వెల : ₹.200/-




వెల : ₹.200/-



వెల : ₹.390/-



వెల : ₹.300/-



వెల : ₹.200/-




వెల : ₹.200/-




వెల : ₹.200/-





వెల : ₹.200/-




వెల : ₹.250/-




వెల : ₹.250/-





వెల : ₹.599/-





వెల : ₹.695/-




వెల :₹.799/-




వెల : ₹.799/-




వెల : ₹.549/-

**పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : 3-4-852, కేశవనిలయం, బర్కత్‌పురా, హైదరాబాద్ -27.

040-27563236, 9290127329

సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, గవర్నరు పేట, విజయవాడ - 2, దూరవాణి : 63035 41244